అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

సోమవారం 5-2 -2018

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 3 సంచిక : 38 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | 12 + 16 పేజీలు వెల : 5.00



అభివాదం చేస్తున్న ఏచూరి, సున్నం రాజయ్య, అరుణ్‌కుమార్, నంద్యాల, వెంకట్, వీరయ్య, చెరుపల్లి, హేమలత, బివి రాఘవులు, మల్లు స్వరాజ్యం, తమ్మినేని, జూలకంటి, నాగయ్య, డీజీ, రాములు

దేశానికి ప్రత్యామ్నాయం వామపక్షాలే..



లెఫ్ట్ బలపడాలి.. మతోన్మాదాన్ని బలహీనపరచాలి

సామాజిక దోపిడీకి వ్యతిరేకంగా పెరుగుతున్న చైతన్యం

ఇది వర్గపోరాటానికి అనుకూల పరిస్థితి...

సీపీఐ (ఎం) రాష్ట్ర మహాసభల ప్రారంభోపన్యాసంలో ఏచూరి

వివరాలు 9లో

దేశానికి వామపక్షాలే ప్రత్యామ్నాయమని సీపీఐ (ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అన్నారు. లెఫ్ట్ పార్టీలు బలపడటం ద్వారానే మతోన్మాదాన్ని బలహీనపరచగలమని చెప్పారు. సామాజిక అణచివేత, దోపిడీకి వ్యతిరేకంగా దేశం మొత్తం మీద చైతన్యం పెరుగుతున్నదని తెలిపారు. ఇది వర్గపోరాటానికి అనుకూల స్థితిని సూచిస్తున్నదని వివరించారు. ఈ నేపథ్యంలో అలాంటి చైతన్యాన్ని మరింతగా ప్రోత్సహించటం ద్వారా పోరాటాలకు పదును పెట్టాలని పిలుపునిచ్చారు. సీపీఐ (ఎం) రాష్ట్ర ద్వితీయ మహాసభలు ఆదివారం నల్లగొండ(నర్రా రాఘవరెడ్డి నగర్)లో ఆరంభమయ్యాయి. ఈ సందర్భంగా మల్లు లక్ష్మి, జి.నాగయ్య, సున్నం రాజయ్య, కిల్లె గోపాల్, పైళ్ల ఆశయ్య అధ్యక్షవర్గంగా వ్యవహరించిన ప్రతినిధుల సభలో ఏచూరి ప్రారంభోపన్యాసం చేశారు.



లాల్-నీల్ ఐక్యతతోనే నవశకం

సీతారాం ఏచూరి 9లో



బీజేపీని సాగనంపితేనే దేశ భవిష్యత్

బివి రాఘవులు 9లో



ఆధునిక నిజాంలను కూల్చడమే..

తమ్మినేని వీరభద్రం 10లో



నల్లగొండలో ఎర్రసైన్యం 10లో

మార్పు కోసమే రాజకీయ పార్టీ

- త్వరలో పేరు ప్రకటిస్తాం..: టీజేఏసీ చైర్మెన్ కోదండరామ్

వివరాలు 9లో

బడ్జెట్ సమావేశాల్లోనే... పంచాయతీరాజ్ బిల్లు

- జనాభా ప్రాతిపదికన పంచాయతీలకు 5లక్షల నుంచి 30 లక్షల నిధులు : సీఎం కేసీఆర్

వివరాలు 7లో

మేక్ ఇన్ ఇండియా కాదు.. ప్రొటెక్ట్ ఇన్ ఇండియా

- ఏ వర్గాన్నీ ఆకట్టుకోని బడ్జెట్
- లక్ష్యాలను అందుకోలేకనే మారిన మోడీ వ్యూహం

వివరాలు 9లో

భారతీయ జనతాపార్టీకి బండి సంజయ్ గుడ్‌బై

- స్వంతపార్టీకి షాక్‌ల మీద షాక్‌లు
- పార్టీ అధిష్టానానికి తలనొప్పులు
- అంతర్మథనంలో బీజేపీ అధిష్టానం

9లో

కొక్కొరోకో..



ఊరుకోండి.. సార్..! ఏంజేయలే.. అని పదే పదే అంటే.. మల్లా ఓ సారి నోట్ల రద్దు జేసి... జీఎస్టీ వేస్తారు...!!



2లో

అమెరికాలో ప్రవాస భారతీయుల నిరసనలు

భారత్ వీడుతున్న కుబేరులు

గతేడాదిలో ఏడు వేల మంది భారతీయ మిలియనీర్ల వలస



న్యూఢిల్లీ: ప్రతీ ఏటా వేలాదిమంది సంపన్నులు భారత్‌ను వీడి... విదేశాలకు వెళ్లిపోతున్నారు. గతేడాది దాదాపు ఏడు వేల మంది సంపన్నులు భారత్ నుంచి ఇతర దేశాలకు వలస వెళ్లిపోయారు. ఇతర దేశాలకు వెళ్తున్న సంపన్నుల జాబితాలో చైనా ముందుండగా, రెండో స్థానంలో భారత్ నిలిచింది. అంతకు ముందు ఏడాదితో పోల్చుకుంటే భారత్ నుంచి విదేశాలకు వలసలుగా వెళ్లిపోయిన మిలియనీర్ల సంఖ్య 16 శాతం పెరిగింది. దీనికి సంబంధించిన నివేదికను 'న్యూవరల్డ్ వెల్త్' ఇటీవల విడుదల చేసింది. ఈ నివేదిక ప్రకారం 1 మిలియన్ డాలర్(రూ.6.4కోట్లు), అంతకన్నా ఎక్కువ వ్యక్తిగత నికర ఆస్తికలిగిన సంపన్నులు భారతదేశంలో మొత్తం 3,30,400మంది, మల్టీ మిలియనీర్లు 20,730 మంది, 119 మంది బిలియనీర్లు ఉన్నారని నివేదిక తెలిపింది. అత్యధిక బిలియనీర్లు ఉన్న దేశాల్లో అమెరికా, చైనా తర్వాత భారత్ మూడో స్థానంలో ఉంది. అంటే వ్యక్తిగతంగా వీరి నికర ఆస్తి రూ.6414 కోట్ల నుంచి ఆపైన ఉంటుంది. ఇక ప్రపంచంలోనే అత్యధిక సంపదకలిగివున్న ...9లో

ముంబయి 'ఐఐటీ'లో..నాన్‌వెజ్ బంద్



ముంబయి: మహారాష్ట్ర రాజధాని ముంబయిలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ)-బీ సివిల్ ఇంజనీరింగ్ క్యాంటీన్‌లో మాంసాహారాన్ని బంద్ చేశారు. హాస్టల్ యాజమాన్య కమిటీ శనివారం తీసుకున్న నిర్ణయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే..కొన్ని రోజుల కిందటి వరకు మాంసాహారం తినేవారు ప్రత్యేక ప్లేట్లు ఉపయోగించాలని శాఖాహార విద్యార్థుల నుంచి ఫిర్యాదులు వచ్చాయి. దీంతో ఈ డిపార్ట్‌మెంట్ క్యాంటీన్‌లో మాంసాహారాన్ని నిషేధించాలని ఆ కమిటీ ఆదేశాలను జారీచేసింది. ఫుడ్ సరఫరా చేస్తున్న సంస్థకు నాన్‌వెజ్ రకాలు నిషేధించాలని వాటిని సరఫరా చేయవద్దని ఈ సివిల్ ఇంజనీరింగ్ హాస్టల్ కమిటీ తెలిపింది. కోడిగుడ్లు సహా ఇతర మాంసాహార వంటకాలను , లంచ్, డిన్నర్ పార్టీలలోనూ బంద్ చేశారు. దీనిపై మార్పు తీసుకొనిరావాలని కొందరు విద్యార్థులు సోషల్‌మీడియా ద్వారా ప్రయత్నిస్తున్నారు. వండిన, వేడిచేసిన ఆహారపదార్థాలను క్యాంటీన్‌లో వడ్డించరాదని నిబంధనల్లో ఉందని ఆ యూనివర్సిటీకి చెందిన ప్రతినిధి ఒకరు తెలిపారు. స్నాక్స్‌కు మాత్రమే అనుమతి ఉందన్నారు. క్యాంపస్‌లో మాంసాహారాన్ని పూర్తిగా తొలగించేలా యాజమాన్యం ప్రయత్నిస్తున్నదని ఎంటెక్ విద్యార్థి ఒకరు తెలిపారు.

ఎగ్జిట్ గేట్‌లో కాంగ్రెస్

బెంగళూర్ ర్యాలీలో ప్రధాని నరేంద్ర మోడీ

న్యూఢిల్లీ : కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ నిష్క్రమణ దశలో ఉందని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. బీజేపీ సీఎం అభ్యర్థి బీఎస్ యడ్యూరప్ప చేపట్టిన పరివర్తన యాత్ర ముగింపు సందర్భంగా ఆదివారం ప్యాలెస్ గ్రౌండ్‌లో జరిగిన ర్యాలీని ఉద్దేశించి ప్రధాని ప్రసంగించారు. కాంగ్రెస్ పాలన తెరపడుతోందనేందుకు ర్యాలీకి భారీగా హాజరైన ప్రజలే సంకేతమన్నారు. ప్రజా సంక్షేమానికి కేంద్రం కేటాయించిన నిధులను కాంగ్రెస్ పార్టీ తన సంక్షేమానికి వాడుకుంటోందని ఆరోపించారు. 2014 నుంచి కర్ణాటకకు కేంద్రం కేటాయించిన నిధుల వివరాలను ప్రధాని వివరించారు. త్వరలో ఇక్కడ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో భాజపా రాష్ట్రమంతటా పరివర్తన యాత్రను నిర్వహించింది. అయితే మోడీ ర్యాలీని అడ్డుకోవాలని స్థానికులు ప్రయత్నించారు. కర్ణాటక అభివృద్ధికి ఉపయోగించాల్సిన నిధులను సీఎం సిద్ధరామయ్య దారిమళ్లించారని మోడీ విమర్శించారు. ఈ విషయాలపై ప్రజలు దృష్టిసారించాలని కోరారు.

సరిహద్దులో పాక్ కాల్పులు

ఆర్మీ కెప్టెన్ సహా నలుగురు జవాన్లు మృతి

శ్రీనగర్: దేశ సరిహద్దు వెంబడి పాకిస్థాన్ కవ్వింపు చర్యలు ఆగడం లేదు. జమ్మూకాశ్మీర్‌లోని రాజౌరీ జిల్లాలో ఉన్న నియంత్రణ రేఖ వద్ద పాక్ సైన్యం ఆదివారం కాల్పులకు తెగబడింది. ఈ ఘటనలో భారత ఆర్మీ యువ కెప్టెన్ కపిల్ కుందూ(23) సహా నలుగురు జవాన్లు చనిపోగా.. బీఎస్‌ఎఫ్ ఎస్‌ఐ తీవ్రంగా గాయపడ్డాడు. జిల్లాలోని సుందర్ బనీ ప్రాంతంలో ఆదివారం ఉదయం పాక్ రేంజర్లు కాల్పులు జరిపారు. అనంతరం భారత సైన్యం కూడా ఎదురుకాల్పులు ప్రారంభించింది. ఆదివారం సాయంత్రం వరకు ఇరువర్గాలకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయని భద్రతాదళాల అధికారి ఒకరు వెల్లడించారు.

త్రిపుర మాణిక్యం



కమ్యూనిస్టు నేతగా ఎదిగి .. త్రిపుర ముఖ్యమంత్రిగా 20 ఏండ్లు..

- మాణిక్ సర్కార్ నిరాడంబర జీవితం
- ఇతర ముఖ్యమంత్రుల ఆస్తులపై జాతీయ మీడియాలో విశ్లేషణలు

త్రిపుర అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి, సీపీఐ(ఎం) నేత మాణిక్ సర్కార్(69) తన ఆస్తుల గురించి ప్రకటించడంతో రాజకీయ నేతలపై మరోసారి జాతీయ స్థాయిలో చర్చించుకుంటున్నారు. ప్రస్తుత రాజకీయ వ్యవస్థలో ముఖ్యమంత్రి స్థాయిలోని వ్యక్తులు అంత నిరాడంబరంగా జీవించడం అరుదైన సంఘటనే అని రాజకీయ పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. త్రిపుర అసెంబ్లీ ఎన్నికలను ప్రజల కోసం నిజాయితీగా పని చేసేవారికీ..అవినీతిలో కూరుకుపోయిన వారికీ మధ్య సమరంగా వర్ణిస్తున్నారు.

నవతెలంగాణ జనరల్‌డెస్క్

ఎమ్మెల్యేలుగా, ఎంపీలుగా పోటీ చేసే రాజకీయ నేతలు ఎన్నికల కమిషన్‌కు వారి ఆస్తుల గురించి ప్రకటించాలన్న నిబంధన ఉన్న విషయం తెలిసిందే. 20 ఏండ్లుగా త్రిపుర ముఖ్యమంత్రిగా కొనసాగుతున్న మాణిక్‌సర్కార్ తనకు ప్రభుత్వం ఇచ్చే గౌరవ వేతనాన్ని కూడా పార్టీకే ఇస్తున్నారు. హోల్‌టైమర్‌గా పని చేస్తున్నందుకు ఆయనకు నెలకు రూ.5000 చొప్పున పార్టీ ఇస్తోంది. ఆయన భార్య కేంద్ర ప్రభుత్వ ఉద్యోగిగా రిటైర్ కావడంతో వారికి పింఛన్ వస్తోంది. మరో ఆదాయం లేకుండా వారిద్దరూ తమకు నెలసరి వచ్చే గౌరవ వేతనాలపై ఆధారపడి జీవిస్తున్నారు. వారికి సంతానం కూడా లేకపోవడం గమనార్హం. మాణిక్‌సర్కార్ పేరున ఉన్న బ్యాంక్ బ్యాలెన్స్(జనవరి వరకు) రూ.2410 మాత్రమే. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగిగా కూడేసిన డబ్బుతో మాణిక్ భార్య పేరున



కొన్న ఆస్తి విలువ రూ.26 లక్షలు. దేశంలోని ఏ ముఖ్యమంత్రి కుటుంబమూ ఇంత తక్కువ ఆస్తికి పరిమితమై లేరని ఎన్నికల కమిషన్‌కు వారు ఇచ్చిన అఫిడవిట్ల ద్వారా తెలుస్తోంది. మాణిక్ సర్కార్ మాత్రమే కాకుండా త్రిపురకు చెందిన సీపీఐ(ఎం) నేతలంతా సుదీర్ఘకాలం పదవుల్లో ఉండి కూడా తమ కుటుంబాల కోసం సంపదను పోగేసుకోలేదన్న సదభిప్రాయం ఆ రాష్ట్ర ప్రజల్లో ఉన్నది. దేశంలోనే అత్యధిక ఆస్తులు కలిగిన ముఖ్యమంత్రిగా ఆంధ్రప్రదేశ్ సీఎం నారా చంద్రబాబునాయుడు నిలిచారు. 2014లో ఎన్నికల కమిషన్‌కు సమర్పించిన లెక్కల ప్రకారం చంద్రబాబు కుటుంబ ఆస్తుల విలువ రూ.177 కోట్లు. ఆ తర్వాతి స్థానంలో బీజేపీకి చెందిన అరుణాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి పెమాఖండూ నిలిచారు.

రాష్ట్రం పేరు	ముఖ్యమంత్రి	మొత్తం ఆస్తులు	పార్టీ	ప్రకటించిన సంవత్సరం నాటికి
హిమాచల్ ప్రదేశ్	జైరామ్‌ఠాకూర్	రూ.3.27 కోట్లు	బీజేపీ	2017
గుజరాత్	విజయ్‌కుమార్ రూపానీ	రూ.9.09 కోట్లు	బీజేపీ	2017
ఉత్తర్‌ప్రదేశ్	యోగీ ఆదిత్యనాథ్	రూ.95.9 లక్షలు	బీజేపీ	2017
అరుణాచల్‌ప్రదేశ్	పెమా ఖండూ	రూ.129 కోట్లు	బీజేపీ	2014
అస్సాం	సర్బనందా సోనోవాల్	రూ.1.85 కోట్లు	బీజేపీ	2016
చత్తీస్‌గఢ్	రమణ్‌సింగ్	రూ.5.61 కోట్లు	బీజేపీ	2013
గోవా	మనోహర్ పారికర్	రూ.6.29 కోట్లు	బీజేపీ	2017
హర్యానా	మనోహర్‌లాల్ ఖట్టర్	రూ.61 లక్షలు	బీజేపీ	2014
జార్ఖండ్	రఘుబర్‌దాస్	రూ.72 లక్షలు	బీజేపీ	2014
మధ్యప్రదేశ్	శివ్‌రాజ్‌సింగ్ చౌహాన్	రూ.6 కోట్లు	బీజేపీ	2013
మహారాష్ట్ర	దేవేంద్ర ఫడ్నవీస్	రూ.4.34 కోట్లు	బీజేపీ	2014
మణిపూర్	బీరేన్	రూ.1.56కోట్లు	బీజేపీ	2017
రాజస్థాన్	వసుంధరారాజే	రూ.4కోట్లు	బీజేపీ	2013
సిక్కిం	పవన్ చామ్లింగ్	రూ.10.7కోట్లు	ఎస్‌డీఎఫ్	2014
బీహార్	నితీష్‌కుమార్	రూ.2.73కోట్లు	జేడీ(యు)	2015
ఆంధ్రప్రదేశ్	నారా చంద్రబాబునాయుడు	రూ.177కోట్లు	టీడీపీ	2014
పంజాబ్	అమరీందర్‌సింగ్	రూ.48కోట్లు	కాంగ్రెస్	2017
మిజోరాం	లాల్‌థాన్‌హ్వా	రూ.9కోట్లు	కాంగ్రెస్	2017
కర్నాటక	సిద్ధరామయ్య	రూ.13.6కోట్లు	కాంగ్రెస్	2013

తిరుగుబాటుదారులపై ప్రతీకారం తీర్చుకుంటాం : టర్కీ

అంకారా: సిరియాలో మోహరించిన తమ సైనికులపై మెరుపుదాడికి పాల్పడ్డ కుర్దు తిరుగుబాటుదారులపై ప్రతీకారం తీర్చుకుంటామని టర్కీ పేర్కొన్నది. కుర్దు తిరుగుబాటుదారుల శిబిరాలను ధ్వంసం చేయనున్నట్టు ప్రకటించింది. టర్కీ ఆర్మీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం... ఆఫ్రిన్ నగరానికి సమీపంలో ఉన్న షేక్ హరూజ్ నగరంలో కుర్దు తిరుగుబాటుదారులు ఆదివారం బీభత్సం సృష్టించారు. టర్కీ సైనికుల యుద్ధ ట్యాంక్‌పై వైమానిక దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో ఏడుగురు సైనికులు మృతి చెందారు. మరికొందరు తీవ్రంగా గాయపడ్డారదు. క్షతగాత్రులను సైనిక ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై టర్కీ ప్రధాని బినాలీ ఇల్దిరిమ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

అమెరికాలో రెండు రైళ్లు ఢీ : ఇద్దరు మృతి

వాషింగ్టన్ : అమెరికాలో రైలు ప్రమాదం జరిగింది. రెండు రైళ్లు ఢీకొనడంతో ఇద్దరు మృతి చెందారు. 50 మందికిపైగా గాయపడ్డారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశముంది. ప్యాసింజర్ రైలు న్యూయార్క్ నుంచి మియామికి వెళుతుండగా దక్షిణ కరోలీన వద్ద ఒక గూడ్స్ రైలును ఢీకొంది. ఈ ఘటన అమెరికా కాలమానం ప్రకారం..ఆదివారం తెల్లవారు జామున 2.35 సమయంలో(భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం1.05) జరిగింది. ఈ ప్రమాదంలో ప్రయాణికుల రైలు ఇంజిన్ ఎదురుగా వస్తున్న గూడ్స్ రైలును ఢీకొని వెనుక బోగీలపై పడింది. ప్రమాదం జరిగిన సమయంలో ఈ రైల్లో 8మంది సిబ్బంది 139 మంది ప్రయాణికులు ఉన్నారు. దక్షిణ కరోలినాలోని కొలంబియా పట్టణ శివార్లలో ఈ ఘటన చోటు చేసుకుంది. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు.

మాల్దీవ్‌లో నిరసనలు

- అరెస్టయిన ఎంపీలను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్



మాలె : మాల్దీవ్‌లో నిరసనలు మిన్నంటాయి. అవినీతి ఆరోపణలపై మాజీ అధ్యక్షుడు మహ్మద్ నషీద్, ఉపాధ్యక్షుడు అహ్మద్ అబీబ్ సహా 12 మంది ఎంపీలను గతవారం పోలీస్ అధికారులు అరెస్ట్ చేశారు. అయితే, అరెస్టయిన వారందరినీ బెయిల్‌పై విడుదల చేయాలని సుప్రీంకోర్టు గురువారం తీర్పునిచ్చింది. అయితే, సుప్రీంకోర్టు తీర్పుకు విరుద్ధంగా మాల్దీవ్ అధ్యక్షుడు అబ్దుల్లా యామీ వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అరెస్టయిన ఎంపీలపై విచారణ జరిగేంత వరకు వారిని విడుదల చేయబోమని అధ్యక్షుడు ఆదేశాలు జారీ చేశారు. దీంతో, అరెస్టయిన 12 మంది ఎంపీలను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ నిరసనకారులు చీఫ్ జస్టిస్ అబ్దులా సయీద్ ఇంటి ముందు బైఠాయించారు. దేశాధ్యక్షుడికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దేశాధ్యక్షుడి హోదాలో ఉండి కోర్టు ధిక్కరణకు యామీ పాల్పడుతున్నారని గళమెత్తారు. దీంతో, ఇక్కడ ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకున్నది. చీఫ్ జస్టిస్‌తో పాటు సుప్రీంకోర్టు న్యాయమూర్తి అలీ హమీద్ తక్షణమే రాజీనామా చేయాలని నిరసనకారులు డిమాండ్ చేశారు. మాల్దీవన్ డెమోక్రటిక్ పార్టీకి చెందిన ఎంపీలు ఈ నిరసన కార్యక్రమాలకు నేతృత్వం వహించారు. ఈసందర్భంగా ఎంపీ ఈవా అబ్దుల్లా మాట్లాడారు. ఎంపీలపై పోలీసులు దౌర్జన్యానికి పాల్పడుతున్నారని విమర్శించారు. అరెస్టయిన ఎంపీలను విడుదల చేయాలని శాంతియుతంగా నిరసన ప్రదర్శన చేస్తున్న తమపై పోలీసులు పెప్పర్‌స్ప్రే, భాష్పవాయుగోళాలు ప్రదర్శించడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అరెస్టయిన ఎంపీలు విడుదలయేంత వరకు తమ పోరాటం కొనసాగుతుందని అన్నారు.

అమెరికాలో ప్రవాస భారతీయుల నిరసనలు

- గ్రీన్‌కార్డుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్



వాషింగ్టన్ : అమెరికాలోని ప్రవాస భారతీయులు గళమెత్తారు. తమ గ్రీన్‌కార్డుల సమస్యలు పరిష్కరించాలంటూ నినాదాలు చేశారు. కాలిఫోర్నియా, టెక్సాస్, చికాగో, ఫ్లోరిడా, న్యూయార్క్, మసాచుసెట్స్ నుంచి వాషింగ్టన్‌కు భారీ ఎత్తున చేరుకున్న నిరసనకారులు వాషింగ్టన్ వీధుల్లో ప్లకార్డులు, బ్యానర్లు చేబూని నినదించారు. ఇమ్మిగ్రేషన్ విధానాలపై పూటకో ప్రకటన చేస్తూ ట్రంప్ తమను అయోమయానికి గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 'ప్రతిభ ఆధారిత వలస విధానం వైపు అడుగుల వేయాలని నిర్ణయించుకున్నాం. మన దేశాన్ని ప్రేమించే వారికి, గౌరవించేవారికి, మన సమాజ అభివృద్ధి కోసం కృషి చేసేవారికి, నైపుణ్యవంతులకు.. ప్రతిభ ఆధారిత వలస వ్యవస్థను కల్పించనున్నాం' అని గతవారం ట్రంప్ ప్రకటించిన సంగతి తెలిసిందే. 'రిపబ్లికన్ హిందూ అలియన్స్' సభ్యులు శ్వేతసౌధం ఎదుట భారీ ర్యాలీ చేపట్టారు. ప్రతిభ ఆధారిత వలస విధానాన్ని ట్రంప్ ప్రోత్సహించడం అభినందనీయమే అయినప్పటికీ, గ్రీన్‌కార్డుల సమస్యలను పరిష్కరించడంలో సర్కార్ విఫలమైందని నినదించారు. 'ఎన్నో ఏండ్లుగా మేమంతా గ్రీన్‌కార్డు కోసం వేచి చూస్తున్నాం. ఏండ్లు గడుస్తున్నప్పటికీ మాకు గ్రీన్‌కార్డు లభించడం లేదు. దీంతో మా పిల్లల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. వారి విద్యకు ఆటంకం ఏర్పడుతోంది. గ్రీన్‌కార్డుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి' అని కోరుతూ ప్రవాస భారతీయులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. లాటరీ ఆధారిత వీసా విధానానికి స్వస్తి పలికి ప్రతిభ ఆధారిత వలస వ్యవస్థ వైపు అడుగులు వేయడంతో అమెరికాలో వలసదారులకు శాశ్వత నివాసం ఏర్పాటుచేసుకునే విషయంలో ఎదురయ్యే కష్టాలు తీరనున్నాయి. అమెరికా మొత్తం మీద దాదాపు 3.5 మిలియన్ల మంది భారతీయులు ఉన్నారు. ఒక్క వాషింగ్టన్ రీజియన్‌లోనే దాదాపు 1.37లక్షల మంది భారతీయులు ఉంటున్నట్టు యూఎస్ జనాభా లెక్కలు చెబుతున్నాయి. మరోవైపు కుటుంబ ఆధారిత వలస విధానాన్ని నియంత్రించేందుకు ఉద్యోగుల జీవిత భాగస్వాములు, వారి మైనర్ పిల్లలకే వీసా స్పాన్సర్‌షిప్‌ను పరిమితం చేసే ఆలోచనల్లో ట్రంప్ ప్రభుత్వం ఉంది. పిల్లల రాకను అనుమతిస్తూ చేపట్టిన కార్యక్రమం ద్వారా 6,90,000మంది ప్రయోజనం పొందనున్నారు. అయితే, ఇందులో న్యాయపరంగా అన్ని రకాలుగా సరైన పత్రాలను కలిగి ఉన్నవారికే ప్రాధాన్యత కల్పించాలని భావిస్తున్నారు. అయితే పిల్లల విషయంలోనూ సమన్యాయం పాటించాలని భారతీయ టెకీలు అభిప్రాయపడుతున్నారు. ' అమెరికాకు రావాలని మా పిల్లలెవరూ భావించలేదు. మేము వారికి ఉజ్వల భవిష్యత్ అందించాలనే ఆలోచనతో ఇక్కడికి తీసుకొచ్చాం" అని పిల్లలకు గ్రీన్‌కార్డు మంజూరీ విషయంలో ఆలోచించాలని భారతీయ టెకీలు అభ్యర్థిస్తున్నారు. 'నేను ఇక్కడికి వచ్చినపుడు నాకు ఆరేండ్ల కూతురు ఉంది. 2007 నుంచి నేను గ్రీన్‌కార్డు కోసం ఎదురుచూస్తునే ఉన్నాను. నేను అమెరికాకు వచ్చినప్పటి నుంచి ఇక్కడ పన్ను చెల్లిస్తూనే ఉన్నాను ' అని ఉత్తర కరోలినాలో సాఫ్ట్‌వేర్ ఇంజినీరుగా పనిచేస్తున్న 45ఏండ్ల నందు కొండూరి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేలాది మంది భారతీయులు గ్రీన్ కార్డు కోసం ఏండ్ల తరబడి ఎదురుచూస్తూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.


దెబ్బకు దెబ్బ

- రష్యా వైమానిక దాడిలో 30 మంది తిరుగుబాటుదారులు మృతి



మాస్కో: సిరియాలో రష్యా బలగాలు నిర్వహించిన వైమానిక దాడిలో 30 మంది మృతి చెందినట్టు రష్యా ఆర్మీ ఆదివారం వెల్లడించింది. తమ యుద్ధ విమానాన్ని కూల్చిన తిరుగుబాటుదారుల దాడిని తిప్పిగొట్టామని పేర్కొంది. తిరుగుబాటుదారుల స్థావరాలను ధ్వంసం చేయనున్నట్టు ప్రకటించింది. సిరియాలో ఎస్‌యు-25 రష్యా యుద్ధ విమానాన్ని అక్కడి తిరుగుబాటుదారులు కూల్చివేశారు. అనంతరం అందులోని పైలట్‌ను కాల్చి చంపేశారు. ఈ ఘటన సిరియా ఉత్తర ఇడ్లిబ్ ప్రావిన్స్‌లో శనివారం చోటుచేసుకుంది. హయత్ తెహ్రిర్ అల్-ష్యామ్(హెచ్‌టీఎస్) అనే ఉగ్రవాద సంస్థకు చెందిన తిరుగుబాటుదారులు రష్యాకు చెందిన ఎస్‌యూ-25 యుద్ధవిమానాన్ని భుజంపై నుంచి ప్రయోగించే క్షిపణుల ద్వారా నేలకూల్చారు. అనంతరం అందులోని పైలట్‌ను కాల్చి చంపారు. ఈ ఘటనను రష్యా రక్షణ శాఖ కూడా ధ్రువీకరించింది. ఇడ్లిబ్ ప్రాతంలో తమ యుద్ధవిమానాన్ని సిరియన్ తిరుగుబాటుదారులు నేలకూల్చారని.. అనంతరం అందులోని పైలట్ ఉగ్రవాదులతో పోరాడి ప్రాణాలు విడిచినట్టు పేర్కొంది. 'పోర్టబుల్ యాంటీ ఎయిర్‌క్రాఫ్ట్ మిసైల్'తో విమానాన్ని కూల్చినట్టు తెలుస్తోందని రష్యన్ ఏజెన్సీలు వెల్లడించాయి.

దావూద్‌కు బ్రిటన్‌లో భారీ ఆస్తులు



లండన్: అండర్ వరల్డ్ డాన్ దావూద్ ఇబ్రహీంకు బ్రిటన్‌లో భారీగా ఆస్తులున్నట్లు తెలిసింది. భారత్‌లో 1993 బాంబు పేలుళ్ల తదితర నేరాల్లో నిందితుడిగా ఉన్న దావూద్‌కు బ్రిటన్‌తో పాటు ఇండియా, యూఏఈ, స్పెయిన్, మొరాకో, టర్కీ, సైప్రస్, ఆస్ట్రేలియాల్లో అక్రమంగా ఆస్తులు సంపాదించినట్టు 'ది టైమ్స్'శనివారం ఓ కథనం ప్రచురించింది. యూకే కంపెనీస్ హౌస్, ల్యాండ్ రిజిస్ట్రీకి భారత్ సమర్పించిన సమాచారం, పనామా పత్రాల వివరాలను సరిపోల్చిన తరువాతే ఈ నిర్ధారణకు వచ్చింది. దావూద్ కోసం ఆయన అనుచరుడు ముహమ్మద్ ఇక్బాల్ 'మిర్చి'మెమెన్ బ్రిటన్‌లో హోటళ్లు, వాణిజ్య సముదాయాలు, భవంతులు నిర్మించినట్టు పేర్కొంది. మెమెన్ లండన్‌లో తలదాచుకుని నిర్మాణ రంగంలో 11 కంపెనీల్లో డైరెక్టర్‌గా వ్యవహరించాడు. 2013లో గుండెపోటుతో మృతి చెందాడు. ఆర్థిక నేరాలకు పాల్పడి దావూద్ బ్రిటన్‌ను ఒక స్వర్గధామంగా మార్చుకున్నారని, ఆయనకు ఎసెక్స్, కెంట్ కౌంటీల్లో ఆస్తులున్నాయని మిషా గ్లెనీ అనే రచయిత్రి పేర్కొన్నారు.

ఇటలీలో కాల్పులు : ఆరుగురికి గాయాలు

రోమ్ : ఇటలీలోని మాసెరాటా పట్టణంలో ఓ దుండగుడు కారులో ప్రయాణిస్తూ విదేశీ పర్యాటకులపై కాల్పులకు పాల్పడ్డాడు. ఈ ఘటనలో ఆరుగురు గాయపడ్డారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం. నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్టు పోలీసులు తెలిపారు. గాయపడిన వారంతా విదేశీయులేనని వెల్లడించారు. ఈ దాడికి పాల్పడ్డ వ్యక్తి ఇటలీ దేశస్తుడని అన్నారు. అతనికి నేర చరిత్ర లేదని, విదేశీయులపై ఎందుకు కాల్పులకు పాల్పడ్డాడో విచారించనున్నట్టు తెలిపారు. సుమారు రెండు గంటల పాటు తన కారులో ప్రయాణిస్తూ విచ్చలవిడిగా కాల్పులు జరిపిన తరువాత దుండగుడు ఓ చోట వాహనాన్ని వదిలేసి పారిపోయాడు. అనంతరం దానికి కొంచెం దూరంలోనే పోలీసులకు చిక్కాడు. బాధితులంతా నల్లజాతి వారేనని, ఈ ఘటనకు ఇటీవల జరిగిన ఇటలీ యువతి హత్యకు సంబంధం ఉండొచ్చని వారు భావిస్తున్నారు. 18 ఏండ్ల పమేలా మాస్ట్రోపిట్రో అనే యువతిని గతవారం ఓ నైజీరియన్ అతిదారుణంగా హత్య చేసిన సంగతి తెలిసిందే. నిందితుడు ప్రతీకారంతో నల్లజాతీయులపై దాడికి పాల్పడి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు

మేం తలచుకుంటే.. మీరు బతకరు

- శ్రీను హత్యతోనే కేసీఆర్ పతనం ప్రారంభం : కుంతియా
- అధికారంలోకి వచ్చాక తిరగదోడతాం : జైపాల్‌రెడ్డి
- కాల్ డేటా గుట్టును రట్టు చేయాల్సిందే : ఉత్తమ్
- దోషులను కాపాడితే బుద్ధి చెపుతాం : జానారెడ్డి
- ఒక్కరూ మిగలరు.. : కోమటిరెడ్డి
- ఎస్పీ గుడ్డలూడదీస్తాం : రేవంత్‌రెడ్డి



నవతెలంగాణ-యాదాద్రి భువనగిరి ప్రతినిధి

కాంగ్రెస్ పార్టీ హత్యారాజకీయాలకు దిగితే.. రాష్ట్రంలో కేసీఆర్ సహా ఆ పార్టీ కార్యకర్తలెవరూ బతికి బట్టకట్టరని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి కుంతియా హెచ్చరించారు. ఇటీవల దారుణ హత్యకు గురైన బొడ్డుపల్లి శ్రీనివాస్ సంతాపసభ ఆదివారం నల్లగొండ బైపాస్ రోడ్డులో సీఎల్పీ ఉపనేత కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. శ్రీనివాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించి, రెండు నిమిషాలు శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం, సానుభూతి తెలిపారు. అనంతరం సభలో కుంతియా మాట్లాడుతూ.. శ్రీను హత్య కేసును సీబీఐతో విచారణ చేయించేందుకు కేసీఆర్ ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు. సీబీఐ విచారణ చేస్తే... సీఎం సహా మంత్రి జగదీశ్‌రెడ్డి జాతకం బయటపడుతుందన్న వణుకు, భయంతోనే కేంద్రానికి సిఫారసు చేయడం లేదని విమర్శించారు. ఈ కేసుపై రాహుల్‌గాంధీతో చర్చించి, పార్లమెంటు సమావేశాల్లో కేంద్ర హోంమంత్రి దృష్టికి తీసుకెళ్తామన్నారు.

బాధ్యులైన వారిని కటకటాల్లోకి పంపుతాం కేంద్ర మాజీ మంత్రి జైపాల్‌రెడ్డి

శ్రీను హత్యకేసును కేసీఆర్ ప్రభుత్వం సీబీఐకి అప్పగించకుంటే తాము అధికారంలోకి వచ్చాక కేసును తిరగదోడి, బాధ్యులైన వారందరినీ కటకటాల్లోకి పంపుతామని కేంద్ర మాజీ మంత్రి సూదిని జైపాల్‌రెడ్డి హెచ్చరించారు. నిందితుల కాల్‌డేటాను దాచిపెట్టి, దోషులను కాపాడితే దానికి శిక్ష కేసీఆర్ అనుభవించాల్సి వస్తుందని అన్నారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదన్న విషయాన్ని కేసీఆర్ గ్రహించాలని సూచించారు.

తగిన బుద్ధి చెబుతాం..: జానారెడ్డి

అధికార అహంకారంతో, అవినీతి డబ్బుతో విపక్షాలను కొనుగోలు చేస్తూ, హత్యారాజకీయాలకు పాల్పడి మరోసారి అధికారంలోకి రావాలని చూస్తున్న సీఎం కేసీఆర్‌కు కాంగ్రెస్ పార్టీ తగిన బుద్ధి చెబుతుందని సీఎల్పీ నేత కె.జానారెడ్డి అన్నారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ అరాచకాన్ని ప్రోత్సహిస్తున్న కేసీఆర్ పతనం నల్లగొండ నుంచే మొదలైందన్నారు.

కాల్‌డేటాను విచారించకుండా కేసు నీరుగార్చారు : టీపీసీసీ అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

ఫోన్ కాల్ డేటాను సమగ్రంగా విచారణ చేయకుండా, పోలీసులు సీఎం ఒత్తిడితో కేసును నీరుగార్చారని పీసీసీ అధ్యక్షులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి విమర్శించారు. నిందితులకు ఐదు రోజుల్లోనే బెయిల్ రావడం చూస్తే... కేసును ఎంత బలహీనపరిచారనే విషయం అర్థమవుతోందన్నారు. మిర్చి బండి దగ్గర ఉల్లిగడ్డ కోసం జరిగిన గొడవ శ్రీను హత్యకు దారితీసిందని ఎస్పీ ప్రకటించడం సిగ్గుచేటని అన్నారు. శ్రీనుకు ప్రాణహాని ఉందని, భద్రత కల్పించాలని సీఎంను కోరినా పట్టించుకోకపోవడం వెనుక ఈ హత్య కుట్ర దాగి ఉందని ఆరోపించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త హత్యకు గురైతే సంతాపం తెలియజేయాలన్న సభ్యత లేని మంత్రి జిల్లాకు ఉండటం దౌర్భాగ్యమన్నారు. జిల్లా మంత్రి, ఎమ్మెల్యే వీరేశం, సీఎంకు ఈ హత్యలో భాగస్వామ్యం ఉందని ఆరోపించారు.

ఎస్పీ గుడ్డలూడదీసే రోజులు ముందున్నాయి: రేవంత్

సమగ్ర విచారణ చేయకుండా కేసీఆర్ ఒత్తిడితో శ్రీను హత్య కేసును నిర్వీర్యం చేసిన ఎస్పీ శ్రీనివాసరావు గుడ్డలూడదీసే రోజులు ముందున్నాయని కాంగ్రెస్ నేత రేవంత్‌రెడ్డి అన్నారు. కాల్‌డేటాను విచారణ చేయాలని పోలీసుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకుండా, హత్యను మిర్చి బండి పంచాయితీగా చిత్రీకరించారన్నారు. ఎమ్మెల్యే వేముల వీరేశం బంధువులు రంజిత్, సుధీర్ నిందితులతో సంభాషించిన ఫోన్ కాల్‌డేటాపై పోలీసులు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. నల్లగొండ క్లాక్‌టవర్ దగ్గర ఎమ్మెల్యే వీరేశం బట్టలూడదీసి తంతే నిజాలు బయటికి వస్తాయని, మంత్రి జగదీశ్‌రెడ్డితోపాటు సీఎం కేసీఆర్ ఈ కేసులో దోషులుగా తేలుతారని అన్నారు.

కార్యక్రమంలో బొడ్డుపల్లి శ్రీనివాస్ సతీమణి, మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డుపల్లి లక్ష్మి, శ్రీనివాస్ తల్లి లింగమ్మ, శాసనమండలి పక్షనేత షబ్బీర్ అలీ, కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ భట్టి విక్రమార్క, ఎమ్మెల్సీ కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, మాజీ మంత్రులు మర్రి శశిధర్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, మాజీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, రాష్ట్ర జిల్లా నాయకులు పాల్గొన్నారు.

దమ్ముంటే నాపై గెలవాలి : కోమటిరెడ్డి

తాము హత్యలు చేయాలనుకుంటే నల్లగొండ నడిబొడ్డున ఒక్క టీఆర్ఎస్ కార్యకర్త కూడా మిగలడని సీఎల్పీ ఉపనేత కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. హత్యారాజకీయాలు కాదు.. దమ్ముంటే తనపై గెలవాలని సీఎం కేసీఆర్‌కు సవాల్ విసిరారు. కిరాయి హంతకుడైన ఎమ్మెల్యే వీరేశంతో తనను, గ్యాంగ్‌స్టర్ నయీమ్‌తో తన సోదరుడు రాజగోపాల్‌రెడ్డిని హత్య చేయించేందుకు కేసీఆర్ కుట్రపన్నారని ఆరోపించారు.

నేడు టెన్త్ విద్యార్థులకు నాస్ పరీక్ష

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

పదోతరగతి విద్యార్థుల అభ్యసన ఫలితాలను అంచనా వేసేందుకు సోమవారం రాష్ట్రవ్యాప్తంగా పాఠశాల విద్యాశాఖ నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే(నాస్)-2018 నిర్వహిస్తున్నది. రాష్ట్రంలోని 31 జిల్లాల్లో ప్రతి జిల్లా నుంచి 80 ప్రభుత్వ, ప్రయివేటు, ఎయిడెడ్ పాఠశాలల్లోని (శాంపిల్ బడులు)విద్యార్థులకు పరీక్ష నిర్వహిస్తున్నారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న ఈ సర్వేలో తెలంగాణ నుంచి 2484 పాఠశాలల్లోని సుమారు 92,978 మంది పదోతరగతి విద్యార్థులు పాల్గొననున్నారు.

కువైట్‌లోని వారిని తెలంగాణకు రప్పించే ప్రయత్నం

టికెట్‌కూ డబ్బులు లేని వారి వివరాల సేకరణ : మంత్రి కేటీఆర్



నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

కువైట్ ప్రభుత్వం ప్రకటించిన అమ్నెస్టీ (క్షమాభిక్ష) నేపథ్యంలో పర్మిట్, వీసా లేకుండా అక్రమంగా పనిచేస్తున్న వారిని తెలంగాణకు రప్పించేందుకు ప్రయత్నిస్తున్నామని ఎన్నారై శాఖ మంత్రి కేటీ రామరావు తెలిపారు. ఏడు సంవత్సరాల తర్వాత కువైట్ ప్రభుత్వం ఇచ్చిన క్షమాబిక్ష అవకాశాన్ని ఉపయోగించుకోవాలని గతం వారం విజప్తి చేసిన మంత్రి, అక్కడి నుండి తిరిగి వస్తున్న వారికి అవసరం అయిన పూర్తి సహకారాన్ని అందించాలని ఎన్నారై శాఖాధికారులను అదేశించారు. కువైట్లోని భారత ఎంబసీలో అధికారులతో తెలంగాణ ఎన్నారై శాఖాధికారులు ఆదివారం మాట్లాడారు. తెలంగాణ కార్మికుల తాలుకు వివరాలను ఎప్పటికప్పుడు ఇక్కడి ఎన్నారై శాఖాధికారులకు అందిస్తామని హామి ఇచ్చారు. ఈ విషయంలో అవసరం అయితే దేశ విదేశాంగ మంత్రి సహకారం కోరుతామని మంత్రి కేటీఆర్ తెలిపారు. ఈ క్షమాభిక్షలో భాగంగా దేశానికి రావాల్సిన వారు ఇప్పటికే అక్కడి ఎంబసీని కలుస్తున్నారన్నారు. అయితే కొంత మందికి కనీసం విమాన టిక్కెట్టుకు సైతం డబ్బులు లేని పరిస్థితి ఉందని తమ దష్టికి వచ్చిందన్న మంత్రి, ఇలాంటి వారందరికి మానవతా దక్పథంతో ప్రభుత్వం భాద్యత తీసుకుంటుందన్నారు. ఈ మేరకు ఎంతమందికి టిక్కెట్లు అవసరం అవుతాయి, తిరిగి వస్తున్న కార్మికుల సంఖ్య ఎంత.. వంటి వివరాలను తెలుసుకోవాలని అధికారులను మంత్రి అదేశించారు. కువైట్‌లోని తెలంగాణ పౌరులు ఎవరికైనా అవసరం అయితే వెంటనే తెలంగాణ ఎన్నారై శాఖను సంప్రదించాలన్నారు. తెలంగాణ ఎన్నారై శాఖకు సంబంధించిన అధికారి మొబైల్ నెంబర్ 9440854433 కు సంప్రదించాలని కోరారు.

ప్రాజెక్టుల నిర్మాణం నాణ్యతలో రాజీ పడం

- ఇంజనీర్లతో హరీశ్‌రావు మేథోమదనం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రాజెక్టుల నిర్మాణం నాణ్యతలో రాజీపడబోమని భారీ నీటి పారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. చేపట్టిన పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఆదివారం జలసౌధలో ఇరిగేషన్ క్వాలిటీ కంట్రోల్ సీడీఓ ఇంజనీర్లతో మేథోమథనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగు నీటి రంగంలోని భారీ, మధ్య తరహా ప్రాజెక్టులు 40 శాతం నిర్మాణపు దశలో ఉన్నాయని చెప్పారు. కాలంతో పోటీ పడుతూ ప్రాజెక్టులను పూర్తి చేయడానికి ప్రయత్నిస్తున్నామని చెప్పారు. సాగు నీటి రంగం పనులపై క్వాలిటీ కంట్రోల్ విభాగం నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశారు. చేపట్టిన ప్రాజెక్టుల నిర్మాణం త్వరితగతంగా పూర్తి చేయడంతో పాటు నాణ్యతపై రాజీ లేకుండా నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. పది కాలాల పాటు ప్రాజెక్టులు ప్రజలకు సేవలందించేలా ఉండాలన్నారు. ప్రాజక్టుల నిర్మాణంలో కాకాతీయుల వారసత్వాన్ని అందిపుచ్చుకోవాలని ఇంజనీర్లకు సూచించారు. ప్రాజెక్టుల పనులను ప్రతి రోజు క్వాలిటీ కంట్రోల్ అధికారులు తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. నిర్మాణం పనుల గురించి సైట్లో ఉండే ప్లేస్‌మెంట్ రిజిస్టర్‌లో తప్పని సరిగా నమోదు చేయాలని తెలిపారు. ఇకనుంచి క్వాలిటీ కంట్రోల్ విభాగాన్ని ఈఎన్‌సీ నాగేందర్‌రావు పర్యవేక్షిస్తారని మంత్రి తెలిపారు.

పుష్కలంగా పురస్కారాల పంట

వారానికి ఒకటి రెండైనా సాహిత్య పురస్కారాలకు సంబంధించిన వార్తలు పత్రికల్లో కనిపిస్తుంటాయి. ఫలానా రచయితను తమ పురస్కారానికి ఎంపిక చేసుకున్నామనో, రచనకు అవార్డు వచ్చిందనో లేక మా స్మారక పురస్కారానికి ఎంట్రీలు పంపండనో చిన్న వార్తల రైలు పెట్టెల్లో చూస్తుంటాం. ఇలాంటి సాహిత్య పురస్కారాలు ఏడాదికి వందకు పైగానే ఉంటాయి.

కవులు, రచయితలు పుస్తకాల రాక పెరిగినట్లే పురస్కారాలు కూడా పెరిగి పోతున్నాయి. ఏడాదికోసారి పది, పదిహేను వేలు ఖర్చుచేయగల సత్తా, ఆసక్తి ఉన్నవాళ్ళు స్మారక పురస్కారాలు ఏర్పాటు చేస్తున్నారు. ప్రభుత్వాలు, సంస్థలే కాకుండా సాహితీ ప్రియులు సైతం తమ ఆప్తుల పేరిట, అభిమాన రచయితల స్మారకంగా అవార్డులు ప్రకటిస్తున్నారు. సాహిత్యాభిలాషుల సంఖ్య పెరగడం కూడా ఇందుకు కారణం అనవచ్చు.

తెలంగాణ సాధన ఉద్యమం ఎందరో ఔత్సాహికులను, కార్యకర్తలను కవులుగా మలచింది. ఇటీవల నిర్వహించిన ప్రపంచ తెలుగు మహాసభల్లో తెలంగాణ నుండి వేయికి పైగా కవులు కవితాగానం చేశారు.

కవితా సంపుటాల ప్రచురణ చూస్తుంటే అసలు పుస్తకం వేయని కవి ఎవరైనా ఉన్నారా అన్నట్లుగా ఉంది. కథకులు కూడా పాతదో, కొత్తదో, పత్రికల్లో వచ్చినవో, రానివో పదీ పదిహేను కథలు కలిపి సంపుటిగా తెస్తున్నారు. పరిశోధనా గ్రంథాల ముద్రణ ఎప్పుడూ ఉన్నదే.

తెలంగాణ నుండి మంచి రచయితలున్నా, యోగ్యమైన రచనలు వచ్చినా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నిరాదరణే మిగిలింది. ఉద్యమారంభం తర్వాత కొంత మార్పు వచ్చింది. పొంగుపై నీళ్ళు చల్లినట్లుగా ప్రభుత్వ పురస్కారాల్లో కాస్త చోటు ఈయడం జరిగింది. ఇలా తెలంగాణ రచయితలకు పురస్కారాల గౌరవం తీరని దాహంగానే మిగిలిపోయింది.

రాష్ట్ర ఆవిర్భావం నుండి తెలంగాణ ప్రభుత్వం ఉద్యమానికి తోడుగా నిలిచిన రచయితల, కళాకారులను తృప్తి పరచడానికి పలు రకాల సాహిత్య పురస్కారాలను ప్రకటించింది. రెండు తెలుగు రాష్ట్రాలను పరిశీలిస్తే విడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రచయితలను పట్టించుకున్నట్లు కనబడదు. తెలంగాణలో ఈ ఆదరణకు ఉద్యమ సాహిత్యంతో పాటు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావుకు ఉన్న సాహిత్య ప్రియత్వం కూడా కారణం కావచ్చు.


తెలంగాణ వైతాళికులను గౌరవించే క్రమంలో ప్రభుత్వం కాళోజీ నారాయణరావు జయంతిని తెలంగాణ భాషా దినోత్సవంగా ప్రకటించి ఏటా ఒకరికి పురస్కారాన్ని కూడా ప్రదానం చేస్తోంది. దాశరథ కృష్ణమాచార్య జన్మదినాన్ని కూడా నిర్వహిస్తూ ఆయన పేరిట సాహితీ వేత్తలకు అవార్డులిస్తోంది.

వీటికి అదనంగా 2 జూన్ 2015 నుండి తెలంగాణ ఆవిర్భావదినం సందర్భంగా 32 విభాగాల్లో రాష్ట్ర పురస్కారాలు ఇస్తుండగా వాటిలో సాహిత్య ప్రక్రియలకు 6 వున్నాయి.

ఇక తెలుగు విశ్వవిద్యాలయానికొస్తే అసలు పురస్కారాల కోసం యూనివర్సిటీ పుట్టిందా అన్నట్లు ఉన్నది. 1985లో ఏర్పడిన ఈ విశ్వవిద్యాలయం 1986 నుండి గత 30 ఏళ్ళుగా పదకొండు సాహితీ ప్రక్రియలకు పురస్కారాలు ప్రదానం చేస్తోంది. ఇలా రెండు రాష్ట్రాలు కలిపి ఇప్పటి వరకు 300 పైగా రచయితలు, రచయిత్రులు పురస్కార గ్రహీతలయ్యారు.

రెండు తెలుగు రాష్ట్రాల్లో వివిధ సంస్థలు ప్రకటిస్తున్న సాహితీ పురస్కారాలు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల మధ్య ఇచ్చి పుచ్చుకునే ధోరణిలో సాగుతున్నాయి. ఈ మధ్యన తెలంగాణకు చెందిన రచయితలు, కళాకారులు ఆంధ్రప్రదేశ్ వెళ్ళి పురస్కారాలు స్వీకరించారు. రాష్ట్రాలు వేరయినా తెలుగు కళలు, సాహిత్యం ఒక్కటేనన్న భావనను ఈ పురస్కారాల సంస్కృతి కాపాడుతోంది.

అలాగే బాలసాహిత్యానికి, యువ రచయితలకి (యువ పురస్కారం) ఏటా కేంద్ర సాహిత్య అకాడమీ తెలుగు భాషలోని ఒక రచనకు, ఒక అనువాదానికి అవార్డులు ఇస్తోంది. 1979 నుండి కొన్నేళ్ళ పాటు కొనసాగిన శ్రీరాజలక్ష్మీ ఫౌండేషన్ అవార్డు భారీ స్థాయిలో ఉండేది. చెన్నై నుండి రమణయ్య రాజా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ అవార్డు గ్రహీతకు లక్ష రూపాయల నగదుతో పాటు ఓ సన్మాన పత్రం, శాలువాతో గౌరవం దక్కేది. రచయితలుగా ఈ ఘనత శ్రీశ్రీ, సినారె, బిరుదరాజు రామరాజులకు దక్కింది. 1987 నుండి విడిగా రాజలక్ష్మి సాహిత్య పురస్కారం కూడా ప్రదానం చేస్తున్నారు.



పురస్కారం రచనకు గౌరవమే గాని దాని ప్రయోజనాన్ని సాకారం చేయదు. పురస్కారం ఒక సాంప్రదాయిక ప్రక్రియ. సాహిత్యంలో తనకంటూ ఒక చోటును స్థిరం చేసుకునే క్రమంలో రచనలు కొనసాగాలి. సాధారణ జీవితం గడిపిన డా॥ కేశవరెడ్డి నవలలు కలకాలం నిలిచి వుంటాయి. అవార్డుల ఎత్తు వాటి ముందు చిన్నబోతుంది.

వచన కవిత్వాన్ని ప్రోత్సహించేందుకు మొదలైన ఫ్రీ వర్స్ ఫ్రంట్ 1979 నుండి వచన కవితా సంపుటాలకు పురస్కారాల్ని అందజేస్తోంది. వివిధ సాహితీ సంస్థలు ఇస్తున్న పురస్కారాల్లో దీనిని ప్రముఖంగా పరిగణించవచ్చు.

ఇలా చిన్నా పెద్దా సాహితీ పురస్కారాల వివరాల్లోకెళితే ఎన్నో పేర్లు చెప్పుకోవచ్చు. వాటిలో నోరి నరసింహశాస్త్రి పురస్కారం, అలిశెట్టి ప్రభాకర్ పురస్కారం, జానుడి సాహిత్య పురస్కారం, డా॥నన్నపనేని మంగాదేవి బాల సాహిత్య పురస్కారం, ఇస్మాయిల్ మిత్ర మండలి కవిత్వ పురస్కారాలు, మువ్వా పద్మావతి రంగయ్య అవార్డు, మద్దూరి నగేష్ బాబు పురస్కారం, ఈదూరు సుబ్బయ్య స్మారక సాహితీ పురస్కారం, రంగినేని ఎల్లమ్మ స్మారక పురస్కారం, నాగభైరవ కోటేశ్వరరావు అవార్డు, విమలాశాంతి పురస్కారం, బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్ అవార్డు, రొట్టమాకురేవు అవార్డు, నోముల కళా పురస్కారం, కొలుకనూరి విశ్రాంతమ్మ, భాగీరథిల నాటక, కవితా పురస్కారాలు, మాడభూషి రంగాచార్య పురస్కారం, సుద్దాల హనుమంతు జానకమ్మ అవార్డు ప్రముఖంగా కనపడతాయి.

గతేడాది మొదలైన బీసీ రైటర్స్ వింగ్ వరంగల్ 5 గురు రచయితలను గౌరవించి పురస్కారాలకు శ్రీకారం చుట్టింది. ఈ మధ్య లక్ష్మీనారాయణ జైని స్మారక పురస్కార ప్రదాన సభ ఎంతో వైభవంగా జరిగింది.

పురస్కారాలు తక్కువైనట్లు కవి సమ్మేళనాల్లో కూడా కవితా గానం చేసిన కవులకు శాలువలు, హాజరు పత్రాలు లభిస్తున్నాయి. పురస్కారాల ప్రదానాల్లో రంగురంగుల కిరీటాలు వచ్చి చేరాయి. గ్రహీతలకు శాలువ, సన్మానపత్రం కన్నా కిరీటాల దశదశలే మెరుపులు ఇస్తున్నాయి.

పుస్తకాల ముద్రణ, పురస్కారాల వైభోగాలకు తగ్గట్లు రచనలు వస్తున్నాయా అనేది ఆలోచించవలసిన విషయం. తెలుగులో ఏ అవార్డు రానివాడే ఖచ్చితంగా గొప్ప రచయిత అయి వుంటాడు అని కవి కొనకంచి లక్ష్మీ నరసింహారావు ఓ చోట వ్యాఖ్యానించారు. ఈ మాటలో వ్యంగ్యం ఉన్నా సత్యం కూడా ఉంది. ఈ అవార్డులకు, సత్కారాలకు దూరంగా తెలుగులో విలువైన సాహిత్యం వస్తోంది. వ్యక్తిగత కీర్తి కాంక్ష, అవార్డుల రివార్డుల పరుగులోకి రాని ప్రజా రచయితలెందరో తమ పాత్ర నిలకడగా నిర్వహిస్తున్నారు. రచనలు ప్రజా ప్రయోజనం కోసం కాని పురస్కారాల వరసలో నిలబడడానికి కాదని వారి నమ్మకం.

పురస్కారం రచనకు గౌరవమే గాని దాని ప్రయోజనాన్ని సాకారం చేయదు. పురస్కారం ఒక సాంప్రదాయిక ప్రక్రియ. సాహిత్యంలో తనకంటూ ఒక చోటును స్థిరం చేసుకునే క్రమంలో రచనలు కొనసాగాలి. సాధారణ జీవితం గడిపిన డా॥ కేశవరెడ్డి నవలలు కలకాలం నిలిచి వుంటాయి. అవార్డుల ఎత్తు వాటి ముందు కురచగానే ఉంటుంది.

అవార్డు రచనకు కొత్త పరిచయాన్ని ఇస్తుందేమోగాని రచయితకు చేసే మేలు పరిమితమే. అన్నార్థులు, అనాథల గురించి రాసిన రచనలలో రచయిత సన్మానాలలో మురిసిపోతే ప్రయోజనం శూన్యం.

"రాసింది 'చలి – ముదుసలి' / కప్పించుకున్నది కాశ్మీరు శాలువా" అని అలిశెట్టి ప్రభాకర్ కవితలో ఉన్న వైరుధ్యాలను ప్రశ్నించాడు.

పురస్కారాలు రావడానికి రచయితకు కొన్ని సానుకూల లక్షణాలు కూడా ఉండాలి. స్నేహబృందం, హోదా, పరపతి ఉండాలి.

అందరిలో కలుపుగోలుగా కనబడాలి. సన్మాన సభలకు హాజరవుతూ వక్తగా అందరి దృష్టిలో పడాలి.

సాహిత్యం వర్తమానాన్ని అనుకరించదు, అది రేపటి జీవితాన్ని ఊహిస్తుంది, రూపొందిస్తుంది అంటారు ఆస్కార్ వైల్డ్. వెళుతున్న దారి చివరలో ఏముందో ముందే చెప్పేది సాహిత్యం అని మరొక మేధావి ఉవాచ.

ప్రపంచీకరణ ఉధృతిలో సామాన్యుడి జీవితం తునాతునకలవుతోంది. మతం, దేశభక్తి ముసుగులో కాలాన్ని వెనక్కి నడిపించే ప్రయత్నం జరుగుతోంది. రైతుల ఆత్మహత్యలు, మైనర్ బాలికలపై అత్యాచారాలు, తినే తిండిపై ఆంక్షలు, దళిత – మైనారిటీలపై విధ్వంసక దాడులు నిత్యకృత్యమైన వేళ రచయితలు తమ బాధ్యతను ఎంత వరకు నిర్వర్తిస్తున్నారు? తమ రచనలు సమాజంలో సాహిత్యం పోషించే పాత్రను నిలబెడుతున్నాయా? ప్రజల వైపు నిలబడే సాహిత్యం, పురస్కారాల సంబరాల సాహిత్యం అని అక్షరం విడిపోతోంది.

అవార్డులు పొందిన మామూలు రచనలున్నట్లే, ఏ సాహితీ గద్దెనెక్కని గొప్ప సాహిత్యమూ ఉంది. అక్షరానికి అవార్డు అవసరం ఎంతుందో అనవసరం కూడా అదే స్థాయిలో ఉంది.

– బి.నర్సన్, 9440128169

ఎట్లనుకుంటే ఎట్లయిపాయే



గలగల పారే
మానేటి అలల్లా ఎగిరి దుంకే
ధిక్కార స్వరం మూగవోయింది

ముంబై పెన్నిధికీ...సిరిశాల సన్నిధికీ
ఆసువోసిన అడుగులు
మౌనంగా కుప్ప కూలినయి

ప్రగతిశీల ఉద్యమాలే
ఊపిరిగా బతికిన సగటు మనిషి
పెన్నుగన్ను శాశ్వతంగా మూలవడ్డది

మట్టి పొత్తిల్లలో
బహుజన భావజాల విత్తులు జల్లిన
నిరంతర సాహితీ కృషీవలుడు కూశైండు

చెట్టుకొగలు పుట్టకొగలుగ కార్మికులం
ఉక్కు పాదాలే ఉక్కిరిబిక్కిరయ్యేట్టు
మేల్కొల్పిన సూత్రధారుడు చుక్కల్ల గల్సిండు

ఒడ్డుకు చేరని ఓడలా
వలస రెక్కల రెపరెపలు
తెగిన దారం పోగులా
కన్నపేగుల కలవరింపులు
కంటికేడు ధారలుగ
కవన లోకపు పలకరింతలు
ఉదీమానుల గుండె గూడున
ఉదయించే ప్రభాకరుడు

ఎట్లనుకుంటే ఎట్లయిపాయే
అయినా ...నువ్వట్లా !
వెళ్ళిపోయేది గాకుండే ?


(జనవరి 23, 2018న అమరులైన కామ్రేడ్ మచ్చ ప్రభాకర్ స్మృతిలో.....)

– కూకట్ల తిరుపతి, 99492 47591

కవిత్వంలో శైలీ విమర్శ

తెలుగులో విమర్శ తక్కువ. ఉన్న విమర్శ కాస్తా కవిత్వం మీదనే కేంద్రీకృతమైనప్పటికీ, అదీ రెగ్యులర్‌గా రాసేవాళ్ళు తక్కువ. విమర్శను పోషించేది పత్రికల వాళ్ళే అయినప్పటికీ, విమర్శకు ఒక రెగ్యులర్ కాలమ్ ఇస్తే తప్ప విమర్శను, విమర్శ స్థాయిని పెంచే అవకాశం లేదు. గతంలో రెగ్యులర్ కాలమ్ నిర్వహించడం వల్లనే చేకూరి రామారావు, జి.లక్ష్మీ నరసయ్యలు విస్తృతంగా విమర్శావ్యాసాలు రాయగలిగారు. వీరి విమర్శ కొత్తతరం పాఠకులకు కవిత్వం మీద ఆసక్తిని కలగజేయడంతో పాటు, కవులను ఆత్మ పరిశీలనకు పురిగొల్పింది.

ఎక్కడా రెగ్యులర్ కాలం దొరకనప్పటికీ విస్తృతంగా కవితా విమర్శా వ్యాసాలు రాస్తున్న ఏకైక వ్యక్తి యం.నారాయణశర్మ. మన కవిత్వ విమర్శ అంతా వస్తుపరంగానే విశ్లేషింపబడుతున్నది. ప్రాచీన సాహిత్య పఠనం, భాషా శాస్త్ర అధ్యయనం కొరవడటం వల్ల శిల్ప విమర్శకు పూనుకునేవారు దాదాపు లేరనే చెప్పాలి. సంస్కృత భాషా నేపథ్యంతో పాటు భాషా శాస్త్ర అభిరుచి కూడా శర్మకు ఉండటం వల్ల, ఆయన శైలీ విమర్శ పట్ల ఆసక్తి చూపడంతో, ఈ విశ్లేషణాత్మక వ్యాసాలు శైలీపరమైన విమర్శగా రూపొందాయి. సమాజగత విమర్శ, మూల సిద్ధాంతాల అన్వయంలోనే ఇన్నాళ్ళు గడిపింది గానీ, కొత్త విమర్శ సూత్రాల అన్వేషణ జరగలేదు. విశ్వ విద్యాలయాల్లో శైలీ శాస్త్రానికి సంబంధించిన శాఖ ఏర్పడింది. అయినా శైలీ పరంగా నిర్మాణాలు – నిర్మాణం భాషాపరంగా పాత కొత్తల సమ్మేళనంగా విమర్శ ఇతర భాషల్లో వృద్ధి చెందినంతగా తెలుగులో అభివృద్ధి చెందలేదు. ప్రక్రియను ముందుకు తీసుకెళ్ళే నేపథ్యంలో నిర్మాణ పరమైన మౌలిక సూత్రాల అన్వేషణకు తెలుగు విమర్శ సిద్ధపడాలని హెచ్చరించింది.



ఒక కవితలో విషయాన్ని చెప్పే పద్ధతి 'అభివ్యక్తి'. వాక్య నిర్మాణం, భాష, ప్రతీకలు, వీటి వెనుక స్వభావం అన్నీ అభివ్యక్తిలో భాగాలే. ఏ కాలపు కవిత్వాన్నయినా ఈ అంశాలను ఆధారం చేసుకుని పరిశీలించాలంటూ 'సమకాలీన కవిత్వం – అభివ్యక్తి ధోరణులు'లో తెలియజేస్తారు. ఇక వివిధ కవుల కవిత్వాన్ని విశ్లేషిస్తూ – అన్నవరం కవిత్వంలోని వస్తువును ప్రపంచీకరణపై ధిక్కారం, తెలంగాణ ప్రాంతీయ అస్తిత్వ నినాదం, దళితవాదంగా విభజించవచ్చు. అన్నవరం రచనలోని నిర్మాణ పరికరాల ప్రగాఢత వల్ల అన్నవరంలో ప్రత్యేక స్వరముంది. అది 'తెలంగాణ నుడికారపు ఔద్వేగిక జీవధార' అంటారు. ప్రకృతిలోని కళాత్మకాంశాలను గాఢంగా అనుభవించడమే కాక, సౌందర్యాత్మకంగా దాన్ని వ్యక్తీకరించడం, అవిష్కరించడంలో డా॥గోపి ప్రతిభను గుర్తించి వివరిస్తాయి. రవి వీరెల్లి కొత్తగా కవిత్వం రాస్తున్నట్లు కనిపించినా 'దూప' కావ్యంలోని ప్రతి వాక్యం వెనుక గొప్ప సాధన కనిపిస్తుంది. కవిత్వం కోసం పట్టుకున్న పరికరాలే రవి వీరెల్లిని ప్రత్యేకంగా నిలబెడతాయంటారు. పత్తిపాక మోహన్ 'తెగిన పోగు'ను స్పర్శిస్తే ఆర్థిక జీవితం అడుగడుగునా కవిత్వమై కూర్చుంటుంది. ఆవిష్కరిస్తున్న జీవితంపై లోతైన అవగాహన పత్తిపాక కవిత్వ శరీరం నిండా కనిపిస్తుందంటారు. కాల గమనాన్ని అనువదించిన జీవన దార్శనికత రాజేందర్ జింబో 'చూస్తుండగానే'లో కనిపిస్తుందంటారు. మార్క్సిస్టు అవగాహన నుంచి దూరంగా, ప్రధానంగా మారుతున్న కాలం, సందర్భం, ఊరు, నగరంలోని జీవితం – వీటిని వైప్లవిక దృష్టితో కాకుండా పురాజీవిత స్పృహగా మలిచారని తెలియజేస్తారు. పన్నెండేళ్ళ తెలంగాణ ఉద్యమ గమనాన్ని, సాహిత్య గమనాన్ని ఒక్క చోటికి తెచ్చే ప్రయత్నం 'మునుం' పుష్కర కవిత్వం చేసింది. కేవలం ఉద్యమ వర్తమానాన్ని మాత్రమే గాక, తెలంగాణ సాహిత్య ఉజ్జీవనంలోని కీలక వాదాలను, అంశాలను 'మునుం' దోసిలిపట్టి అందించిందంటారు. వచన కవిత్వాన్ని 'మట్టి నా ఆలాపన'గా ఆవిష్కరిస్తున్న నాంపల్లి సుజాత కవిత్వంలో, పరిణతి చెందిన కవితాశక్తి కనిపిస్తుంది. భావాంశాన్ని తత్సంబంధ వాక్యాన్ని సాంద్రంగా చెప్పడంలో ఆమె నేర్పరితనం తెలియజేస్తాయి. తనదైన మార్గంలో సాహిత్యయాత్ర చేస్తున్న శిలాలోలిత 'గాజు నది'లో స్త్రీ వాద అస్తిత్వ భూమిక గల కవిత్వమే ఎక్కువ. ఉనికి అన్వేషణలో అనన్యతి కోసం శిలాలోలిత మానవీయత వైపు ప్రయాణం చేస్తున్నానంటారు. కాలాతీత జీవితపు కవితాత్మక అనుభవం 'ఎ పొయిట్ ఇన్ హైదరాబాద్'. తన ఊహకందిన మేరకు హైదరాబాద్ నగర జీవితాన్ని అనేక దశల్లో పరిపూర్ణంగా అశారాజు ఈ కవిత్వంలో అనుభవిస్తారంటారు. 'గిజిగాడు' రూపంలో కొత్తగా వచ్చిన శిఖామణి కవిత అనుభూతి సంబంధంగా అనేకాంశాలని చెబుతుంది. శిఖామణి ఏ సందర్భాన్ని, వ్యక్తిని, ప్రదేశాన్ని కవిత్వం చేసినా అందులో అనుభూతి ప్రధానం. అది ఈ సంపుటిలో అనేక చోట్ల కనిపిస్తుందంటారు. తాత్విక ధారతో జీవితాన్ని కొలిచిన కవిత్వం డాక్టర్ భవానీదేవి 'రగిలిన క్షణాలు'. ఇందులో జీవితంలోని సంక్షోభం, మానవీయ విలువలు, గమ్యం, ఒంటరితనం వంటి అంశాలతో కూడిన ఉద్వేగపూరితమైన మానవీయ గొంతు ఉందంటారు. ఆ మధ్య కాలంలో వచ్చిన కెరె జగదీష్ 'రాత్రి సూర్యుడు', డా॥రూప్‌కుమార్ డబ్బీకార్ 'ఫ్లోరోసిస్ ఫ్లోరోసిస్', ఈతకోట సుబ్బారావు 'నీటి చుక్క', 'మోడిపల్లి శ్రీలత కోటపాటి 'మృత్యు మోహనం' అనే నాలుగు దీర్ఘ కవితలు నిర్మాణంలోనూ, వస్తు వ్యాప్తిలోనూ కొత్త మార్గాన్ని ఎలా అనుసరించాయో వివరంగా తెలియజేశారు. సవిమర్శక వాస్తవికత సమాజపు మార్పును నిర్దేశించదు. ప్రేరేపించదు. కాని దానిని ఆకాంక్షిస్తూ, సమస్యల్ని గుర్తించి సృజనలో ప్రతిబింబించేటట్లు చేస్తుంది. ఈ ధోరణి దాస్యం సేనాధిపతి 'శబ్దలయ' కవితా సంపుటిలో కనిపిస్తుందంటారు. రేణుకా అయోల 'లోపలి స్వరం' కవితా సంపుటి చివర్లో కొంత వాస్తవికత ప్రధానంగా స్త్రీ వాద గొంతుక వున్నప్పటికీ, ఎక్కువ భాగం అనుభూతి కవితలే. ఒక కవిత నుండి ఇంకో కవితకు వెళుతున్నప్పుడు దర్శనంలో, సృజనలో పరిణతి కనిపిస్తున్నదంటారు. తెలుగు కవిత్వంలో కార్మిక భావన స్పష్టంగా కనిపించకపోయినా వచ్చిన ఉద్యమాల వెనుక బలంగా పనిచేసింది. 'మహా ప్రస్థానం'లో శ్రీశ్రీ దేశ చరిత్రలు ఖండికలో కార్మికుడ్ని చిత్రించిన తరువాతే కార్మిక భావనను తెలుగు కవిత్వం విస్తృతంగా ఉపయోగించడం మొదలుపెట్టిందనడంలో అతిశయోక్తి లేదంటూ 'తెలుగు కవిత్వంలో కార్మిక జీవనం' గురించి తెలియజేశారు. ఏనుగు నరసింహారెడ్డి 'కొత్త పలక' కవితా సంపుటిని సౌందర్యాత్మక దృశ్యంగా చిత్రీకరించడం, వ్యంగ్యంగా చెప్పడం అనే రెండు అంశాలుగా విభజించి విశ్లేషించారు. అభ్యుదయ కవిత్వానికి కాస్త ఈవల నుంచి జరిగిన అన్ని రకాలయిన కవిత్వ పరిణామాలను, వచ్చిన వాదాలను, ధోరణులను గమనించి తనదైన మార్గంలో నడిచిన కవులు, తెలుగు నేలపై ప్రస్తుత వర్తమానానికి సి.నారాయణరెడ్డిగారు తప్ప మరొకరు లేరు. మొత్తం నారాయణ రెడ్డి గారి కవితా వికాస పరిణామాన్ని ప్రయోగ దశ, సృజనాత్మక దశ, తాత్విక దశ అనే మూడు విధాలుగా విభజించి వివరించారు.

అన్నవరం కవిత్వంలోని వస్తువును ప్రపంచీకరణపై ధిక్కారం, తెలంగాణ ప్రాంతీయ అస్తిత్వ నినాదం, దళితవాదంగా విభజించవచ్చు. అన్నవరం రచనలోని నిర్మాణ పరికరాల ప్రగాఢత వల్ల అన్నవరంలో ప్రత్యేక స్వరముంది. అది 'తెలంగాణ నుడికారపు ఔద్వేగిక జీవధార' అంటారు.

లబ్ధప్రతిష్టులైన వారి కవిత్వాన్నే కాదు, ఔత్సాహికుల కవిత్వాన్ని కూడా అంతే ఇష్టంగా, అంతే ప్రేమగా వివరించడం ఇందులో కనిపిస్తుంది. ఎవరి కవిత్వంలోనయినా తప్పులు ఎంచకుండా, మంచిని వేలెత్తి చూపించే సహృదయ విమర్శకుడు నారాయణశర్మ. ఈ పద్ధతి కవులకు ప్రోత్సాహకరంగా వుంటుంది. పాఠకులకు మంచి, చెడులు తెలుసుకునే విచక్షణాజ్ఞానం అలవడుతుంది. మంచి కవిత్వాన్ని ఎలా గుర్తించాలో తెలుసుకోగలుగుతాం.

మనం తరచుగా సాహిత్యానికి సంబంధించిన ఆంగ్ల పదాలు యథేచ్ఛగా వాడుతున్నాం. నారాయణశర్మ అలాంటి ఆంగ్ల పదాలనెన్నింటికో తెలుగులో సమానార్థకాలు తయారు చేసి, ఆ పరిభాషా పదాల పట్టికను అనుబంధంలో ఇవ్వడం విశేషం. అలోచనా పరులంతా వీటిని చర్చించి నిగ్గు తేల్చాల్సిన అవసరం ఉంది.

– కె.పి.అశోక్ కుమార్, 9700000948

సాహిత్యవార్తలు

ప్రతిభా పురస్కారాల ప్రదానం

రావి రంగారావు సాహిత్య పీఠం నిర్వహించిన జన రంజక కవి ప్రతిభా పురస్కారాలకు ప్రసాదమూర్తి (చేనుగట్టు పియానో – వచన కవితలు), గుర్రాల రమణయ్య (మాట ముల్లు – వచన కవితలు), విల్సన్‌రావు కొమ్మవరపు (దేవుడు తప్పిపోయాడు – వచన కవితలు), సిహెచ్.వి.బృందావనరావు (కాంతి సందేశము (పద్య ఖండికలు), డా॥ఎం.బి.డి.శ్యామల (ఆలాపన – గజళ్ళు) ఎంపికయ్యారు. ఈ పురస్కారాలను ఈ నెల 9వ తేదీ సాయంత్రం 6 గంటలకు గుంటూరు బృందావన్ గార్డెన్‌లోని అన్నమయ్య కళావేదికలో ప్రదానం చేస్తారు.

గుడిపాటికి ఈదూరు సుబ్బయ్య సాహితీ పురస్కారం

ఈ నెల 11వ తేదీ సాయంత్రం 5.30 గంటలకు హైదరాబాద్ త్యాగరాయగానసభ, లలితకళావేదికలో గుడిపాటికి విమల సాహితీ సమితి వారి ఈదూరు సుబ్బయ్య సాహితీ పురస్కారం ప్రదానం చేస్తారు. త్యాగరాయ గానసభ, ఈదూరు సుబ్బయ్య సాహితీ పీఠం సంయుక్త నిర్వహణలో ఏర్పాటు చేసిన ఈ సభలో నిఖిలేశ్వర్, రమణ వెలమకన్ని, కళా జనార్ధనమూర్తి, ఏనుగు నర్సింహారెడ్డి, బైస దేవదాస్, ఈతకోట సుబ్బారావు, కొమ్మవరపు విల్సన్‌రావు, డా॥ ఈదూరు సుధాకర్, పెద్దూరు వెంకటదాసు, జెల్ది విద్యాధరరావు పాల్గొంటారు.

జనరంజక కవి ప్ర.ర.వే 4వ మహాసభలు

ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక 4 మహాసభలు ఈ నెల 10, 11వ తేదీల్లో రెండు రోజులు జాతీయ సదస్సు తిరుపతి గంధమనేని శివయ్య మెమోరియల్ హాల్లో జరుగుతుంది. సమాచార వినియమ మాధ్యమాలు – జెండర్ దృక్పథం అంశం మీద చర్చలు నిర్వహిస్తారు. డా॥పుట్ల హేమలత, నందివెలుగు ముక్తేశ్వరరావు, నాగసూరి వేణుగోపాల్, ఎం.రత్నమాల, డా॥పద్మజాషా, డా॥కాత్యాయనీ విద్మహే, అనిశెట్టి రజిత, సి.వనజ, కట్టకవిత, పింగళి చైతన్య, వంగపల్లి పద్మ, స్వేచ్ఛ వొటార్కర్, ఆర్.ఎం.ఉమామహేశ్వరరావు, మందరపు హైమవతి, పి.రాజ్యలక్ష్మి, కళ్యాణం రాజేశ్వరి, తాయమ్మ కరుణ, కొండేపూడి నిర్మల, అత్తలూరి అరుణ, ఉష తురగా, మల్లిక, డా॥కొమర్రాజు రామలక్ష్మి, విష్ణుప్రియ, బి.జ్యోతి, ఎం.లక్ష్మి, లక్ష్మి, నలిగంటి రత్నమాల, డా॥మురాడి శ్యామల, రెహానా, సి.సుజాత, కొండవీటి సత్యవతి, వి.శాంతిప్రబోధ, భండారు విజయ తదితరులు పాల్గొంటారు.

సమ్మెట ఉమాదేవికి మాడభూషి రంగాచారి స్మారక పురస్కారం

సమ్మెట ఉమాదేవి రాసిన 'రేలపూలు' కథల సంపుటి మాడభూషి రంగాచారి స్మారక పురస్కారానికి ఎంపికైంది. ఫిబ్రవరి 25వ తేదీన హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన పురస్కార సభలో ఈ పురస్కారాన్ని అందజేస్తారు.

జాతీయ స్థాయి కవితల పోటీలు

ప్రపంచ కవితా దినోత్సవం సందర్భంగా మార్చి 21వ తేదీన 'వంతెన' కవిత్వ బులిటిన్ ఆధ్వర్యంలో కవితల పోటీలు నిర్వహిస్తోంది. తమ కవితలను 25 లైన్లకు మించకుండా ఫిబ్రవరి 28వ తేదీలోపు 'చిత్తలూరి', ప్రధాన సంపాదకులు, వంతెన కవిత్వ బులిటిన్, కేరాఫ్ అమూల్యాచందు కప్పగంతు, డోర్ నెం. 29 – 27 – 23, సూర్యనారాయణ వీధి, సూర్యారావు పేట, విజయవాడ –2 చిరునామాకు పంపాలి. సంప్రదించాల్సిన నంబర్లు : 9059824800, 9133832246

కుమ్మరి కథలు, బి.సి.కులవృత్తుల కథలకు అభ్యర్థన

కుమ్మరి జీవితం, బిసి. కులవృత్తులు (గీతకార్మికులు, విశ్వకర్మలు, మత్స్యకారులు, సంచార వృత్తులైన దాసరులు, దొమ్మరులు, వడ్డెరలు, జంగాలు, తోలుబొమ్మలు, గారడీ విద్యలు, గొల్లసుద్దులు, పగటి వేషాలు, హరికథ – వీధి భాగవత కళావంతులు మొదలైనవారు)పై వచ్చిన తెలుగు కథల్ని ఒక్కొక్క సంకలనంగా తీసుకురావాలని ప్రయత్నిస్తున్నారు డా॥మేడికుర్తి ఓబులేసు. కథలు పంపవలసిన చిరునామా డా॥మేడికుర్తి ఓబులేసు, అసిస్టెంట్ ప్రొఫెసర్ (కాంట్రాక్ట్), తెలుగు శాఖ, రాయలసీమ విశ్వవిద్యాలయం, కర్నూలు – 518007. ఇ మెయిల్ : medikurthiobulesu@gmail.com


పాఠశాల విద్యార్థులకు కవితల పోటీలు

ఉగాది, సంస్థ సిల్వర్‌జూబ్లీ ఉత్సవాలను పురస్కరించుకుని వసుంధర విజ్ఞాన వికాస మండలి రాష్ట్రస్థాయిలో పాఠశాల విద్యార్థులకు కవితల పోటీలు నిర్వహిస్తోంది. తెలంగాణ సంస్కృతి అంశంపై 20 లైన్లకు మించకుండా వచన కవితలను ఫిబ్రవరి 28వ తేదీలోపు పంపాలి. కవిత పంపేవారు పాఠశాల ప్రధానోపాధ్యాయుల ధృవీకరణ పత్రాన్ని జతచేసి సి.హెచ్. వెంకటరెడ్డి, అధ్యక్షులు, వసుంధర విజ్ఞాన వికాస మండలి, ఇంటినెం–16–1–238, శివాజీనగర్, గోదావరిఖని–505209, పెద్దపల్లి జిల్లా చిరునామాకు పంపాలి. సంప్రదించాల్సిన ఫోన్‌నెంబర్లు: 9182777409, 9989078568.

అభివృద్ధి

గతంలో నగరం
రోజంతా కష్టించిన వాడిలా
అలసట తీర్చుకోవడానికి
రాత్రి కాసింత కునుకుతీసేది
పాల డబ్బాల చప్పుళ్ళతో
పేపర్ బాయ్ సైకిల్ గంట గణగణతో
ఒళ్ళు విరుచుకునేది

నేటి నగరం
నలువైపులా విస్తరించి
విల్లాలై విలవిలలాడుతోంది
హైటెక్ హంగులన్నీ కలసి
రాత్రికి పగటికి



తేడా లేకుండా పోయింది
పాత జ్ఞాపకాలను
నెమరు వేసుకోవడానికి
కాసింత కునుకు తీయడానికి
సమయం లేకుండా పోయింది
వాహనాల రొదలు
కాలుష్యం కోరల మధ్య
ఊబకాయంలా పెరిగిపోయింది
మాదక ద్రవ్యాల మత్తులో
కూరుకుపోయింది

– గొట్టిపర్తి యాదగిరిరావు

మానవి
నవతెలంగాణ
manavi@navatelangana.com
హైదరాబాద్
సోమవారం 5-2-2018



అడవి... చెట్లను కాపాడుతుంది. చెట్లు వర్షాన్ని కురిపిస్తాయి. ఆ వర్షం రైతును కాపాడుతుంది. రైతు సంతోషంగా ఉంటే... దేశం సుభిక్షంగా ఉంటుంది. ప్రైవాటన్నింటినీ కాపాడే అడవిని కాపాడేదెవరు? స్మగ్లింగ్‌కు అడ్డుకట్ట వేసి వన సంపదను రక్షించేది ఎవరు? ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ ఉంది కదా! అని అందరికీ తోస్తుంది. కానీ... ఆ జార్ఖండ్‌లోని మాటుర్ఖమ్ చుట్టుపక్కల గ్రామాల్లో అడవులను ఓ మహిళ కాపాడుతోంది. ఆమె పేరు జమున. వ్యక్తిగా చేస్తే ఏది సాధ్యం కాదు. అందుకే తోటి మహిళలను కూడగట్టింది. పదివేల మందితో కలిసి... 'మహిళలు మార్పు చేయగలరు' అని నిరూపిస్తోంది. మాఫియాను తరిమికొడుతూ అడవులను రక్షించుకుంటోంది.

అడవిని కాపాడుతూ...

ప్రకృతిపై ప్రేమతో...

'మనుషులు బతకాలంటే చెట్లు ఉండాలి... చెట్లు ఉంటేనే మనిషి బాగుండేది' ఇదే జమునకు తెలిసింది. తనకి సైన్సు తెలియదు. జార్ఖండ్‌లోని మారుమూల గ్రామానికి చెందిన ఆమె గ్లోబల్ వార్మింగ్ అనే పదాన్ని కూడా ఎప్పుడూ వినలేదు. అయినా చెట్లంటే ప్రేమా, అభిమానం. చిన్నప్పట్నుంచి వాటిని చూస్తోంది. పొయ్యిలో పెట్టుకోవడానికి కర్రల నుంచి తినే పండ్ల వరకూ అన్నీ చెట్లే ఇస్తున్నాయి. మనుషుల కడుపు నింపుతున్నవీ, ఆరోగ్యంగా ఉండటానికి ఉపయోగపడుతున్నవీ అవే. వాటి నుంచి అంత సాయం పొందుతూ వాటిని రక్షించుకోకపోతే ఎలా... అనుకుంటూ ఉండేది ఎప్పుడూ! ఒడిశాలోని రాయ్‌రంగాపూర్ పట్టణంలో పుట్టి పెరిగింది జమున. తండ్రి వ్యవసాయం చేస్తాడు. చుట్టూ అడవి, పంట పొలాలు... పొలంపనిలో తండ్రికి సహాయం చేస్తూ పెరిగింది. విత్తనం చీల్చుకు వచ్చిన ప్రతి మొలకను పసిపిల్లల్లాగే చూసేది. ప్రకృతి అంటే అంత ప్రేమ ఆమెకు.



మహిళలను కూడగట్టి...

1998లో ఆమెకు 18 ఏండ్ల వయసులో మాన్‌సింగ్‌తో తుడుతో పెండ్లి అయ్యింది. భర్త కాంట్రాక్టరు. అతని ఊరు మాటుర్ఖమ్.. వంద కిలోమీటర్ల దూరం. మొదటిసారి అత్తారింట్లోకి వెళ్లి వెనుక తలుపు తీసిన జమున ఆనందాశ్చర్యాలకు లోనయ్యింది. మొత్తం అడవి. పచ్చని అడవి. తల్లిగారింటి దగ్గరే అనుకుంటే అంతకుమించిన అడవి. మొత్తం సాలు, టేకు చెట్లు. ఆనందం



పట్టలేకపోయింది. రోజూ అడవిలోకి వెళ్లడం ఎండిన కర్రలు వంటకి ఏరి తెచ్చుకోవడం... ఇదే పని. ఒకరోజు ఎప్పటిలాగే కర్రలు ఏరుకోవడానికి వెళ్లింది. కొందరు అక్రమంగా గొడ్డళ్లతో చెట్లను నరికేస్తున్నారు. చాలా బాధపడుతూ వెనక్కి వచ్చింది. ఆ ఒక్కరోజుతో చెట్లను కొట్టడం అవలేదు. కొన్ని రోజుల పాటు కొనసాగింది. ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు, వాళ్లని అడిగే ధైర్యం చేయలేదు. ఇదే విషయం గ్రామంలోని ఆడవాళ్లతో మాట్లాడింది. చెట్లని కాపాడుకోవాల్సిన అవసరం మనకెంతో ఉందని వివరించింది. ఈ తంతు కొన్ని రోజులపాటు కొనసాగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. వారిని అడగేందుకు ముందుకు రావడం లేదు. మొదట మనకేమొస్తుందిలే అనుకున్న మహిళలు ఆ తరువాత జమునకు తోడుగా వచ్చారు. అడ్డుకునేందోకు తమకు మద్దతుగా రావాలని మగవాళ్లను అడిగారు. వారు ఆసక్తి చూపించకపోవడంతో జమున నాయకత్వంలో మహిళలే ముందుకు కదిలారు.

సమితి ఏర్పాటు...

గ్రామంలోని సుమారు పాతిక మంది మహిళలు జమునకు తోడుగా వచ్చారు. తమ బృందానికి 'వన సురక్షా సమితి' అని పేరు పెట్టుకున్నారు. చెట్లు కొట్టే వారిని అడ్డుకుని, గ్రామం వదిలి వెళ్లేలా చేశారు. అక్కడితో ఆగకుండా... గ్రామంలోని గడపగడపకీ తిరిగి చెట్లని కాపాడుకోవాల్సిన అవసరం ఉందంటూ ప్రచారం చేశారు. 'ఒక్కసారి చెట్లు లేని ప్రపంచాన్ని వూహించుకోండి. ఎంత భయంకరంగా ఉంటుందో. అసలు మనం బతకగలమా...' అంటూ అర్థమయ్యేట్లు చెప్పారు. చెట్లనే కాదు అడవిలో ఉన్న జంతువులను కాపాడుకోవడమూ తమ బాధ్యతగా భావించారు. అడవిలోని జంతువులను వేటాడవద్దని గ్రామస్తులకు సూచించారు. జమున ధైర్యానికి చైతన్యం పొందిన కొందరు మగవాళ్లు కూడా ఆమె బృందంలో చేరారు. చెట్లు కొట్టే ముఠాలను అడ్డుకోవడమే వీరి ప్రధాన లక్ష్యం. ఉత్త చేతులతో వెళితే వాళ్లు చాలాసార్లు వీరిపై దాడి చేశారు. అందుకే వీళ్లు కూడా ఆయుధాలు సమకూర్చుకున్నారు. కర్ర లాఠీలూ, విషం పూసిన బాణాలూ, కర్రలూ సిద్ధం చేసుకున్నారు. మగవాళ్లు రాత్రిపూట కాపలా కాస్తే, ఆడవాళ్లు ఉదయం కాపలా ఉంటారు. చాలాసార్లు చెట్లుకొట్టి అమ్ముకునే దుండగుల చేతుల్లో వీళ్లు దెబ్బలు తిన్నారు. అయినా సరే, అడవి సంరక్షణని వదిలిపెట్టలేదు.

కృషిని గుర్తించి...

జమున ప్రారంభించిన వన సురక్షా సమితి గురించి అటవీశాఖ అధికారులకి తెలిసింది. వారు వీరి కృషిని దగ్గర నుంచి చూశారు. వెంటనే వీరుండే ముతురుఖాంని 'ఆదర్శ గ్రామంగా' ఎంపిక చేశారు. దాంతో ఎలాంటి వసతులు లేని ఆ గ్రామం రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. ఇప్పుడక్కడ సీసీ రోడ్లు పడ్డాయి. అంతవరకూ ఒక్క విద్యుత్తు స్తంభంలేని గ్రామంలో, ప్రతి ఇంటికీ కరెంట్ కనెక్షన్ వచ్చేసింది. మంచినీళ్ల కరవుతో బాధపడే మహిళల కష్టాలు తీరాయి. కొళాయిలు ఏర్పాటయ్యాయి. చెట్ల సంరక్షణతో ఒక్కటవడం అనేది గ్రామాబివృద్ధికి బాటలు పరిచింది. జమున తన సొంత స్థలంలో స్కూలుని కట్టించి గిరిజనుల పిల్లలకి చదువు చెప్పించడం మొదలుపెట్టింది. తన జీవితాన్ని పూర్తిగా గిరిజన పిల్లల చదువుకోసం, గ్రామం అబివృద్ధి కోసం అంకితం చేసింది జమున.


రెండు దశాబ్దాలుగా...

అయితే తన సేవను కేవలం గ్రామానికే పరిమితం చేయలేదు. చుట్టుపక్కల గ్రామాల్లోని మహిళలను సైతం కూడగట్టింది. 2004లోనే ఆమె 50 సమితిలను ఏర్పాటు చేసింది. అప్పుడు మాఫియా ఆమె ఇంటిపై దాడి చేసింది. నాలుగేండ్ల తరువాత మరోసారి పక్కనున్న ఊరికి భర్తతో కలిసి వెళ్తుండగా పదునైన రాళ్లతో వారిద్దరిపై దాడి చేశారు. ఆమె భర్త స్పృహతప్పి పడిపోయాడు. మొత్తం రక్తం. ఎన్ని దాడులు ఎదురైనా వెనుకడుగు వేయలేదు.

అవార్డులు...

దాదాపు మూడువందల బృందాలను ఏర్పాటు చేసింది. ఒక్కో బృందంలో 30 మంది మహిళలు ఉంటారు. పది వేల మంది మహిళలు ఆమె నాయకత్వంలో పనిచేస్తున్నారు. ఆమె సేవలకు గుర్తింపు లభించింది 2014లో 'గాడ్‌ఫ్రే ఫిలిప్స్ బ్రేవరీ అవార్డు' ఆమెను వరించింది. అడవులను రక్షించడం కోసం ఆమె చేస్తున్న కృషిని కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. రాష్ట్రపతి చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకుంది. ఒక పని మొదలుపెట్టడం సులభం. కానీ దాన్ని అంకితభావంతో కొనసాగించడం చాలా కష్టం. రెండు దశాబ్దాలుగా ఎక్కడా వెనక్కిపోకుండా తన సేవను కొనసాగిస్తున్నది జమున.

కట్ట కవిత



మనసు పదిలం...

పరీక్షల్లో ఫెయిల్ కావడం, ప్రేమలో విఫలం, ఆఫీసులో పని ఒత్తిడి, ఆర్థిక ఇబ్బందులు, పరువు ప్రతిష్టలకు భంగం కలిగినప్పుడు మనలో కొంతమంది ఆందోళన స్థాయిని దాటి తీవ్రమైన కుంగుబాటుకు లోనవుతుంటారు. చివరికి డిప్రెషన్‌ను నుంచి బయటపడలేక ఆత్మహత్యలకు సైతం సిద్ధపడుతుంటారు.

- ప్రపంచవ్యాప్తంగా డిప్రెషన్ అనేది ఒక పెద్ద సమస్యగా మారింది. మన దేశంలోనూ సుమారు 30 శాతం మంది డిప్రెషన్‌తో బాధపడుతున్నరని నిపుణుల అంచనా. అలాంటి సమయంలో మనసు పదిలంగా ఉండాలంటే కొన్ని సూచనలు పాటిస్తే సరిపోతుంది.
- డిప్రెషన్, కుంగుబాటు, మనోవ్యధ పేరు వేరు కావచ్చు కానీ సమస్య మాత్రం ఒక్కటే. అది అంతులేని మానసిక వ్యధ. అనుక్షణం అంతులేని ఆవేదన. ఓ వైపు నిరాశ, మరోవైపు నిస్పృహ.. మొత్తంగా ఇవన్నీ మనిషిని మానసికంగా కుంగదీస్తాయి.
- డిప్రెషన్ స్థాయిని గుర్తించి, వైద్యుల సలహాలను పాటిస్తే మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. డిప్రెషన్‌కు దూరంగా ఉండాలంటే మొహమాటాన్ని విడిచి పెట్టాలి. మొహమాటం కొన్నిసార్లు తీవ్రమైన ఒత్తిడికి గురి చేస్తుంది.
- మిమ్మల్ని ఒత్తిడికి గురి చేసే మనుషులకు దూరంగా ఉండాలి. జీవితంలో మిమ్మల్ని అదే పనిగా ఒత్తిడికి గురి చేసే వారు ఎవరైనా ఉంటే వారితో సంబంధాలు కొనసాగించటం ఓ సమస్యగా తయారైతే, అలాంటి వాళ్ళతో గడిపే సమయాన్ని పరిమితం చేసుకోవాలి.
- కొన్ని పరిస్థితులు నచ్చకపోయినా వాతావరణాన్ని మీ అదుపులోకి తెచ్చుకోవాలి. వ్యాకులత కలిగించే అంశాల జోలికి పోకపోవడం చాలా మంచిది.
- చేయాల్సిన పనుల జాబితాను రాసుకోవాలి. పనులు ఎక్కువైనట్టు కనిపిస్తే 'చేయవలసినవి' ఏవో, చేసి తీరాల్సినవి' ఏవో తేడా చూసుకోవాలి. నిజంగా అవసరంలేని పనులుంటే వాటిని జాబితాలో నుంచి పూర్తిగా తొలగించుకోవాలి. ఇలా చేయడం వల్ల మనసు కాస్త పదిలంగా ఉంటుంది.

కార్పెట్స్ కొనే ముందు!



- పర్ఫెక్టు ప్యాడ్ కలిగిన కార్పెట్‌ను ఎంపిక చేసుకోవాలి. ఫ్లోర్ మీద పరిచినప్పుడు ప్యాడింగ్ పర్ఫెక్టుగా ఉండాలి. మంచి మెటీరియల్‌తో తయారుచేసిన ప్యాడ్స్‌ను ఎంపిక చేసుకుంటే మంచిది. అలా తీసుకోవడం వల్ల త్వరగా పాడవకుండా, చిరిగిపోకుండా ఉంటాయి. రబ్బర్ లేదా ఫోమ్ మెటీరియల్‌తో తయారు చేసిన వాటిని వివిధ రకాల కార్పెట్ స్టైల్స్ ను చూసి మరీ ఎంపిక చేసుకోవాలి.
- బడ్జెట్‌కు సరిపోయే కార్పెట్‌ను ఎంపిక చేసుకొనేప్పుడు, ముందుగా షాపులను తెలుసుకోండి. లగ్జరీ కార్పెట్స్‌కు డిస్కౌంట్ కార్పెట్లకు మధ్య వ్యత్యాసం తెలుసుకొని, ఖరీదైన మెటీరియల్ ఏదో తెలుసుకొని ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది.
- కార్పెట్ కొనే ముందు సాధ్యమైనంత వరకూ బడ్జెట్‌కు, మీకు నచ్చిన కార్పెట్ ను ఎంపిక చేసుకోవాలి. పెద్ద పెద్ద షో రూమ్స్ , ఫ్లోరింగ్ కంపెనీలు, ఫర్నీచర్ స్టోర్స్, లార్జ్ డిపార్ట్ మెంట్ స్టోర్స్, ఆన్ లైన్‌లో కాకుండా మీకు నచ్చిన చోట కొనాలి.
- తక్కువ మెయింటెనెన్స్‌లో సురక్షితంగా ఉండే కార్పెట్‌లను ఎంపిక చేసుకోవాలి. స్టెయిన్ రెసిస్టెన్స్ కార్పెట్‌ను ఎంపిక చేసుకుంటే మరీ మంచిది. ఖరీదయిన వాటికి దూరంగా ఉండాలి.
- అందంగా కనబడుతున్నాయి కదా అని ప్రత్యేకమైన కార్పెట్స్‌ను , లాంగ్ వ్యారెంటీ కార్పెట్స్‌ను కొనుగోలు చేయకూడదు. చాలా వరకూ ఇలాంటి కార్పెట్స్ సరిగా ఇన్‌స్టాల్ చేసి ఉండరు. కాబట్టి వారెంటీని చూడకుండా మీకు నచ్చినది ఎంపిక చేసుకోవాలి.
- వాలిటైల్ సబ్‌స్టాన్స్ లేని ఫార్మల్ డీహైడ్ కార్పెట్‌ను, కెమికల్స్ ప్రభావం లేని కార్పెట్‌ను ఎంపిక చేసుకోవాలి. ఆర్గానికి, ఉలెన్ వంటి సహజ పదార్థాలతో తయారు చేసిన వాటిని ఎంపిక చేసుకోవాలి.

ఇట్లు చేద్దాం

అటుకుల్లో క్యాల్షియం అధికంగా ఉంటుంది. కాబట్టి వారానికి రెండు సార్లు అటుకులు ఆహారంలో చేర్చుకోవాలి. ఉదయం బ్రేక్‌ఫాస్టుగాను, సాయంత్రం స్నాక్స్‌లోకి అటుకుల వెరైటీస్ చేస్తే పిల్లలు ఇష్టంగా తింటారు.

ఆత్మవిశ్వాసమే ఆయుధంగా..

ఇంటి నుంచి కాలు బయటపెట్టిన అమ్మాయిలు తిరిగి ఇంటికి క్షేమంగా చేరేవరకు తల్లిదండ్రులు లోలోపల భయపడుతూనే ఉంటారు. రోజురోజుకు పెరుగుతున్న దాడులతో చాలామంది ఆడపిల్లలను బడి, కాలేజీ మాన్పించేస్తుంటారు. ఇంటికే పరిమితం చేసి అమ్మాయిల్లోని ప్రతిభకు ప్రతిబంధకాలను సృష్టిస్తారు. దీనితో ఆడపిల్లలు బయట జరిగే గొడవలను తల్లిదండ్రులకు చెప్పకుండా దాచే ప్రయత్నం చేసి.. మరిన్ని సమస్యలు తెచ్చుకుంటారు. ఇలా కాకుండా అమ్మాయిలు ఎలాంది ఆటంకాలనైనా ఎదుర్కొనేలా వారికి ఆత్మరక్షణ మెలకువలు నేర్పించాలి. అప్పుడే అమ్మాయిలు ఉన్నతవిద్యావంతులై సాధికారత దిశగా అడుగులు వేస్తారు. మరి వెంటపడి.. వేధించే వ్యక్తికి ఎలా బుద్ధి చెప్పాలో తెలుసుకుందామా..!

సెల్ఫ్ డిఫెన్స్



1 రోడ్డుపై నడుచుకుంటూ వెళ్లుతున్న అమ్మాయిని మెల్లగా వెనకవెనుక ఫాలో అయ్యాడు ఒక వ్యక్తి. ఎవరూ లేని ప్రదేశంలో ఆ అమ్మాయిని గట్టిగా పట్టుకున్నాడు. ఎత్తుకు పోయే ప్రయత్నం చేశాడు.



2 వెనకనుంచి తన చేతులతో తనను బంధించిన వ్యక్తి దాడికి ఆ అమ్మాయి భయపడిపోయింది. వెంటనే తెరుకుని బలాన్నంత తన మోచేతిలోకి తెచ్చుకుని.. అతని మెడ వంపులో అటాక్ చేసింది.



3 ఊహించని ఈ సంఘటనతో ఆ వ్యక్తి అప్రమత్తం అయ్యాడు. ఎలాగైనా ఆ అమ్మాయిని ఎత్తుకు పోవాలన్న ఆలోచనతో తనతో తెచ్చుకున్న మత్తుమందు చల్లిన కర్చీఫ్‌ను ఆ అమ్మాయి ముక్కుపై ఉంచే ప్రయత్నం చేశాడు.



4 తనను కిడ్నాప్ చేయడానికి అతడు చేస్తున్న ప్రయత్నిం గమనించిన ఆమె వాడికి అవకాశం ఇవ్వకుండా రెండుచేతులతో అతడిని వెనక్కి వంచుతూ తన చేతిని చురకత్తిగా మార్చి గొంతుపై అటాక్ చేసింది. అంతే బాధతో గిలగిలలాడుతూ అతడు కిందపడిపోతాడు.

అమ్మాయిలూ! అడుగడుగునా ఆపద పొంచి ఉంది. మీరు అనుక్షణం అప్రమత్తంగా ఉండాలి. అప్పుడే ఇంటా, బయట స్వేచ్ఛగా తిరగగలుగుతారు. మీలోని శక్తిని అనునిత్యం ఉత్తేజం చేసుకోవాలి. ఆత్మవిశ్వాసాన్ని మించిన ఆయుధం లేదని గుర్తుంచుకోండి.



ఎన్. లక్ష్మీ రవి,
ఇంటర్నేషనల్ గోల్డ్ మెడలిస్ట్,
రుద్రమదేవి సెల్ఫ్ డిఫెన్స్,
గాంధీనగర్, హైదరాబాద్.
9490239170,
9949039049

ఇప్పుడు వీస్తున్న గాలి బహుజన లెఫ్ట్ ఫ్రంటు



భూపతి వెంకటేశ్వర్లు

రెండు చేతులు కలిస్తే చప్పట్లు. నాలుగు గొంతుకలు పెగిలితే నినాదం...
అనేకానేక సంఘాలు సామాజిక న్యాయానికి రక్షణ కవచం.
ఒక చీమ ఒంటరి, వేయి చీమల దండు మహా సర్పాన్నయినా మట్టి కరిపిస్తుంది.
ఒక స్వరం అనామకం. వేయి గొంతుకలు రణన్నినాదం. అలాంటి ఒక అవసరం మన ముందున్నది.
వ్యవస్థలోని లోపాల్ని కడిగేద్దాం! సమాజంలోని అసమానతల్ని తరిమేద్దాం!!

సామాజిక న్యాయం - సమగ్రాభివృద్ధి సాదిద్దాం అన్న నినాదం. వ్యవస్థలో కదనోత్సాహాన్ని నింపుతున్నది. తెలంగాణ సామాజిక రాజకీయ రంగంలో ఇప్పుడొక గాలి వీస్తోంది. 25 పార్టీలతో గతనెల 25న "బహుజన లెఫ్ట్ ఫ్రంటు" (బీఎల్ఎఫ్) ఆవిర్భవించింది. పూలే, అంబేద్కర్, మార్క్స్ వారసత్వం మేళవింపు, స్వేచ్ఛ సమానత్వం, సౌభ్రాతృత్వం, అన్ని రకాల దోపిడీ ఆసమానతలపై యుద్ధం, రాష్ట్రంలో రాజకీయాధికారం సాధించడమే అంతిమ లక్ష్యంగా అడుగులు వేస్తున్నది.

లక్ష్యశుద్ధి, సామాజిక స్పృహ, నిబద్ధత భావ సారూప్యం ఉన్న బాధ్యతాయుత మిత్రుల కోసం వెతుకులాడుతున్నది. బీజేపీ, కాంగ్రెస్, టీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా కలిసి వచ్చే ప్రజలంతా ఒక్క చోటికి చేరాలి. తెలంగాణ భవిష్యత్ రాజకీయాలపై సామాజిక న్యాయ ఆశలను రేకెత్తిస్తున్నాయి. అసమానతలు అణచివేతలు, అసహనాలు, ఆధిపత్య భావజాలం రాజ్యం చేస్తున్నప్పుడు ఎక్కడో అక్కడ అలజడి చెలరేగుతున్నది. కొత్తగాలి వీస్తున్నది. చిరుగాలితో మొదలై సుడిగాలిలా మారుతుంది. సమిష్టి పోరాటాలకు శంఖారావాన్నీ పూరిస్తుంది. ఓటు హక్కు ప్రాధాన్యాన్ని ప్రజలకు వివరిస్తోంది. సంక్షేమ పథకాల మాటున దాగిన అవినీతి బాగోతాల్ని బట్టబయలు చేస్తోంది.

నిలదీసే దొకటి. నిప్పుతో కడిగేదొకటి.
ప్రశ్నించడం నేర్పేదొకటి పోరాట సూత్రాలు బోధించేదొకటి.

చెవి మెలి తిప్పేదొకటి. చాచిలెంపకాయ కొట్టేదొకటి.

దేని శైలి దానిదైనా, ఎవరి లక్ష్యాలు వారికున్నా అంతిమ లక్ష్యం - సామాజిక తెలంగాణ ప్రజాస్వామ్య పరిరక్షణే ధ్యేయంగా పని చేస్తుంది. తిండి, బట్ట, ఇల్లు వంటి కనీస జీవితావసరాలు తీరనేలేదు. సాధించిన తెలంగాణ రాష్ట్రం ఈనకాచి నక్కల పాలైన చందమైనది. నియంతృత్వ వికృత క్రీడలో విలవిలలాడుతుంది. ఇది కేవలం భౌగోళిక తెలంగాణ మాత్రమే "జై తెలంగాణ అంటూ ధూం ధాం ఆడి-పాడిన కవులు, కళాకారులు ఇప్పుడు "తిరగబడ్డ ధూంధాం"కు సిద్ధపడుతున్నారు. సామాజిక న్యాయ భావ వ్యక్తులు, బృందాలు ప్రజలకోసం పని చేస్తున్నవారంతా ఐక్య సంఘటన" అవుతున్నారు. తెలంగాణ కష్టాలు, కడగండ్లకు మూలకారణాలు, పాలిస్తున్న వర్గంలోనే ఉన్నాయని జనం గ్రహిస్తున్నారు. అవే విధానాలు అదే పాలన, పాలకులు మారినా విధానాలు మారలేదు.

> **టీఆర్ఎస్ గెలిచినప్పటి నుండి మునుపటి పాలకుల పాలనే. బంధించిన కవులు, కళాకారులు తప్ప ప్రజా భావుకతతో పని చేసేవారికి ఇచ్చే గౌరవమేపాటిది. మూతపడ్డ ప్రభుత్వరంగ సంస్థలకు జీవం పోస్తామన్న వాగ్దానం ఏమైంది. సామాజిక, ఆర్థిక అసమానతల తగ్గింపు, రైతు ఆత్మహత్యల నివారణ, నాణ్యమైన విద్యా వైద్య సదుపాయాలు, ఉపాధి కల్పన, చేతివృత్తులకు చేయూత ఏమయ్యాయి. ఇక నియామకాలు విద్యార్థి, యువతను తీవ్ర నిరాశకు గురిచేశాయి.**

విధాన వైఫల్యం ప్రధానవైకల్యం నుంచి మొగ్గ తొడిగిన ప్రజల అసహనమే ఈ ఫ్రంటు. బడుగుల బలం, దళితులగళం, ముస్లిం మైనారిటీల మైత్రీ - ఈ ఫ్రంటుకు అండ. పీడిత వర్గాల ప్రజల సమాహారం. మనమట్టిపై మన జెండా ఎగరాలి. మన మట్టి మనుష్యులే మన గడ్డపై ఏలాలి" అంటూ దోపిడీ, వ్యతిరేకత సామాజిక న్యాయ విత్తనాలను నాటి పోరుసేద్యం చేస్తున్నది బహుజన లెఫ్ట్ ఫ్రంటు. ఉద్యమ పార్టీ అంటూ గద్దెనెక్కిన నాయకత్వమే ప్రజా ఉద్యమాల పీకనులుముతున్నది. నాలుగున్నర కోట్ల ప్రజల సుదీర్ఘమైన నీళ్లు, నిధులు, నియామకాలు మన పోరాట పయనం వైకుంఠపాళిలా మళ్లీ మొదటికే వచ్చింది.

మళ్లీ మొదలెట్టాలి, నిరంతరం పోరాటం-పోరాటం తప్ప విరామమే దొరకని బతుకులు మనవి, మన ముత్తాతల నుంచి మునిమనవల దాకా గాయాలేకదా.

ఆత్మహత్యలు లేని దినం, రోడ్డెక్కని రోజు ఉందా? తెలంగాణ పల్లెపల్లె వల్లకాడుగా మారుతున్నది. ఆకుపచ్చని తెలంగాణ కావాలని, ఆత్మహత్యలు లేని తెలంగాణ రావాలని, ప్రజాస్వామ్య హక్కులకు భంగంలేని తెలంగాణ కావాలని, సకల సామాజిక వర్గాలకు న్యాయం దక్కాలని కోరుకున్న వాళ్లకు ఆశాభంగమే కలిగింది కదా? టీఆర్ఎస్ గెలిచినప్పటి నుండి మునుపటి పాలకుల పాలనే. బంధించిన కవులు, కళాకారులు తప్ప ప్రజా భావుకతతో పని చేసేవారికి ఇచ్చే గౌరవమేపాటిది. మూతపడ్డ ప్రభుత్వరంగ సంస్థలకు జీవం పోస్తామన్న వాగ్దానం ఏమైంది. సామాజిక, ఆర్థిక అసమానతల తగ్గింపు, రైతు ఆత్మహత్యల నివారణ, నాణ్యమైన విద్యా వైద్య సదుపాయాలు, ఉపాధి కల్పన, చేతివృత్తులకు చేయూత ఏమయ్యాయి. ఇక నియామకాలు విద్యార్థి, యువతను తీవ్ర నిరాశకు గురిచేశాయి. సమగ్రాభివృద్ధి అంటే హైదరాబాదు నగరమే కాదు. జిల్లా, మండల మారుమూల పల్లెల్లో విద్య, వైద్యం, సాగు, తాగునీరు వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు, కళలు, సాహిత్యం ఇత్యాది రంగాలలో అభివృద్ధి ఏది? రాష్ట్రంలో నేటికీ అగ్రకుల ధనవంతులే అన్ని రంగాలలో ఆధిపత్యంలో ఉన్నారు. భూమి, పరిశ్రమలు, వ్యాపారాలు, సంపదలు వీరి కబంధ హస్తాల్లోనే కేంద్రీకృతమై ఉన్నమాట వాస్తవం కాదా? అగ్రవర్ణ పెత్తందారులు కుర్చీలో కూసుంటే ఆ కుర్చికి కస్తూరి వాసనా? బీసీ, ఎస్సీలు కూర్చుంటే ఆ కుర్చీకి గబ్బిలాల వాసనా? ఇక సహించేది లేదు. అడుక్కుంటే వచ్చేది భిక్షం అన్నాడు మా అంబేద్కర్. విప్లవమంటే రాజ్యాధికారం అన్నాడు మార్క్స్, పోరాడుతాము. మేము రాజ్యాధికారంలోకి వస్తే ప్రత్యామ్నాయ పాలనా ప్రణాళికలు ప్రజల ముందుంచుతాము. మనీ, మీడియా, మాఫియా అగ్రకులాధిక్యత అనే నాలుగు మహా పర్వతాలను ఢీకొని ఓటు చైతన్యంతో పగల గొడుతాము. ఎక్కడి కృషి అక్కడ సాగాలి, ఎక్కడి నాయకత్వం అక్కడే స్వయంగా కష్టపడి మన ప్రజల విశ్వాసం చూరగొని చైతన్యం తేవాలి. తెలంగాణ సామాజిక న్యాయ నిర్మాణంలో బహుజన లెఫ్ట్ ఫ్రంటు ఆధికారంలోకి వస్తే ఏమి చేస్తుందో విడమరిచి చెప్పనుంది. పొంగుకొస్తున్న ప్రజల ఆలోచనలు పట్టుకోగలిగిన వామపక్ష, బహుజన నాయకులు అనేక ఉద్యమాలలో అనుభవం కలిగి నిజాయితిలో రాటుతేలిన వారున్నారు. అదే బీఎల్ఎఫ్‌కు పెద్ద ఆస్తి. కత్తి కట్టిన కోడి పుంజుల్లా కమలం, కాంగ్రెసు, గులాబి పార్టీలు ఈ ఎన్నికల్లో ప్రజలను మరోసారి మోసం చేయనున్నాయి. వాటికి ధీటుగా ప్రత్యామ్నాయ శక్తిగా సాధికార దిశగా అడుగులు కదులుతున్నాయి. అన్నింటికీ మించి ప్రజా సాంస్కృతిక సేన గద్దర్ ఈ ఫ్రంట్‌లో భాగస్వామిగా ఉన్నాడు. అతని పాటలో యుద్ధం, అతని ఆటలో ప్రళయం, ఆట పాటలో ప్రజల ప్రపంచముంది. దళిత మేధావులు కాకి మాధవరావు, నల్లా సూర్యప్రకాశ్, ప్రొ॥ తిరుమలి, జె.బి.రాజు, బహుజన నాయకులు కంచ ఐలయ్య, పిఎల్ విశ్వేశ్వరావు, తదితరులున్నారు. "మోసపోయెనునాడు - ఇక మోసపోమిక నేడు మాటిమాటికీ నీ ఆటసాగదురో" అని తెగేసి చెప్పుతున్నారు. తెరలు తెరలుగా ఆలోచనలు ఆవేదనలు తన్నుకొస్తున్నాయి. నూరుపూలు వికసిస్తాయి. వేయి ఆలోచనలు సంఘర్షిస్తాయి.

సెల్ : 9490098343

తెలంగాణ కుంభమేళా మేడారం జాతర



కామిడి సతీష్‌రెడ్డి

పచ్చని అడవిలో ఇసుకవేస్తే రాలనంత జనం. కంకవనం తోడుగా కుంకుమ భరిణెలో గద్దెలకు పయనం. కోయ పూజారులతో కొలువైన చిలకల గుట్ట దేవగణం. తడి బట్టల స్నానాలతో పూనకాల ప్రభంజనం. నిలువెత్తు బెల్లాలు తల్లులకు మొక్కులుగా సమర్పణం. సంప్రదాయ వేషధారణల నృత్యాల సమ్మేళనం. కోరిన కోర్కెలు తీర్చే తెలంగాణ రాష్ట్ర ప్రజల కొంగు బంగారం, మేడారంలోని సమ్మక్క, సారలమ్మల ప్రాంగణం. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని అడవీ ప్రాంతంలోగల తాడ్వాయి మండలంలోని మేడారం గ్రామంలో కొలువైన సమ్మక్క, సారలమ్మల జాతర తెలంగాణ కుంభమేళా జనవరి 31నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు జరిగింది. భక్తులను వివిధ ప్రాంతాల నుంచి తరలించడానికి తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ సుమారు 4,200 బస్సులను తిప్పింది. దేశంలోనే అతి పెద్ద గిరిజన జాతరగా, ప్రసిద్ధిపొందిన సమ్మక్క, సారలమ్మ ఆదివాసీల జాతరకు మన రాష్ట్రం నుండే గాక ఆంధ్రప్రదేశ్, ఒరిస్సా, చత్తీస్‌గడ్, మహారాష్ట్ర, కర్నాటక, తమిళనాడు తదితర రాష్ట్రాల నుంచి జనాలు భారీగా తరలివచ్చి వీరవనితలకు మొక్కులు చెల్లించుకున్నారు. దేవతల దర్శనానికి ముందు జంపన్నవాగులో పుణ్యస్నానాలు చేసేందుకు తగిన నీరు లేనందున స్నానఘట్టాల వద్ద ఏర్పాటు చేసిన బ్యాటరీ ఆఫ్ ట్యాప్‌ల వద్ద స్నానాలు చేసేందుకు పోటీ పడ్డారు. అమ్మవార్లకు భక్తులు మొక్కులు సమర్పించేందుకు ఎత్తు బంగారం (బెల్లం), పసుపు, కుంకుమలతో పాటు తల్లుల గద్దెల వద్దకు వచ్చి కానుకలు అప్పగించడం మేడారం సాంప్రదాయం. అధికశాతం భక్తులు కోళ్లు, మేకలు, గొర్రెలను బలి ఇచ్చి మొక్కు చెల్లించుకుంటారు. కుటుంబాలతో సహా వచ్చి తలనీలాలు సమర్పించుకుంటారు. దర్శనానికి వచ్చే భక్తుల మొక్కులు చెల్లించుకన్న అనంతరం జాతర పరిసరాలలోని చిలుకల గుట్ట, జంపన్నవాగు, శివరాంసాగర్ వంటి ప్రాంతాలలోని చెట్ల నీడన సేద తీరుతారు. అటు కాళేశ్వరం, ఇటు ముల్ల కట్ట వద్ద గోదావరిపై వంతెనలు ఏర్పడడం వల్ల మహారాష్ట్ర, చత్తీస్‌గడ్, రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు.

గిరిజనులు దేవతామూర్తులుగా కొలిచే, ఆరాధించే సమ్మక్క, సారలమ్మలు ఇద్దరు తల్లీ కూతుళ్లు. గిరిజనుల హక్కుల కోసం ఎదురు తిరిగి పోరాడిన వీర వనితలు. 12వ శతాబ్ధంలో కరీంనగర్ జిల్లా పొలవాస ప్రాంతాన్ని గిరిజన దొర మేడరాజు పాలిస్తుండేవాడు. అతనికి సంతానం లేదు. ఒకనాడు వేటకు వెళ్లి అడవిలో పులుల మధ్య ఆడుకుంటున్న చిన్న పిల్లను చూశాడు. దేవుడిచ్చిన వరంగా భావించి ఆ పాపను తన ఇంటికి తీసుకొచ్చి సాదుకున్నాడు. సమ్మక్క అని పేరు పెట్టాడు. సమ్మక్క చిన్నప్పటి నుంచి చెట్ల వైద్యం చేస్తూ తోటి గిరిజనులను రక్షించేది. మేడరాజు మేనల్లుడు పడిగిద్దరాజు. ఇతను కాకతీయులకు సామంతరాజుగా ఉండి మేడారంను పాలిస్తుండేవాడు. పడిగిద్దరాజుకు సమ్మక్కను ఇచ్చి వివాహం చేశారు. కాకతీయ రాజులతో వీరు పోరాటం చేశారు. అతిపెద్ద సామ్రాజ్యమైన కాకతీయ రాజు సైన్యం ముందు పడిగిద్ద రాజు సైన్యం నిలబడలేకపోయింది. అప్పటి నుంచి ఆదివాసీలు, గిరిజనేతరులూ సమ్మక్క, సారలమ్మలను కొలుస్తూ జాతర నిర్వహిస్తున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాగా ఏర్పడిన తర్వాత జరిగిన మొదటి జాతర ఇది.

సెల్ : 9848445134

కొత్తగా పాడుతున్న పాతపాట



తోకల రాజేశం

'ఒక జాతిని కానీ దేశాన్ని కానీ చీల్చాలంటే అందుకు మతాన్ని మించిన ఆయుధం లేదంటాడు' జార్జ్ బెర్నార్డ్‌షా. ప్రస్తుతం దేశాన్నేలుతున్న వాళ్లకి ఈ విషయం బాగా తెలుసు. హిందువులు హైందవేతరులు అన్న స్పష్టమైన విభజన రేఖ గీసి దేశాన్ని చీల్చే ప్రయత్నాలను గతం కంటే విభిన్నమైన పద్ధతుల్లో, రూపాల్లో చేస్తున్నారు. రాజకీయ రంగం ద్వారా వీళ్లు పాల్పడుతున్న కలుషిత కార్యక్రమాలకు వంత పాడుతూ భావజాల రంగంలోని కొందరు ప్రజలను తప్పుదోవ పట్టించే బాధ్యతను తమ పవిత్ర కర్తవ్యంగా భుజాలమీదకెత్తుకున్నారు. వీళ్లు సాహిత్యానికి మతోపదేశాలు చేస్తారు. చరిత్రను కాషాయీకరిస్తారు. కాదంటారా? అంతుచూస్తామని బెదిరిస్తారు. తెలుగునేల మీద అలాంటి పవిత్ర బాధ్యతను నెరవేరుస్తున్నవారు ముదిగొండ శివప్రసాద్. "హిందువులంతా హిందువులేనా? అని ఒక దినపత్రికలో రాసిన వ్యాసంలో ప్రశ్నించారు.

గత కొన్ని దశాబ్దాలుగా రచనారంగంలో కొనసాగుతున్నప్పటికీ ముదిగొండ వారి వ్యాసాలలో కొత్తదనం కానీ, నేర్చుకోవలసిన విషయాలు కానీ లేకపోవటం వారి విశిష్టత. అవే పాత కోతలు, చరిత్ర వక్రీకరణలు, అసత్య ప్రచారాలు, చరిత్రకు నిలబడని నిలకడలేని సొంత భాష్యాలు. కోతికి కొబ్బరి చిప్ప దొరికినట్టు శివప్రసాద్ చేతికి చరిత్ర చిక్కింది. దాన్ని తనివి తీరా, రక్తాలు కారేలా రక్కకపోతే ఆయన పెన్నుకు విశ్రాంతి కలుగదు.


"కాకినాడ శ్రీపీఠం అధిపతి శ్రీపరిపూర్ణానంద ఇటీవల మాట్లాడుతూ ప్రముఖ చలనచిత్ర నటుడు కమల్‌హాసన్ దేశద్రోహి అన్నారు. హిందువులు ఉగ్రవాదులు అంటూ కమల్‌హాసన్ కొద్దిరోజుల క్రితం చెన్నైలో వ్యాఖ్యానించాడు. ఆ సందర్భంగా శ్రీపీఠం అధిపతి ఇలా అన్నారు..." అని శ్రీశివప్రసాద్ తన వ్యాసానికి శ్రీకారం చుట్టారు. ప్రారంభంలోనే పానం గుంజినట్టుంది.. అందుకే ఏకంగా వక్రీకరణతోనే వ్యాసాన్ని మొదలుపెట్టారు. హిందువులను ఉగ్రవాదులు అని కమల్‌హాసన్ అనలేదు. "దేశంలో హిందూ ఉగ్రవాదం పెరిగిపోతున్నదని" అన్నాడు. దేశంలో ఇటీవల హిందూమతం పేరుమీద జరుగుతున్న ఉగ్రవాద చర్యల నేపథ్యంలో ఆయన అలా అనవలసి వచ్చింది. అలాంటి ఒక అర్థంలో ఎమర్జెన్సీలాంటి చీకటి రోజులు నేడు దేశంలో లేవని ముదిగొండ వారు అనగలరా? కమల్‌హాసన్ లేవనెత్తిన ప్రశ్నకు సమాధానం చెప్పలేక.. ఆయన అనని మాటలను అంటగట్టడం కుటిల నీతి. ప్రశ్నించిన వాడినల్లా దేశద్రోహుల జాబితాలో జమకట్టే అపరిపూర్ణులను సమర్థించేదేమీ ఉండదు. వారు అపార అజ్ఞానాన్ని బయటపెట్టుకోవటానికి మించి సాధించేదేమీ ఉండదు.

ఇక హిందూ శబ్దానికి శివప్రసాదు తనదైన శైలిలో కొత్త నిర్వచనమిచ్చారు. 'హిం' అంటే హింస, దు అంటే దూషించటం. హింసా మార్గాన్ని వదిలిపెట్టినవాడే 'హిందువు అని ఈ పదానికి అర్థమట. హిందూ పదానికి ఇంత చక్కటి నిర్వచనం ఇచ్చినందుకు భవిష్యత్తులో నోబెల్ పురస్కారాన్ని హిందూదేశ చక్రవర్తి మోడీ ఇప్పిస్తాడన్న నమ్మకం నాకుంది. అదలా ఉంచితే ఈ నిర్వచనానికి ఏ వేదం ఆధారమో? ఏ పవిత్ర గ్రంథం హింసను దూషించేవాడే హిందువు అని చెప్పిందో సెలవిస్తారా? నిర్వచనాలన్నవి మన ఇష్టాయిష్టాలకు అనుగుణంగా ఇచ్చుకునేవేనా? చరిత్రతో, విలువలతో, ప్రజా జీవితంతో సంబంధాల నుంచి కాక మతానికి వ్యక్తిగత ఇష్టాయిష్టాల పరిధిలో నిర్వచనం ఇచ్చిపారేసి వచ్చే అర్థం వల్ల దాని గత చరిత్ర అంతా రద్దైపోతుందా? హింసను ఇష్టపడని వాళ్లే హిందువులు అని శివప్రసాదు చెప్పే అర్థంలో ఇతర మతాల వాళ్లు హింసను ఇష్టపడతారన్న ధ్వని ఉంది. సందర్భం వచ్చింది కాబట్టి... మతాలన్నీ హింస నుంచి పుట్టినవే. హింస లేకుండా మతం బతికి బట్టకట్టిన చరిత్ర లేనేలేదు. ఒక మతం తన ప్రాబల్యం కోసం ఇంకో మతం మీద హింసను ప్రయోగించటం చరిత్రలో మనం చదువుకున్నదే. శైవవైష్ణవాల మధ్య జరిగిన రక్తపాతాలు హింసకు సంబంధించినవి కావా? చచ్చిన పీనుగు మీద తెల్లగుడ్డ కప్పినంత సులభంగా చరిత్రను చంపి దాని మీద కాషాయం గుడ్డ కప్పటం సాధ్యం కాదు. కాషాయవాదులకు ఇది ఎన్నటికీ తీరని కోరికే.

ముదిగొండవారు.. "కమల్‌హాసన్‌ను సూపర్‌స్టార్ చేసింది హిందువులు. కానీ ఇవ్వాళ అతను హిందువులు ఉగ్రవాదులు అంటున్నాడు. శ్రీపీఠం అధిపతి శ్రీపరిపూర్ణానంద స్వామి చెప్పినట్టు హిందువులను ఇంతగా ద్వేషించే వాడు చైనాలో, పాకిస్థాన్‌లో, బంగ్లాదేశ్‌లో సుఖజీవనం సాగించవచ్చు కదా! వాటికన్‌లో తెల్లవాళ్లే పోపులౌవుతారు. కానీ నల్లని ద్రావిడ్ షెఫర్డ్ ఐలయ్యను ఎన్ని జన్మలెత్తినా పోపును చేయరు. ఇండియాలో ఉన్నంత వరకే వీరికి బతుకుదెరువు" అని దబాయిస్తున్నారు. ఒకవైపు శూలంతో గుచ్చుతూనే... చూశారా మాకెంత సహనం ఉందో. మీ ప్రాణాలను తీయలేదు. మాది అహింసా సిద్ధాంతం అని చెప్పినట్టుగాఉంది వీరి వ్యవహారం. వేరే దేశాలకు వెళ్లండని చెప్పే హక్కు.. అధికారం వీళ్లకెవరిచ్చారు. బ్రాహ్మణీయ భావజాలం మీది. ద్వేషాన్ని తెలివిగా.. కుట్రతో హిందువుల మీద ద్వేషంగా ప్రచారం చేయటం.. హిందువులను ఇతర మతాల వాళ్లకు వ్యతిరేకంగా రెచ్చగొట్టడం ఒక పథకం ప్రకారం బ్రాహ్మణీయ కుట్రదారులు చేస్తున్న పని. ఈ రకరకాల వ్యాఖ్యానాలన్నీ ముందు చెప్పినట్టు మతం పేరుమీద సాగించే విభజన రాజకీయాలకు సిగ్గులేకుండా వంత పాడటంలో భాగమే. ఐలయ్య పోప్ కాలేడు సరే హిందూమతంలోని ఒక మాదిగను తిరుమల తిరుపతి ప్రధాన పూజారిగా మీరు చేయగలరా? తమరివి బంగారు గజ్జెలే కానీ ఎదుటివాని కాళ్లవి ఇనుప గజ్జెలా? ఎదుటివాన్ని నిందించే ముందు మన దగ్గర ఎలాంటి తప్పులు లేకుండా చూసుకోవాలి. పెన్నుంది కదా అని పిచ్చి పిచ్చి రాతలు రాసి పరువు పోగొట్టుకునే బదులు శ్రీరామకోటి రాసుకుంటే మంచిది. కమల్‌హాసన్ రాజకీయాల్లోకి వచ్చి సేవ చేయాలనుకుంటున్నాడని... అయితే తన అభిమానులతో కలిసి వరదలలో చిక్కుకున్న చెన్నై ప్రజలకు సేవచేయవచ్చు. అయార్‌నదీ పరీవాహక ప్రాంతాలలో పూడికలు తీయవచ్చు. ఐదు రూపాయలకే భోజనం పెట్టవచ్చు అని సూచనలిస్తున్న ముదిగొండవారు ఎంతమంది బీజేపీ వాళ్లకు ఈ సూచనలు ఇచ్చాడో తెలుసుకోవాలనుంది. ఇప్పుడున్న నాయకులందరూ ఆ పనులే చేస్తే, కమల్‌హాసన్ రాజకీయాల్లోకి రావలసిన అవసరం ఎందుకు ఏర్పడుతుంది? పదవుల్లో ఉండి పనిచేయని నాయకులను ప్రశ్నించకుండా.. రాజకీయాల్లోకి ఇంకా అడుగు కూడా పెట్టని కమల్‌హాసన్‌ను బెదిరించటం ఎవరి ప్రయోజనాల కోసం? మోడీయుల కోసం అని కొత్తగా చెప్పనక్కరలేదు. ముదిగొండవారికి ఇలా పాడటం కొత్తకాదు. పాత పాటనే కొత్తగా పాడటం ముదిగొండవారికి మతంతో పెట్టిన విద్య.

సెల్: 9676761415

సామాజిక న్యాయ పోరులో బహుజనులే న్యాయ నిర్ణేతలు



నాదెండ్ల శ్రీనివాస్

పారిశ్రామికీకరణ వల్ల పెట్టుబడిదార్లూ, కాంట్రాక్టర్లు మాత్రమే బాగుపడ్డారు. అయినా దానిని కూడా డబ్బున్న వాళ్ల ప్రగతి అనలేదు. దేశ ప్రగతి అన్నారు. ఇంజనీరింగ్, మెడికల్ కాలేజీలు, పరిశోధనా కేంద్రాలూ, విశ్వవిద్యాలయాలు వీటన్నింటి వల్లా డబ్బున్న వాళ్లే బాగుపడ్డారు. కానీ దానిని కూడా దేశ ప్రగతే అన్నారు. ఇవన్నీ దేశ ప్రగతి అయినప్పుడు కొద్దో గొప్పో రిజర్వేషన్ల పుణ్యమాని బాగుపడితే మాత్రం దానిని దేశ ప్రగతి అనకుండా రిజర్వేషన్లు అభివృద్ధికి ప్రతిబంధకాలు అని ఎందుకు అంటున్నారు? కుల వివక్ష పాటించడానికి వీలు లేదు అంటే మరి మాకు ఇవ్వకుండా వాళ్లకు మాత్రమే ఇస్తే ఎలా? అంటూ ఆధిపత్య కులాలు కోర్టుకు పోయాయి. (1) రిజర్వేషన్లు ఇవ్వడానికి కులాన్ని ప్రాతిపదికగా వాడుకోవాలా? సామాజికంగా, విద్యాపరంగా ఒక కులం వెనకబడి ఉందా, లేదా అని చూడవచ్చా? (2) వర్గీకరణకు కూడా అవసరమైన చర్చ ఏంటంటే ఏదో ఒక కేటగిరిలో వెనకబడిన వాళ్లు, మరీ వెనకబడిన వాళ్లు అనే ఉపవర్గీకరణ చేయవచ్చా? (3) మొత్తం రిజర్వేషన్లు ఎంత ఉండాలి. 50 శాతం కంటే ఎక్కువ ఉండొచ్చా, లేదా? అనే ఈ మూడు అంశాలు రాజ్యాంగ సవరణ తర్వాత సుప్రీం కోర్టులో చర్చలు నలుగుతూనే ఉన్నాయి. మండల్ కమిషన్ కేసు తుది తీర్పులో ఒక కులం మొత్తం సామాజికంగా, విద్యా పరంగా వెనకబడి ఉంటే కులాన్ని వాడుకోవడం తప్పేమీ కాదని, అప్పుడు కులం ప్రాతిపదికగా రిజర్వేషన్లు ఇవ్వొచ్చు అని తీర్పు ఇచ్చారు. ఇవాళ అది స్థిరపడ్డ నిర్ణయం. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ బీసీలలో ఏ, బీ, సీ, డీ వర్గీకరణ ఉంది. దీని మీద ఎవరూ కోర్టుకు పోకుండానే ఆమోదించారు. కొందరు అందుకోలేక పోతున్నారు, కొందరు అందుకోగలుగుతున్నారు అనుకున్నపుడు వెనకబడిన, మరింత వెనకబడిన అని విభజించవచ్చు అనేది సుప్రీం కోర్టు తీర్పు. మొత్తం రిజర్వేషన్ 50 శాతం మించడానికి వీల్లేదు అని తీర్పునిచ్చిన సుప్రీం పంచాయతీ రాజ్ చట్టం తర్వాత వచ్చిన ఎన్నికల్లో పెట్టిన 70శాతం రిజర్వేషన్ రాజ్యాంగ విరుద్ధం అనలేదు. పంచాయతీ పదవులకు లేని అభ్యంతరం విద్య, ఉద్యోగాల్లో 50 శాతానికి మాత్రమే పరిమితం కావాలి అన్న సుప్రీం తీర్పుకి అర్థమేమీ లేదు.

ఒక్కొక్కరి జీవన విధానంలో తేడాలుంటాయి. లంబాడీలు ముందు నుంచి కూడా అడవి కంటే మైదానం ప్రాంతాలలో ఎక్కువ ఉన్నారు. గోండ్లు, కోయలు ఎక్కువగా అడవిలో ఉన్నారు. లంబాడీల జీవన విధానంలో మొదటి నుండీ వాళ్లకు మారకంతో పరిచయం ఉంది. అంటే వ్యాపారంతో వాళ్లకు పరిచయం ఉంది. దాంట్లో ఉపవర్గాలు కొంత చైతన్యపరులై, ఆలోచనా పరులైనప్పుడు మాకు సమానంగా రావడం లేదు ఏంటి? మాకూ రావాలి అనే డిమాండ్ న్యాయబద్ధమైనదే. ఒక కులం వాళ్లు ఎక్కువ రాగలుగుతున్నారు, వేరే వాళ్లు అందుకోలేకపోతున్నారు. కాబట్టి ఆదివాసులది సకారణమైన, న్యాయ బద్ధమైన డిమాండ్. నోరున్న వాళ్లకు జరిగే చిన్నచిన్న అన్యాయాలు సైతం బాగా ప్రచారం అవుతుంటాయి. కానీ నోరు లేని వాళ్లకు ఎంత పెద్ద అన్యాయం జరిగినా అది కనీసం వార్త కూడా కాదు. ఆదివాసులలో విద్యను ప్రోత్సాహించే ఉద్దేశ్యంతో 1986లో ఒక జీవో విడుదలైంది. ఆదివాసీ అంటే ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న స్కూళ్లంటిలోనూ ఉపాధ్యాయుల పోస్టులు ఆదివాసులకే ఇవ్వాలని ఈ జీవో చెప్తుంది. దీని వల్ల రెండు లక్ష్యాలు సాధించాలనేది ప్రభుత్వ ఉద్దేశ్యం.

(1) టీచర్లు స్థానిక ఆదివాసులైతే అక్కడే ఉండడానికి అభ్యంతరం చెప్పరు. ఇతరులకు ఏజెన్సీలో పోస్టింగ్ వేస్తే బయటికి బదిలీ చేయించుకునే పైరవీతోనే గడుపుతారు. ఆదివాసీ ఉపాధ్యాయులు అవసరమైనప్పుడు తమభాషలో బోధించగలరు. తమ వారే ఉపాధ్యాయులు కావడం ఆదివాసీ పిల్లలకు మానసిక స్థైర్యాన్ని, చదువు కోవడానికి ప్రోత్సాహాన్ని ఇస్తుంది. (2) ఆదివాసీలకు ఉద్యోగాలు దొరకడం చదువుకు ప్రోత్సాహాన్నిస్తుంది. ఆదివాసులకు ఉద్యోగ రంగాలలో ఉన్న 6శాతం రిజర్వేషన్ వల్ల కొద్ది మందికి మాత్రమే ఉద్యోగాలు దొరకగలవు. ఉద్యోగాలే దొరకని చదువుల పట్ల ఏజెన్సీలోని ఆదివాసులకు పెద్దగా ఆసక్తి ఉండదు. కనీసం స్థానికంగా టీచర్ పోస్టులైనా దొరుకుతాయన్న నమ్మకం ప్రోత్సాహకరంగా పని చేస్తుంది. రాజ్యాంగం రాసుకున్నప్పుడు సామాజిక, ఆర్థిక న్యాయాన్ని దేశ లక్ష్యంగా ప్రకటించుకున్నాం. సామాజిక న్యాయం కావాలంటే ఇప్పటి దాకా అవకాశాలు నిరాకరించబడిన వారికి అవకాశాలు అందివ్వాలి. రిజర్వేషన్లు సక్రమ అమలు కోసం, విద్య, వైద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం, భూమి కోసం, ప్రకృతి వనరులపైన హక్కు కోసం పోరాటాలు చేయాలి. సంకుచిత ప్రయోజనాలను, పరిమితులను అధిగమించే దూరదృష్టికావాలి. విశాల దృక్పథం కావాలి. చట్టాలలో ఉన్న సంక్షేమం వాస్తవంలో అందకుండా చేయడానికి సమాజంలో చాలా ప్రయత్నాలు జరుగుతుంటాయి. ఆ సంక్షేమం పొందేవారికి నిర్ణయాధికారంలో భాగస్వామ్యం లేనంత కాలం ఇది సాగుతుంది. చివరగా విద్యా వ్యవస్థలోని స్థితిగతులు రిజర్వేషన్ కేటగిరికి చెందిన విద్యార్థులకు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు గౌరవ ప్రదంగా లేవు. తరగతి గదిలో పరిస్థితులు కూడా ఆ వర్గాల వారి అనుభవాలకు దూరంగా ఉంటాయి. ప్రతిష్ఠాత్మకమైన విశ్వవిద్యాలయాల్లో ప్రజాస్వామ్య వాతావరణం కొరవడింది. అందరినీ గౌరవించే సాంప్రదాయం, భిన్నత్వాన్ని గౌరవించే పరిస్థితులు, విలువలతో కూడిన ప్రతిభను గుర్తించే పద్ధతులు ఉన్నప్పుడే రిజర్వేషన్ల ప్రయోజనాలను పూర్తిగా ఉపయోగించుకోవడం సాధ్యమవుతుంది. దీనికి సమిష్టి కృషి అవసరం.

తెలంగాణ రాష్ట్రంలో మూడున్నర సంవత్సరాల పాలన ప్రజల్ని నిరాశపరిచింది. ప్రధాన వాగ్దానాలేవీ అమలు జరపలేకపోయింది. దళితులు, గిరిజనులు, వెనకబడిన తరగతులు, మైనార్టీలు, మహిళలు, కార్మికులు, పేదలు, రైతులు, ఈ ప్రభుత్వ పాలన పట్ల అసంతృప్తితో ఉన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే ప్రజల బతుకులు బాగుపడతాయనే ఆశ ఆవిరైపోయింది. అప్రజాస్వామిక, కుటుంబ పాలన ఆవిష్కృతమైంది. ప్రజాఉద్యమాలు నిర్దాక్షిణ్యంగా అణిచివేయబడుతున్నాయి. అవినీతి అన్నింటా రాజ్యమేలుతున్నది. సామాజిక న్యాయం సంగతే మర్చిపోయారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను కూడా టీఆర్ఎస్ ప్రభుత్వం అడుగడుగునా సమర్థిస్తున్నది. కొత్త తెలంగాణ రాష్ట్రంలో స్వచ్ఛ రాజకీయాల ద్వారా రాష్ట్ర సమగ్రాభివృద్ధిని కోరుకునే, అగ్రకుల పెత్తందారి ఆధిపత్యాన్ని అడ్డుకునే శక్తులను సమీకరించి " సామాజిక న్యాయం - తెలంగాణ సమగ్రాభివృద్ధి" ఎజెండాగా ఒక ప్రత్యామ్నాయ రాజకీయ వేదికను నిర్మించడం అవసరం. ఇందుకు కమ్యూనిస్టు పార్టీలు, బీజేపీ, కాంగ్రెస్సేతర లౌకికపక్షాలు, సామాజిక శక్తులు, సంఘాలు, అభ్యుదయ మేధావులు, ప్రముఖులు, రచయితలు, కవులు, కళాకారులు, సమస్త తెలంగాణ

చరిత్రను పరిశోధనలతో వెలికితీయాలి



మేకిరి దామోదర్

తెలంగాణ ప్రాంతంలోని ఓరుగల్లు రాజధానిగా పూర్వం కాకతీయులు పాలనకు నిదర్శనంగా అనేక కట్టడాలు, దేవాలయాలు, గొలుసుకట్టు చెరువులతోపాటు అనేక శాసనాలు నేటికీ చూస్తున్నాం. కాకతీయ రాజు ప్రతాపరుద్రుడి పాలన (12వ శతాబ్దం)లో నేటి కరీంనగర్ జిల్లా జగిత్యాల ప్రాంతంలోని పొలవాసను పాలించే గిరిజన దొర మేడరాజు ఏకైక కుమార్తె సమ్మక్కను ఆయన మేనల్లుడైన మేడారం పాలకుడు పగిడిద్ద రాజుకు ఇచ్చి వివాహం జరిపించినారు. వారికి సారలమ్మ, నాగలమ్మ, జంపన్న అనే ముగ్గురు సంతానంగా జన్మించారు.

మేడారాన్ని పాలించే కోయరాజు పగిడిద్ధరాజు కాకతీయుల సామంతునిగా ఉండేవాడు. కరువు రావడం మూలంగా పంటలు పండక గిరిజనుల పరిస్థితిని గమనించి పగిడిద్ధ రాజు కాకతీయ రాజులకు కప్పం కట్టలేక పోయాడు. కాకతీయ రాజు ప్రతాపరుద్రుడు పగిడిద్ద రాజుపై ఆగ్రహంతో మేడరాజుపై సైన్యంతో దండెత్తాడు. కాకలు తీరిన కాకతీయుల సైన్యాన్ని ముప్పుతిప్పలు పెట్టిన తీరును, వీరోచితంగా పోరాడిన సమ్మక్క గిరిజన మహిళా యుద్ధనైపుణ్యానికి శత్రువుల చేతిలో దెబ్బతిన్న సమ్మక్క రక్తపుదారలతోనే యుద్ధభూమి నుండి తప్పించుకుని దగ్గరలోని చిలుకలగుట్ట వైపు సాగిన సమ్మక్కను వెతుకుతూ వెళ్లిన తన అనుచరులకు జాడతెలియలేదు. అప్పటినుండి ప్రతి రెండేండ్లకు ఒకసారి మాఘశుద్ధ పౌర్ణమిరోజున సమ్మక్క జాతర అత్యంత భక్తిశ్రద్ధలతో జరుగుతోంది.

మేడారం ఓ ఆదివాసి గూడెం (పల్లె). ఇక్కడ వెయ్యిమందితో కూడిన మారుమూల అడవి ప్రాంతం. రెండేండ్లకోకసారి భక్తుల సందడితో నేల నలుచెరుగులా ఎటుచూసినా జనసముద్రమైపోతుంది. 20వ శతాబ్దం మధ్య కాలంనుండే భాగా ప్రాచుర్యంలోకి వచ్చింది. మొదట మేడారం జాతర బయ్యక్కపేట అనే కుగ్రామంలో జరిగేది. కాలక్రమంలో చందావంశీయుల మధ్య వివాదం రావడం వలన మేడారం పూజారులైన వడ్డెలు నిర్వహిస్తున్నారు. 1940 వరకు చిలకలగుట్టపైనే గిరిజనులు మాత్రమే జాతరను జరిపేవారు. 1946నుంచి జాతరను మేడారంలో నిర్వహించడం మొదలైంది. ఆ తర్వాత 1962 సం॥లో సమ్మక్క తల్లిని కీకారణ్యంలోని మేడారం గద్దెలపై ప్రతిష్ఠించారు. అక్కడి కోయ కుటుంబాలు, ఇతరులు కలిసి ఈ జాతరను నిర్వహిస్తున్నారు. 1968లో జాతర దేవాదాయ శాఖ పరిధిలోకి వచ్చింది. 1996లో ఈ జాతరను ఏపీ ప్రభుత్వం రాష్ట్ర పండుగగా గుర్తించింది. మన రాష్ట్రం నుండే కాకుండా పొరుగు రాష్ట్రాలైన మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒడిస్సా, చత్తీస్‌ఘడ్, ఝార్ఖండ్ రాష్ట్రాలనుండి లక్షలాది మంది భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకుంటారు. చిన్న జాతరగా ప్రారంభమై నేడు మహా జాతరగా ప్రవాస భారతీయులతోపాటు విదేశీయులు కూడా వస్తున్నారు. అధునాతన సామాజిక మాధ్యమాలు, ఇంటర్నెట్ ద్వారా విశ్వవ్యాప్తమై ఆసియాలోనే అతి పెద్ద గిరిజన జాతరగా, కుంభమేళాలా విరాజిల్లుతున్నది. కోట్లాది మంది భక్తులు మన్యం అడవి ప్రాంతానికి రావడం విశేషమైతే, ఒకేరోజు సుమారు కోటి మంది భక్తులు ఒకేచోట కలుసుకోవడమే కాకుండా, ప్రతిరోజూ భక్తుల సందర్శన కొనసాగుతూనే ఉంటుంది. అయినా ఇప్పటివరకు ఎలాంటి అవాంతరాలు లేకుండా అద్భుతంగా జరుగుతున్నది. కాలినడకన మొదలైన సమ్మక్క జాతర, ఎడ్లబండ్ల నుండి, హెలికాప్టర్‌లో వచ్చేసే స్థాయికి ఎదిగింది.

ప్రభుత్వం నిధులు ఖర్చుచేస్తూ భక్తులకు ఏర్పాట్లు చేస్తున్నది. ఆదివాసి గిరిజన మ్యూజియంను అందుబాటులోకి తెచ్చారు. రోడ్డు పనులు, లైటింగ్, నీరు, విద్యుత్ సౌకర్యాలు చేయడాన్ని చూస్తున్నాం. దీనికి జాతీయ గుర్తింపు ఇవ్వాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిది. సాధించాల్సిన ఆవశ్యకత రాష్ట్ర ప్రభుత్వంపై ఉంది. ఇది ఏ ఏటికి ఆ ఏడు వాయిదా పడుతూనే ఉంది. తక్షణం తెలంగాణ సంస్కృతి పరిరక్షణార్థం విశ్వవిద్యాలయ స్థాయిలో దీనిపై పరిశోధనలు, చరిత్రకారులచే ఆధారాలను సేకరించాల్సి ఉంది. విజ్ఞానమనే పేరుతో ఇది జానపదుల, గిరిజనుల, పుక్కిడి పురాణమని దీనికి వాస్తవికత లేదనే వాదనలు ఉన్నాయి. ఏది ఏమైనా కాకతీయ రాజులను మన్యం ప్రజల రక్షణార్థం ఒక మహిళ వీరోచితంగా పోరాడిన తీరును ఎందుకు వెలికితీయలేము? కాకతీయ రాజుల చరిత్రను ఇంకా పరిశోధిస్తున్న వారు.. దానికే ముడిపడి ఉన్న ఈ మన్యం గిరిజనుల వీరోచిత పోరాటం చరిత్ర పుటల్లోకి తేవాలి. రాజుల చరిత్రకు పట్టం కడుతూ, సామాన్యుల వీరగాథలను మరుగు పరచడం నేటి ప్రజాపాలనలో కూడా జరగడం మంచిది కాదు? కొన్ని వేల, వందల ఏండ్ల చరిత్ర ఆధారాలు వెలికితీ(యు)స్తున్న పాలకులు దీనిపై ఎందుకు దృష్టిపెట్టరు. నాడు పాలన మన చేతిలో లేదు. అని వలస వాదులు చరిత్రను వక్రీకరించారని నిందలువేశాం. నేడు పాలన మనది, కావున విశ్వవ్యాప్తమైన గిరిజన జాతర ఆధారాలను ముందు తరాలకు అందించాల్సిన బాధ్యత తమపై ఉందని మరువరాదు.

నిర్లక్ష్యానికి గురై ప్రతి పండుగను, ఆచార వ్యవహారాలను, మరుగున పడిన మన తరతరాల, చరిత్రలకు ఎన్ని నిధులు వెచ్చించైనా, సేకరించి భద్రపరచాలి. "సమ్మక్క జాతర" గతతరం వారు మనకు అందించిన ఈ వైభవాన్ని, ఇక్కడి ప్రజల సామాజిక దృక్పథాన్ని, మానవీయ కోణాన్ని, పోరాట పటిమను, గిరిజనుల సాహసాల తీరును, యుద్ధనైపుణ్యంలో ఒక గిరిజన మహిళ.. రాజరికాన్ని, రాజ్యాన్ని ధిక్కరించిన తీరును, ఎందుకు పరిశోధన చేయరు? తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో ఈ మట్టి గొప్పతనం, జనజాగృతి, పౌరుషం, ఆ పోరాట స్ఫూర్తితో, ఆత్మత్యాగాలే కదా! వారి త్యాగాల స్ఫూర్తితో ఏర్పడ్డ రాష్ట్రం, పాలన... రెట్టింపు స్ఫూర్తితో పరిరక్షిస్తూ, ప్రపంచ ఖ్యాతిలో ఈ ప్రాంత వైభవాన్ని పొందుపరచాల్సి ఉంది. కాకతీయ వారసత్వం గురించి ఇంకా ఒకవైపు పరిశోధనలు చేస్తున్నారు. బస్తరులోని "మహారాజా సాహెబ్ కమల్ చంద్రభంజోదేవ్ కాకతీయ" (కాకతీయ వంశం)వాడే అనే పరిశోధన జరుగుతున్నది. పరిశోధకులు వెళ్లివస్తున్నారు. చరిత్ర పరిశోధకులు, విద్యార్థులు, విశ్వవిద్యాలయాలు, పాలకులు సమ్మక్క విరోచిత పోరాటంపై దృష్టి సారించాల్సి ఉంది. పాలకులు దీనిని వెలికి తీయల్సిన బాధ్యతను మరువరాదు ? నాడు... నేడు సామాన్యుల చరిత్రకు అన్యాయం జరుగుతుందనే అపవాదు మోయరాదు? చిత్తశుద్ధితో ప్రయత్నిస్తే ఆధారాలు దొరకడం ఖాయం. మహామహులు జాతరకు వచ్చివెళ్తున్నా సకాలంలో నిధులు కేటాయించి, మేడారం ఉత్సవం పేరుతో గిరిజన కళల సంస్కృతి ప్రదర్శనలు చేయుటకు 68 లక్షలతో అంఫి థియేటర్ నిర్మించడం, ఆదివాసుల ఆహార అలవాట్లను ప్రదర్శనలో పెట్టడం జరిగింది. గిరిజనుల జీవన శైలి ఉట్టిపడేలా రెండు కోట్లతో ఏర్పాటు చేసిన మ్యూజియం, ఇందులో వారు వినియోగించే వస్తువులు వారి జీవన విధానం తెలియజెప్పే శిల్పాలను, సమ్మక్క జీవిత చరిత్ర ప్రతిబింబించేలా పుట్టుక, వివాహం, వనప్రవేశం తదితర శిల్పాలు జీవకళ ఉట్టిపడేలా ఉన్నాయి. జాతర పరిశోధన, జాతీయ హోదాలో ఇదే పట్టుదలతో ముందుకెళ్లాలని ఆశిస్తున్నారు. కాకతీయ రాజుల చరిత్రను పాఠశాల స్థాయి నుంచి విశ్వవిద్యాలయ స్థాయి వరకు పొందుపరిచినట్టే? సమ్మక్క, సారలమ్మ వీరగాథలను పాఠ్యాంశాలుగా పొందుపరచాలి. జాతర తదనంతరం ఇక్కడి రైతుల భూములు జనప్రభంజనం మూలంగా సరిహద్దులు చెరిగిపోయి, చెత్తాచెదారంతో గుట్టలుగా పేరుకపోయి కాలుష్యమయమౌతుంది. దాని మూలంగా దుర్గంధాన్ని భరించలేక స్థానిక గిరిజనులు అనారోగ్యం పాలు కావడం చూస్తుంటిమి. ఆ రైతులకు నష్టపరిహారం, ఆరోగ్యం, ఆ ప్రాంత పరిశుభ్రతపై పాలకులు జాతర ఈ ప్రాంతాన్ని శుభ్రపరచడంలో కూడా తగు శ్రద్ధ వహించి ఈ ప్రాంతానికి ఇక్కడి ప్రజలకు న్యాయం జరిగేలా చూడాలి. ఆదివాసి సంస్కృతికి విఘాతం కలగకుండా కార్పొరేట్ వ్యాపారీకరణ రూపుమాపాలి. ఈ ప్రాంతాన్ని జాతర వరకే పరిమితం కాకుండా అన్ని విధాల ఆ ప్రాంత ప్రజలు అభివృద్ధి చెందేలా దృష్టిపెట్టాలి. అడవి విధ్వంసాన్ని ఆపాలి.

సెల్: 9573666650

ఈ పేజీ మీ అందరిది

ఇక్కడ వ్యక్తమయ్యే అభిప్రాయాలు వ్యాసకర్తల వ్యక్తిగతం. నవతెలంగాణ అభిప్రాయాలు కానవసరం లేదు. 4000 క్యారెక్టర్ల లోపు ఉన్న వ్యాసాలకు ప్రాధాన్యత ఉంటుంది. ఎట్టి పరిస్థితుల్లోను 6000 క్యారెక్టర్లకు మించకుండా పంపించండి. వివిధ ప్రజాసమస్యలపై రాసిన వ్యాసాలకు ప్రాధాన్యత ఉంటుంది. వ్యాస రచయితలు వారి ఫొటో, సెల్‌నెంబర్ ఇవ్వాలి.

- ఎడిటర్

మీ రచనలు పంపవలసిన చిరునామా :

email: vedika@ navatelangana.com Postal Addres: M.H.Bhavan,plot No,21/1, Azamabad, Near RTC Kalayana mandapam,Hyderabad500020.
Ph:27665420,27673787,9490099077/78.
Fax:040-27652228

ప్రభుత్వ విద్యకు ఉజ్వల భవిత

- కాంట్రాక్టు లెక్చరర్ల సమస్యల పరిష్కారానికి కృషి : ఇంటర్ విద్యాజేఏసీ చైర్మెన్ పి మధుసూదన్‌రెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ప్రభుత్వ విద్యారంగానికి ఉజ్వల భవిత ఉందని ఇంటర్ విద్యాజేఏసీ చైర్మెన్ పి మధుసూదన్‌రెడ్డి చెప్పారు. ఆదివారం హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆర్జేడీ కాంట్రాక్టు లెక్చరర్ల సంఘం ఆధ్వర్యంలో ప్రగతిపథంలో ఇంటర్ విద్య - కాంట్రాక్టు లెక్చరర్ల పాత్ర అనే అంశంపై విద్యాసదస్సు జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ రంగంలో ఉన్న విశ్వవిద్యాలయాలు, డిగ్రీ కాలేజీలు, పాఠశాలలు అనేక సమస్యలతో సతమతమవుతున్నా ఇంటర్ విద్య మాత్రం ప్రగతి పథంలో ముందుకు సాగుతోందని చెప్పారు. కార్పొరేట్ కాలేజీలకు దీటుగా ప్రభుత్వ కాలేజీలు పనిచేస్తున్నాయని అన్నారు. 404 ప్రభుత్వ జూనియర్ కాలేజీలను బతికించడంలో కాంట్రాక్టు లెక్చరర్ల పాత్ర కీలకమని చెప్పారు. ప్రభుత్వ ఇంటర్ విద్యలో ఉచిత పాఠ్యపుస్తకాలు అందించడంతోపాటు కాంట్రాక్టు లెక్చరర్ల కృషి వల్ల ఎన్‌రోల్‌మెంట్ మొదటి సంవత్సరంలో 97 వేలకు పెరిగిందన్నారు. ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా కాంట్రాక్టు లెక్చరర్లను తొలగించి రెగ్యులర్ అధ్యాపకులను నియమించే అవకాశం లేదని చెప్పారు. జులై 1 నుంచి కాంట్రాక్టు లెక్చరర్ల వేతనం రూ.62 వేలకు పెరిగే అవకాశముందన్నారు. కాంట్రాక్టు లెక్చరర్ల సమస్యలు పరిష్కరించడానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వచ్చే బడ్జెట్ తర్వాత కాంట్రాక్టు లెక్చరర్లకు ప్రతినెలా జీతాలు వచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. 12 నెలల జీతం, డీఏ, హెచ్‌ఆర్‌ఏ, ప్రసూతి సెలవులు వంటి అంశాలు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయని చెప్పారు. భవిష్యత్తులో అవి నెరవేరుతాయని అన్నారు. ఆర్జేడీ కాంట్రాక్టు లెక్చరర్ల సంఘం అధ్యక్షుడు గాదె వెంకన్న అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి వై కుమారస్వామి, గోవర్ధన్, రాజు, మునిస్వామి, రెగ్యులర్ అధ్యాపకుడు వేల్పుల అయిలయ్య, వివిధ సంఘాల నాయకులు కడారి శ్రీనివాస్, మాలతి, రాజశేఖర్, అబ్దుల్లా సోహైల్ తదితరులు పాల్గొన్నారు.

రూ.3 కోట్ల పంచలోహ విగ్రహాలు స్వాధీనం

- పోలీసుల అదుపులో అంతర్రాష్ట్ర ముఠా



నవతెలంగాణ - సిటీబ్యూరో


కామారెడ్డి వేణుగోపాలస్వామి ఆలయంలో గతేడాది అపహరణకు గురైన 3కోట్ల విలువ చేసే 600 ఏండ్ల నాటి మూడు పంచలోహ విగ్రహాలు దొరికాయి. వీటిని దొంగిలించి విక్రయిస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను ఆదివారం పోలీసులు పట్టుకున్నారు. హైదరాబాద్ నార్త్ జోన్ టాస్క్‌ఫోర్స్ టీం, కామారెడ్డి పట్టణ పోలీసుల సంయుక్త ఆపరేషన్‌లో కర్నాటకకు చెందిన ఇద్దరు దొంగలను అరెస్టు చేసి విగ్రహాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనరేట్‌లో నగర పోలీసు కమిషనర్ వీవీ శ్రీనివాసరావు విలేకర్లతో మాట్లాడుతూ... కర్నాటక రాష్ట్రం బీదర్ జిల్లా భల్కీ తాలుకాలోని కత్తితుగవ్‌కు చెందిన షేక్ హైదర్, భల్లీలెకు చెందిన షేక్ అజీజ్ నగరంలోని కొత్తపేట ఫ్రూట్ మార్కెట్‌లో కూలీ పని చేస్తున్నారు. దీంతోపాటు బస్సు లేదా ట్యాక్సీల్లో ప్రయాణిస్తూ పంచలోహ విగ్రహాలు ఎక్కడెక్కడ ఉన్నాయో ముందుగా గుర్తిస్తారు. ఆలయ తాళాన్ని, గ్రిల్స్‌ను పగులగొట్టి విగ్రహాలను దొంగిలిస్తారు. ఆ సమయంలో ఏదైనా అనుమానం వచ్చినట్టయితే దొంగిలించిన విగ్రహాలను అదే స్థానంలో ఉంచుతారు. కామారెడ్డి వేణుగోపాలస్వామి దేవాలయంలో 2017 జనవరి 27న సుమారు రూ.3 కోట్ల వేణుగోపాలస్వామి, రుక్మిణీ, సత్యభామ దేవతా విగ్రహాలు అపహరణకు గురయ్యారు. కామారెడ్డి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. కేసు విచారణలో భాగంగా నగర పోలీసులతో కలిసి కామారెడ్డి పోలీసులు ప్రత్యేక నిఘా వేయగా, దొంగలు ఆదివారం ఉదయం పట్టుబడ్డారు. ఈ నిందితులపై కామారెడ్డితో పాటు మహారాష్ట్ర ఔరంగబాద్ డివిజన్ హింగోళి పీఎస్ పరిధి జైన్ మందిర్‌లోని ఏడున్నర కేజీల మహావీర్ (24వ జైన్ తీర్థంకారుడు) పంచలోహ విగ్రహం, మహారాష్ట్ర లాతూర్ జిల్లా కిల్లరి పీఎస్ పరిధిలో కేదర్లింగ్ టెంపుల్‌లో పంచలోహ విగ్రహాలను దొంగిలించిన కేసులున్నాయి. గతంలో షేక్ హైదర్‌పై కర్నాటక రాష్ట్రంలో మూడు వేర్వేరు పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. స్వాధీనం చేసుకున్న విగ్రహాలను సీజ్ చేసి, నిందితులను కామారెడ్డి పోలీసులకు అప్పగించారు. ఈ ముఠాను పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ వింగ్ డిప్యూటీ కమిషనర్ పి.రాధాకిషన్‌రావు, నార్త్ జోన్ టాస్క్‌ఫోర్స్ సీఐ కె.నాగేశ్వర్‌రావు, ఎస్‌ఐలు బి.శ్రవణ్‌కుమార్, పి.చంద్రశేఖర్‌రెడ్డి, కెవెస్ రవి, కె.శ్రీకాంత్, సిబ్బందిని కమిషనర్ అభినందించారు.

ఢిల్లీ ఫోన్..మారిన సీన్

బీజేపీతో కుస్తీకి సిద్ధమన్న టీడీపీ

- రాజ్‌నాథ్ బుజ్జగింపుతో మెత్తబడ్డ చంద్రబాబు
- ప్రస్తుతానికి కేంద్రంతో చర్చలకే పరిమితం





అమరావతి : కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై తాడోపేడో తేల్చుకుంటాం అన్నట్లుగా ఆదివారం టీడీపీ పార్లమెంటరీ సమావేశంలో చర్చ జరిగింది. బీజేపీతో తెగతెంపులు చేసుకోవాలని కొందరు ఎంపీలు అంటే, ముందుగా కేంద్ర మంత్రి పదువులకు రాజీనామా చేయాలని మరికొందరు ఎంపీలు సూచించారు. చంద్రబాబు సైతం నాలుగు బడ్జెట్ల తర్వాత కూడా ఓపిక పట్టాలా అని ప్రశ్నించారు. ఎంపీలందరూ పార్లమెంట్‌లో పోరడాలని, అవసరమైతే సస్పెండ్ అయినా పర్వాలేదని దిశా నిర్దేశం చేశారు. ఇంతలో సమావేశం చివరి నిమిషంలో ఢిల్లీ నుంచి హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఫోన్ చేశారు. తొందరపడి ఏ నిర్ణయం తీసుకోవద్దని బుజ్జగించారు. మీ ఆందోళనను అర్థం చేసుకున్నామని, అమిత్ షా త్వరలో అన్ని విషయాలు మాట్లాడతారని రాజనాథ్ చెప్పడంతో చంద్రబాబు చల్లబడిపోయారు. పార్లమెంట్‌లో పోరటానికి స్వస్తి చెప్పారు. ఆగ్రహంతో ఉన్న తమ ఎంపీలను సముదాయించారు. కేంద్రంతో గొడవలు పెట్టుకోవద్దన్నారు. ముందుగా సాయంపై కేంద్ర ప్రభుత్వ పెద్దలతో చర్చలు జరుపుదామన్నారు. అంతవరకు బయట మాత్రమేకాక పార్లమెంట్‌లోనూ ఎటువంటి నిరసనలు వద్దన్నారు. ఇదిలా ఉండగా రాష్ట్ర బీజేపీ నేతలు కూడా టీడీపీతో మాటల యుద్దానికి దిగారు. బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ రాష్ట్రంలో రూలింగ్ కాదు ట్రేడింగ్ జరుగుతుందన్నారు. చంద్రబాబు నియోజకవర్గం లో పది కోట్ల రూపాయల కుంభకోణం జరిగిందన్నారు.

పార్లమెంటరీ పార్టీ సమావేశంలో...

తెలుగుదేశం పార్టీ పార్లమెంటరీ సమావేశం ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో ఆదివారంజరిగింది. కేంద్రం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై రెండు రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా ఉత్కంఠ నెలకొన్న నేపథ్యంలో ఈ భేటీకి ప్రాధాన్యత సంతరించుకుంది.

బడ్జెట్ సమావేశాల్లోనే

పంచాయతీరాజ్ బిల్లు : సీఎం కేసీఆర్

- హైదరాబాద్ పరిసర ప్రాంతాలను పరిరక్షించుకుందాం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఈ బడ్జెట్ సమావేశాల్లోనే పంచాయతీరాజ్ చట్టం బిల్లును ప్రవేశపెడతామని ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు తెలిపారు. చట్టం ముసాయిదా బిల్లు పురోగతి, కొత్త గ్రామ, నగర పంచాయతీల ఏర్పాట్లపై ఆదివారం ప్రగతిభవన్‌లో సంబంధిత శాఖాధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ పంచాయతీలకు జనాభా ప్రాతిపదికన రూ.5లక్షల నుంచి రూ.30 లక్షల వరకు నిధులు కేటాయించేలా బడ్జెట్‌లో పొందు పర్చాలని ఆర్థిక శాఖ అధికారులను ఆదేశించారు. గ్రామ పంచాయతీలకు నేరుగా నిధులు, ఫైనాన్స్ కమిషన్ నిధులు, రాష్ట్ర బడ్జెట్ నిధులు, ఆస్తి పన్ను వసూల ద్వారా వచ్చే నిధుల గురించి వివరాలు సేకరించి విధి విధానాలను రూపొందించాలన్నారు.

కొత్తగా ఏర్పాటు కాబోతున్న పంచాయతీలకు ఫైనాన్స్ కమిషన్ నిధులు ఏ విధంగా పొందవచ్చో అధ్యయనం చేయాలని పంచాయతీరాజ్ కమిషనర్‌కు సీఎం సూచించారు. అదేవిధంగా మార్చి 11న రాష్ట్ర వ్యాప్తంగా పట్టాదారు పాస్ పుస్తకాలు అందజేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. పాస్ పుస్తకాల ముద్రణ పురోగతి, ధరణి వెబ్‌సైట్ ఏర్పాటు, రెవెన్యూ, ఐటీ అధికారులతో సీఎం సమీక్షించారు. పాస్ పుస్తకాల ముద్రణ అనుకున్న సమయంలో పూర్తి చేయాలని అదేశించారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్

సేవ్ హైదరాబాద్

సేవ్ హైదరాబాద్‌లో భాగంగా హైదరాబాద్ నగరాన్ని పర్యావరణ పరంగా పరిరక్షించుకోవాలని సీఎం కేసీఆర్ అధికారులకు సూచించారు. భౌగోళికంగా విస్తరిస్తున్న హైదరాబాద్ పరిసర ప్రాంతాలను సంరక్షించుకోవాలన్నారు. నగరం చుట్టూ 50, 60 కిలో మీటర్ల రేడియస్ పరిధిలో సుమారు లక్షన్నర ఎకరాలకు పైగా అటవీ భూమి ఉందనీ, దాన్ని కాపాడుకుంటూ ఆరోగ్యకరమైన గాలి పీల్చుకునేలా ఫారెస్ట్ బ్లాక్స్‌ను అభివృద్ధి పర్చాలని తెలిపారు. మూసీ రివర్ ఫ్రంట్, హైదరాబాద్ అర్బన్ ఫారెస్ట్రీని ప్రత్యేకంగా అభివృద్ధి చేయాలని ఆదేశించారు.

అటవీ ప్రాంతాల అభివృద్ధి కోసం ఏం చేయాలో అధ్యయనం చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కె జోషీ, ప్రభుత్వ సలహాదారు రాజీవ్ శర్మ, మున్సిపల్, అటవీ శాఖ మంత్రులు కేటీఆర్, జోగు రామన్న, సీఎంఓ ముఖ్య కార్యదర్శి నర్సింగ్‌రావులను ఆదేశించారు.

అవినీతి జలగ పురుషోత్తంరెడ్డి కోసం వేట..

- ఇద్దరు అధికార పార్టీ ఎమ్మెల్యేలతో ఏసీబీ వాకబు

నవ తెలంగాణ, ప్రత్యేక ప్రతినిధి

అవినీతి,అక్రమాలకు పాల్పడి కోట్ల రూపాయల ఆస్తులను కూడబెట్టి తప్పించుకుని తిరుగుతున్న హెచ్‌ఎండీఏ హైదరాబాద్ ప్లానింగ్ డైరెక్టర్ కె.పురుషోత్తంరెడ్డి కోసం ఇద్దరు అధికార పార్టీ ఎమ్మెల్యేలతో ఏసీబీ అధికారులు వాకబు చేసినట్టు విశ్వసనీయంగా తెలిసింది. రెండు రోజుల క్రితం పురుషోత్తంరెడ్డి ఆస్తులపై మెరుపు దాడులు నిర్వహించిన ఏసీబీ అధికారులు మొత్తం రూ.25 కోట్లకు పైగా ఆదాయానికి మించి ఆస్తులను కలిగి ఉన్నట్టు కనుగొన్న విషయం తెలిసిందే. ఆ రోజు నుంచి కనిపించకుండా పోయిన పురుషోత్తంరెడ్డి కోసం ఏసీబీ అధికారులు తమ వేట ముమ్మరం చేశారు. కాగా ఇద్దరు అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు పురుషోత్తంరెడ్డికి షెల్టర్ ఇచ్చి రహస్య ప్రదేశంలో అతన్ని ఉంచారని వచ్చిన సమాచారంపై ఏసీబీ అధికారులు సీరియస్‌గా దృష్టిని సారించారని తెలిసింది.

పోరాట కేంద్రాలుగా యూనివర్సిటీలు

డీఎస్‌యూ పోస్టర్ ఆవిష్కరణలో వరవరరావు

నవతెలంగాణ - సిటీబ్యూరో

కేంద్రంలో మోడీ అధికారంలోకి వచ్చాక యూనివర్సిటీలు పోరాట కేంద్రాలుగా మారాయని, ఊనా, భీమా కోరెగావ్, దళిత, ఆదివాసీ, వివక్షతకు సంబంధించిన అన్ని రకాల అస్థిత్వ ఉద్యమాలకు విద్యార్థులు, యువకులే నాయకత్వం వహించారని విరసం నేత వరవరరావు అన్నారు. హైదరాబాద్‌లోని హైదర్‌గూడ ఎన్‌ఎస్‌ఎస్‌లో డెమొక్రటిక్ స్టూడెంట్స్ యూనియన్ (డీఎస్‌యూ) రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను ఆదివారం వరవరరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచీకరణ, సామ్రాజ్యవాదానికి సేవలు చేస్తున్న కొత్త బ్రాహ్మణవాద విధానాలు ఇక్కడ చెల్లవని, అన్ని రకాల ఆధిపత్య భావజాలానికి వ్యతిరేకంగా విద్యార్థులు, యువకులు తమ పోరాట రూపాలను విస్తరించాలని సూచించారు. సామ్రాజ్యవాద, బ్రాహ్మణీయ ఫాసిజానికి వ్యతిరేకంగా ఏకం కావాలన్నారు. టీపీఎఫ్ ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ అన్వర్‌పాషా మాట్లాడుతూ.. సమాజంలో నానాటికీ ప్రజాస్వామ్య విలువలు పడిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో మనిషి తోటి మనిషిపై ఆధిపత్యం చేసే విధానానికి వ్యతిరేకంగా ప్రతిఒక్కరూ గళమెత్తాలన్నారు. డీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు కంచర్ల బద్రీ, ప్రధాన కార్యదర్శి అరుణాంక్ మాట్లాడుతూ.. ఈ నెల 8, 9 తేదీల్లో వరంగల్‌లో జరిగే మహాసభలను హెచ్‌సీయూ ప్రొ.కె.లక్ష్మీనారాయణ ప్రారంభిస్తారన్నారు. "విద్యార్థి ఉద్యమాలు- విద్యా రంగంలో వచ్చిన మార్పులు, శాస్త్రీయ సామ్యవాదం, అధికార మార్పిడి.. అనంతర ఇండియా - సమాజంలో వచ్చిన మార్పులు" అంశాలపై ప్రసంగాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాకళామండలి నాయకులు జాన్, టీవీఎస్ రాష్ట్ర అధ్యక్షులు కోట శ్రీనివాస్, పీడీఎస్‌యూ (విజృంభణ) నాయకులు ఆనందరావు, డీఎస్‌యూ, టీవీఎస్ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వరవరరావు

బియ్యం అక్రమ వ్యాపారీపై పీడీ కేసు

- పౌరసరఫరాల శాఖ కమిషనర్ సీవీ ఆనంద్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రేషన్ బియ్యం అక్రమ రవాణాపై పౌరసరఫరాల శాఖ కమిషనర్ సీవీ ఆనంద్ ఉక్కుపాదం మోపుతున్నారు. ఆ శాఖకు సంబంధించిన ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ బృందాలు రేషన్ బియ్యం అక్రమ రవాణాదారుల కదలికపై నిఘా ఉంచారు. ఇప్పటికే ఈ బందాల దాడులతో ముగ్గురిపై పీడీ కేసులు, పలువురు అక్రమ వ్యాపారులపై 6ఎ, క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. తాజాగా సబ్సిడీ బియ్యాన్ని పక్కదారి పట్టించిన నల్గొండ జిల్లా మిర్యాలగూడలోని శాంతినగర్‌కు చెందిన రావిరాల రామలింగం (42) పై ఆదివారం పీడీ కేసు నమోదైంది. మిర్యాలగూడ కేంద్రంగా కొన్నేండ్లుగా పీడీఎస్ బియ్యాన్ని సేకరించి రామలింగం అక్రమంగా రవాణాకు పాల్పడుతున్నారు.

రేషన్ బియ్యం అక్రమ రవాణాకు సంబం ధించి ఆయనపై 10.2.2016న మొదటిసారి కేసు నమోదైంది. అప్పటి నుండి ఇప్పటి వరకు బియ్యం అక్రమ రవాణాకు రామలింగంపై 6ఏ కేసులు 9, క్రిమినల్ కేసులు 6 నమోదయ్యాయి. (2016లో ఫిబ్రవరి 10, 22న, మే 11, 25న, సెప్టెంబర్ 13, 14న, 2017లో ఫిబ్రవరి 18న, మే 19, 22న మొత్తం తొమ్మిది కేసులు). అయినా కూడా రేషన్ బియ్యం అక్రమ రవాణాకు కొనసాగిస్తూనే ఉండటం గమనార్హం. త్వరలో మరిన్ని కేసులు నమోదు చేస్తామని పౌరసరఫరాల కమిషనర్ సీవీ ఆనంద్ ఒక ప్రకటనలో తెలిపారు.

పర్మినెంట్ ఉత్తర్వులివ్వకుంటే ఆమరణ దీక్ష

గురుకుల కాంట్రాక్టు టీచర్ల ప్రకటన

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

రాష్ట్రంలోని ఎస్సీ గురుకులాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు టీచర్లందరినీ పర్మినెంట్ చేయాలనీ గురుకుల కాంట్రాక్టు టీచర్ల సంఘం ప్రభుత్వాన్ని కోరింది. ఐదురోజుల్లో లిఖితపూర్వక ఆదేశాలు ఇవ్వకుంటే ఆమరణ దీక్ష చేస్తామని హెచ్చరించింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎండీ అనీషా, సుబ్బలక్ష్మి, ఉపాధ్యక్షులు శ్రీవిష్ణు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. 11 ఏండ్లుగా పనిచేస్తున్న తమను కాదనీ, కొత్తవారితో ఈ పోస్టులను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ ఇవ్వడం సరికాదని తెలిపారు. గతేడాది నవంబర్‌లో 16రోజులు ఆందోళన చేస్తే..మంత్రి జగదీశ్వర్‌రెడ్డి, ఇతర అధికారులు పర్మినెంట్ చేస్తామని హామీనిచ్చారని గుర్తుచేశారు. గతంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు.

నేడు మావోయిస్టుల బంద్‌కు పిలుపు

నవ తెలంగాణ, ప్రత్యేక ప్రతినిధి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక పాలనకు పాల్పడుతున్నాయని ఆరోపిస్తు మావోయిస్టులు సోమవారం రాష్ట్రంతో పాటు దండకారణ్యం బంద్‌కు పిలుపు నివ్వడంతో పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. రాష్ట్రంలోని నక్సల్స్ ప్రభావిత ప్రాంతాలతో పాటు ఇతర కీలక ప్రాంతాలలో భారీ ఎత్తున సాయుధ పోలీసులతో బందోబస్తును ఏర్పాటు చేస్తూ డీజీపీ ఎం.మహేందర్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా ఛత్తీస్‌గఢ్‌ను ఆనుకుని ఉన్న రాష్ట్ర జిల్లాలతో పాటు ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు గస్తీని విస్తృతం చేశారు.

ఆ ప్రాంతాలకు చెందిన ఎస్పీలు, నగర కమిషనర్‌లతో మాట్లాడిన డీజీపీ ముందు జాగ్రత్త చర్యలను తీసుకోవాలని ఆదేశించారు. కేంద్రంలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం, రాష్ట్రంలోని టీఆర్‌ఎస్ ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక పాలన సాగిస్తున్నాయని, ఆపరేషన్ గ్రీన్ హంట్ 3 సమాధాన్ ప్రహార్ పేరిట మావోయిస్టులను అణచివేయడానికి కేంద్ర ప్రభుత్వం అనేక కుట్రలకు పాల్పడుతున్నదని దీనికి వ్యతిరేకంగా తెలంగాణతో పాటు దండకారణ్యం బంద్ పాటిస్తున్నామని రెండు రోజుల క్రితం మావోయిస్టు తెలంగాణ రాష్ట్ర కమిటీ అధికార ప్రతినిధి జగన్, దండకారణ్యం స్పెసల్ జోనల్ కమిటీ అధికార ప్రతినిధి వికల్పలు ఒక ప్రకటనలో తెలిపిన విషయం తెలిసిందే.

కమర్షియల్‌కు 'డొమెస్టిక్'

సిలిండర్లను బ్లాకులో విక్రయిస్తున్న ఏజెన్సీలు

- అధికారులకు తెలిసినా పట్టించుకోని వైనం
- నష్టపోతున్న వినియోగదారులు




(ఫైల్)

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఇటీవల రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్‌లో ఓ గృహిణి ఆన్‌లైన్‌లో సిలిండర్‌ను బుక్ చేసేందుకు యత్నించింది. ఎంతగా ప్రయత్నించినా సఫలం కాలేదు. విషయాన్ని సదరు ఏజెన్సీ దృష్టికి తీసుకెళ్లగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. 'మీరు జనవరి నెల 9 సిలిండర్ బుక్ చేశారు. 16న డెలివరీ చేశాం' అని నిర్వాహకులు చెప్పడంతో ఆ మహిళా నివ్వెరపోయింది. తీసుకోలేదని ఎంత చెప్పిన వారు పట్టించుకోలేదు. దీంతో చేసేదిలేక వేరే వాళ్ల సహకారంతో ఇంకో పేరుతో మరో సిలిండర్ తీసుకోక తప్పలేదు. ఇలాంటి ఘటనలు రాష్ట్రంలో నిత్యం ఎక్కడోచోట జరుగుతూనే ఉన్నాయి. ఫిర్యాదులు అందుతున్నా వాటికి అడ్డుకట్ట పడడం లేదు.

గృహాలకు వినియోగించాల్సిన వాటిని కొన్ని ఏజెన్సీలు వాణిజ్య అవసరాలకు విక్రయిస్తున్నాయి. నగరం, పట్టణం చుట్టు పక్కల గ్రామాల్లో నెలనెలా బుకింగ్ చేసుకోకపోవడం వంటి పరిణామాలు ఏజెన్సీలకు కలిసివస్తున్నది. వినియోగదారులకు తెలియకుండానే వాటిని ఆయా ఏజెన్సీలు పక్కదారి పట్టించి బ్లాకులో సొమ్ము చేసుకుంటున్నాయనే విమర్శలు ఎప్పటి నుంచో ఉన్నాయి. ఫోన్ నెంబర్ ఆధారంగా ఆన్‌లైన్ ప్రక్రియ జరుగుతుంది. ప్రతి వినియోగదారుడు ఏడాదికి 12 సిలిండర్లు పొందే అవకాశం ఉంది. ఎవరైతే ఈ సదుపాయాన్ని పూర్తిస్థాయిలో వినియోగించరో అలాంటి వారి పేరుపై వారికే తెలియకుండా ఆన్‌లైన్‌లో బుక్ చేసి బ్లాక్‌మార్కెట్‌కు తరలిస్తున్నారు. సబ్సిడీ గ్యాస్ దుర్వినియోగం కాకుండా ఉండేందుకు ప్రభుత్వం మూడేండ్ల క్రితం ఆధార్ కార్డును అనుసంధానం చేసింది. అలాగే, ఒక్కో కనెక్షన్‌కు ఏడాదికి 12 చొప్పున సబ్సిడీ సిలిండర్లను పరిమితం చేసింది. రాష్ట్రంలోని 1,186 (హెచ్‌పీసీ-402, ఐఓసీ-502, బీపీసీ-282) ఏజెన్సీలు సిలిండర్లను సరఫరా చేస్తున్నాయి. ఇండెన్‌కు 35.28 లక్షలు, భారత్ 29.50 లక్షలు, హెచ్‌పీ గ్యాస్‌కు 20.74 లక్షల చొప్పున మొత్తం 85.52 లక్షల కనెక్షన్లు ఉన్నాయి. ప్రధాని 'గివ్ ఇట్ అప్' పిలుపునకు రాష్ట్రంలో 3.85 లక్షల కనెక్షన్‌దారులు సబ్సిడీని ఉపసంహరించుకోగా ప్రస్తుతం 81.67 సబ్సిడీ కనెక్షన్లు ఉన్నాయి. వీటితోపాటు మరో 44.79 లక్షల మంది మహిళా గ్రూప్ సభ్యులు దీపం పథకం కింద సబ్సిడీ కనెక్షన్ పొందారు. ఆరోగ్య సమస్యలను సాకుగా చూపిస్తూ కిరోసిన్ రద్దు చేసి ఈ సంఖ్యను మరింత పెంచేందుకు కేంద్రం యత్నిస్తున్నది. అయితే, పేదలు, శ్రామికులు నెలకు సిలిండర్‌పై ఇంత మొత్తం ఒకేసారి వెచ్చించలేకపోతున్నారు. దీంతో గ్రామాల్లో చాలా వరకు సబ్సిడీ గ్యాస్ మిగిలిపోతుండటంతో ఏజెన్సీలకు వరంగా మారింది. వ్యాపార అవసరాలకు ఉపయోగించే వారికి ఇలాంటి సిలిండర్లను ఒక్కింటిపై రూ.200 నుంచి రూ.300 వరకు అదనంగా తీసుకుని సరఫరా చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఇదే విషయమై దిల్‌సుక్‌నగర్‌లోని ఓ ఏజెన్సీని సంప్రదించగా ఆయిల్ కంపెనీలు పంపిణీ చేసిన సిలిండర్లను తాము సరఫరా చేస్తున్నామని చెప్పారు. సిలిండర్ల బ్లాక్‌మార్కెట్‌పై పౌరసరఫరాల డిప్యూటీ కమిషనర్ చంద్రప్రకాశ్‌ను వివరణ కోరగా దీనిపై స్టాండింగ్ కంట్రోల్ ఆర్డర్ ఉంది. దీని ప్రకారం జాయింట్ కలెక్టర్, డీసీఎస్ఓ అధికారుల నేతృత్వంలో ఫిర్యాదులు వచ్చిన వెంటనే ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులు చేస్తున్నామని చెప్పారు.



ఒకప్పటితో పోలిస్తే హీరోల సినిమాలకు దీటుగా ఇప్పుడు మహిళా ప్రధాన చిత్రాలు సైతం విశేష ప్రేక్షకాదరణ పొందుతున్నాయి. బాక్సాఫీస్ కలెక్షన్లను కొల్లగొడుతూ మరిన్ని మహిళా నేపథ్య చిత్రాల రూపకల్పనకు నాంది పలుకుతున్నాయి. భిన్న బ్యాక్‌డ్రాప్స్‌తో తెరకెక్కి ప్రేక్షకుల్ని మెస్మరైజ్ చేసిన కొన్ని మహిళా ప్రధాన చిత్రాల గురించి ఈ వారం అందిస్తున్న స్పెషల్ షో..

షో

వండర్ ఉమెన్

ప్రిన్సెస్ డయానా అమెజాన్ రాజ్యానికి యువరాణి. యుద్ధ విద్యలు, కత్తిసాముల్లో ఆరితేరుతుంది. ఓ విమానం తన రాజ్యంలో కూలిపోవడంతో ఇతర ప్రపంచం వల్ల తమ రాజ్యానికి ప్రమాదం పొంచి ఉందని తెలుసుకుంటుంది. దీంతో అక్కడికి వెళ్ళి మనుషులతో యుద్ధం చేస్తుంటుంది. ఈ క్రమంలో తనలో దాగి ఉన్న అద్భుతమైన శక్తులను పొందగలిగి తన అసలైన కర్తవ్యం వేరే ఉందని తెలుసుకుంటుంది. మరి ఆమె తెలుసుకున్న నిజాలేంటి?, తన పోరాటం ఎవరిపై సాగిందనేది సినిమా కథాంశం. ఈ అమెరికన్ సూపర్ హీరో చిత్రానికి లేడీ డైరెక్టర్ ప్యాట్టీ జెంకిన్స్ దర్శకత్వం వహించడం విశేషం. ప్రిన్సెస్ డయానా పాత్రలో గాల్ గడోట్ తనదైన నటనతో మంత్రముగ్దుల్ని చేసింది. గతేడాది విడుదలైన ఈ సినిమా సంచలన విజయంతోపాటు రికార్డు కలెక్షన్లను సాధించింది. అలాగే ఆస్కార్ బరిలోనూ నిలిచింది.

లేడీ బర్డ్..

17ఏండ్ల టీనేజ్ అమ్మాయి లేడీ బర్డ్‌కు, తన తల్లికి మధ్య ఉన్న అనుబంధాన్ని, వారి భావోద్వేగాలను తెలిపే చిత్రమిది. ఓ కేథలిక్ హై స్కూల్‌లో చేరిన లేడీ బర్డ్‌లో మానసికంగా, శారీరకంగా, కుటుంబ పరంగా, స్నేహితుల విషయంలో వచ్చిన మార్పు ఏంటి?, ఆ తర్వాత ఆమె ప్రవర్తన ఎలా ఉందనేది చిత్ర కథాంశం. వయసు పెరిగే కొద్ది టీనేజ్ అమ్మాయిలో వచ్చే మార్పులను ప్రతిబింబించే ఈ కామెడీ డ్రామా చిత్రానికి గ్రెటా గెర్విగ్ అనే లేడీ డైరెక్టర్ దర్శకత్వం వహించారు. గతేడాది విడుదలైన ఈ సినిమా భారీ కలెక్షన్లను రాబట్టడంతోపాటు విమర్శకుల ప్రశంసలనూ సొంతం చేసుకుంది. అంతేకాదు ఈ ఏడాది ఆస్కార్ బరిలో ఐదు విభాగాల్లో గట్టి పోటీ ఇస్తోంది. లేడీ బర్డ్ పాత్రలో సోయిర్స్ రోనన్ నటన ఆద్యంతం ప్రేక్షకులను మంత్రముగ్దులను చేస్తుంది.

ది లయోవర్

విభిన్న నేపథ్యాలు కలిగిన ఇద్దరి స్నేహితుల జీవితాన్ని తెలిపే చిత్రమిది. కేట్.. హైస్కూల్ ఇంగ్లీష్ టీచర్, మెగ్.. కాస్మోటిక్ సేల్స్ ఉమెన్. ఇద్దరు ఒంటరి జీవితాన్ని గడుపుతూ బోర్‌గా ఫీలవుతారు. దీంతో ఓ రోజు లాంగ్ జర్నీకి ప్లాన్ చేస్తారు. ఫ్లైట్‌లో వీరికి ఓ అందమైన వ్యక్తి పరిచయమవుతాడు. ఈ ఇద్దరూ అతని ప్రేమలో పడతారు. అన్ని వదిలేసి అతనితో కలిసి ఎంజాయ్ చేస్తుంటారు. చివరికి అతని కోసం గొడవకూ దిగుతారు. అనంతరం చోటు చేసుకున్న ఆసక్తికర పరిణామాల సమాహారమే సినిమా. రోడ్ ట్రిప్ రొమాంటిక్ కామెడీ చిత్రాన్ని విలియమ్ హెచ్ మాసి రూపొందించారు. గతేడాది విడుదలైన ఈ చిత్రంలో కేట్ పాత్రలో అలెగ్జాండ్రా డాడీరియో, మెగ్ పాత్రలో కేట్ అప్టన్ తమ అందం, అభినయంతో ప్రేక్షకుల్ని అలరించారు.

ఐ, టోన్యా

అమెరికన్ స్కేటర్ ఛాంపియన్ టోన్యా హార్డింగ్ జీవితాన్ని తెలిపే చిత్రమిది. స్కేటింగ్ సంచలనం టోన్యా ప్రపంచ స్కేటింగ్ ఛాంపియన్ షిప్‌గా నిలుస్తుంది. ఆమెకు దక్కుతున్న గౌరవం, వస్తున్న పాపులారిటీని తట్టుకోలేని మాజీ భర్త ఆమెను ఓ భారీ కుంభకోణంలో ఇరికించే ప్రయత్నం చేస్తాడు. దీంతో కెరీర్ పరంగా చీకటి రోజులను చూసిన ఆమె వాటిన్నింటిని ఎదుర్కొని, తన పూర్వవైభవాన్ని పొందడంతోపాటు తిరుగులేని ఛాంపియన్‌గా నిలించేందుకు చేసే పోరాటమే ఈ చిత్ర కథ. బయోగ్రాఫికల్ డ్రామా చిత్రాన్ని క్రెగ్ గిల్లెస్పీ రూపొందించారు. గతేడాది విడుదలైన ఈ సినిమా భారీ కలెక్షన్లను సాధించింది. ఉత్తమ నటి, ఉత్తమ సహాయనటి, ఎడిటింగ్ విభాగాల్లో ప్రస్తుతం ఆస్కార్ బరిలో నిలిచింది. ఇందులో టోన్యా పాత్రలో మార్గోట్ రాబీ నటన కట్టిపడేస్తుంది.

బ్యాటిల్ ఆఫ్ ది సక్సెస్

1973లో జరిగిన ప్రపంచ టెన్నిస్ ఛాంపియన్‌షిప్ ప్రధానంగా రూపొందిన చిత్రమిది. వరల్డ్ నెంబర్ వన్ టెన్నిస్ స్టార్ బిల్లీ జీన్ కింగ్, మాజీ ఛాంపియన్ బాబీ రిగ్స్‌కు మధ్య ఈ పోటీ జరుగుతుంది. అత్యంత ప్రతిష్టాత్మకమైన ఈ పోటీలో ఎవరు గెలిచారన్నది ఆసక్తికరం. అప్పట్లో ఈ క్రీడను టీవీల్లో దాదాపు 90 మిలియన్స్‌కిపైగా జనం వీక్షించారు. ఇలా అత్యధిక మంది ప్రేక్షకులు వీక్షించిన క్రీడా పోటీగా రికార్డు సృష్టించింది. ఈ ఇతివృత్తంతో వచ్చిన ఈ సినిమాకు జోనాథన్ డేటన్, వాలెరీ ఫరిస్ సంయుక్తంగా దర్శకత్వం వహించారు. ఇందులో బిల్లీ జీన్ కింగ్ పాత్రలో ఎమ్మా స్టోన్, రిగ్స్ పాత్రలో స్టీవ్ కారెల్లె నటించారు. గతేడాది విడుదలైన ఈ సినిమా ఫర్వాలేనిపించుకుంది.

కెప్లర్ డ్రీమ్

11ఏండ్ల టీనేజ్ అమ్మాయి వేసవి సెలవుల్లో తన గ్రాండ్ మదర్ ఇంటికి వెళ్తుంది. అక్కడ అమ్మమ్మ కోసం అరుదైన పుస్తకాలను సేకరిస్తుంటుంది. అదే క్రమంలో తన ఫ్యామిలీలో చోటు చేసుకున్న సంఘటనలను తెలుసుకోవడానికి, వాటిని అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తుంటుంది. మరి ఇంతకి తను ఏం తెలుసుకుంది?, తర్వాత ఏం చేసిందనేది సినిమా. అడ్వెంచరస్ ఫ్యామిలీ డ్రామాగా తెరకెక్కిన ఈ చిత్రానికి అమీ గ్లేజర్ దర్శకత్వం వహించారు. టీనేజ్ అమ్మాయి పాత్రలో ఇసబెల్లా బ్లేక్, గ్రాండ్‌మదర్ పాత్రలో హెూలాండ్ టైలర్ నటించారు. ఈ చిత్రం గతేడాది విడుదలై మంచి విజయం సాధించింది.


నోవిషియేట్


ఒక అమ్మాయికి సంబంధించి దేవుడిపై నమ్మకం, లైంగిక పరమైన సంఘర్షణను తెలిపే చిత్రమిది. 1960కి ముందు వాటికన్‌లో జరిగిన సంఘటన ఇది. ఏడేండ్ల బాలిక దేవుడిపై నమ్మకంతో చర్చిలో సిస్టర్‌గా మారాలనుకుంటుంది. ఈ క్రమంలో చర్చిలో ఆమె చూసిన మార్పులు, అక్కడి పరిస్థితులకు, లైంగికంగా తనలో వచ్చిన మార్పులకు తనెలాంటి స్ట్రగుల్స్ పడిందనేది చిత్ర కథాంశం. మహిళా దర్శకురాలు మార్గరేట్ బెట్స్ రూపొందించిన ఈ చిత్రం గతేడాది అక్టోబర్‌లో విడుదలైంది. ఇందులో ఏడేండ్ల అమ్మాయిగా సషా మాసన్, పెద్దయ్యాక మార్గరేట్ క్వాల్లే నటించారు.

భిన్న నేపథ్య మహిళా ప్రధాన చిత్రాలు


















ది లాస్ట్ వరల్డ్

రిటైర్డ్ బిజినెస్ ఉమెన్ తన చుట్టూ ఉండే పరిస్థితులన్నీ తన నియంత్రణలో ఉండాలని కోరుకుంటుంది. అలా ఉండేందుకు ప్రయత్నిస్తుంటుంది. ఓ రోజు పేపర్‌లో ఇతరుల జీవితాలను చూసి తన జీవిత కథ కూడా అలా న్యూస్ పేపర్‌లో రావాలకుంటుంది. దీని కోసమై స్థానిక వార్తా పత్రికను సంప్రదించగా, ఈ టాస్కను ఓ యువ లేడీ జర్నలిస్ట్‌కు అప్పగిస్తారు. ఈ మహిళా వ్యాపారవేత్త జీవితం, స్నేహానికి సంబంధించిన నిజాలను కనిపెట్టేందుకు జర్నలిస్ట్ పడిన సంఘర్షణే ఈ చిత్ర కథ. ఆద్యంతం కామెడీగా సాగే ఈ చిత్రాన్ని మార్క్ పెల్లింగ్టన్ రూపొందించారు. గతేడాది మార్చిలో విడుదలై ఆకట్టుకుంది. ఇందులో వ్యాపారవేత్తగా షిర్లీ మెక్‌లయిన్, జర్నలిస్ట్‌గా అమండా సెయ్‌ఫ్రైడ్ నటించి ఆకట్టుకున్నారు.

ఎవ్రీథింగ్, ఎవ్రీథింగ్

17 ఏండ్ల మాడెలిన్ వైట్టర్ అనే యువతి ఓ అరుదైన వ్యాధితో బాధపడుతుంటుంది. దీని కారణంగా ఇంటి నుంచి బయటకు వెళ్ళలేని స్థితి. 24 గంటలు ఇంట్లోనే ఉండాలి. పుస్తకాలు, అమ్మ, నర్స్ ఇవే ఆమె ప్రపంచం. ఓ రోజు పక్కింటికి కొత్తగా వచ్చిన ఒల్లి అనే అందమైన కుర్రాడు పరిచయమవుతాడు. వీరి పరిచయం ప్రేమగా మారుతుంది. తమ ప్రేమ కోసం ఆమె ఎంతటి సాహసం చేసింది. ప్రాణాలకు ప్రమాదం పొంచి ఉన్నా అతని కోసం ఏం చేసిందనే ఇతివృత్తంతో రూపొందిన అమెరికన్ రొమాంటిక్ డ్రామా చిత్రమిది. 2015లో ఇదే పేరుతో వచ్చిన బెస్ట్ సెల్లింగ్ నవల ఆధారంగా దర్శకురాలు స్టెల్లా మెమీ రూపొందించారు. గతేడాది మేలో విడుదలైన ఈ చిత్రం విమర్శకుల ప్రశంసలందుకుంది. కమర్షియల్‌గానూ సత్తా చాటింది. మాడెలిన్‌గా అమండ్లా స్టెన్‌బెర్గ్, ఒల్లిగా నిక్ రాబిన్సన్ నటన ప్రేక్షకులను ఫిదా చేస్తుంది.

తులిప్ ఫీవర్

17వ శతాబ్దం తులిప్ మానియా టైమ్‌లో ఒక పెయింటింగ్ ఆర్టిస్టు సంపన్న కుటుంబానికి చెందిన పెళ్లైన యువతి ప్రేమలో పడతాడు. ఇద్దరూ గాఢమైన ప్రేమలో మునిగి శారీరకంగా దగ్గరవుతారు. ఈ విషయం ఆమె భర్తకు తెలియడంతో వీరి ప్రేమకు ఎదురైన సవాళ్ళు, ఆటుపోట్లు ఏంటనేది సినిమా. జస్టిన్ చాడ్విక్ దర్శకత్వం వహించిన ఈ హిస్టారికల్ రొమాంటిక్ డ్రామా చిత్రం గతేడాది విడుదలై మంచి ఆదరణతోపాటు పలు విమర్శలు ఎదుర్కొంది. పెళ్లైన మహిళ పాత్రలో అలిసియా వికండర్, ఆర్టిస్టు పాత్రలో డానె డెహాన్‌ల నటన మంత్రముగ్దుల్ని చేస్తుంది.

హోమ్ ఎగైన్

భర్తతో విడిపోయి ఆలిస్ కిన్నే ఇద్దరు కూతుర్లతో కలిసి లాస్ ఏంజెల్స్‌లోని సొంత ఇంటికి వెళ్ళిపోతుంది. తన 40వ పుట్టిన రోజు రాత్రి ముగ్గురు ఔత్సాహిక ఫిల్మ్ మేకర్స్‌ను కలుస్తుంది. వారి పరిచయం కాస్త రొమాంటిక్‌గా మారుతుంది. అనంతరం చోటు చేసుకున్న ఆసక్తికర పరిణామాల సమాహారమే ఈ చిత్ర కథ. ఈ రొమాంటిక్ కామెడీ చిత్రానికి హాలీ మేయర్స్ షైర్ దర్శకత్వం వహించారు. ఆమెకిది దర్శకురాలిగా తొలి చిత్రం. ఆలిస్ పాత్రలో రీస్ విథర్స్పూన్, ముగ్గురు ఫిల్మ్ మేకర్స్ పాత్రల్లో పికో అలెగ్జాండర్, జాన్ రుడ్నిస్ట్కి, నాట్ వోల్ఫ్ నటించారు. గతేడాది విడుదలై మంచి కలెక్షన్లను రాబట్టింది.

గర్ల్స్ ట్రిప్

విభిన్న వృత్తుల్లో ఉన్న నలుగురు చిరకాల స్నేహితురాళ్లు కలిసి మ్యూజికల్ ఫెస్టివల్ కోసం అమెరికాలోని న్యూ ఒర్లియన్స్ నగరానికి వెళతారు. అక్కడ తమని తాము కనుగొంటారు. అంతేకాదు డాన్స్ చేస్తూ ఎంజాయ్ చేయడం, మద్యం తీసుకోవడం, కొట్టుకోవడంతోపాటు రొమాన్స్ కూడా చేస్తారు. తమకి కావాల్సిన జీవితాన్ని విధంగా ఎంజాయ్ చేస్తారు. ఈ క్రమంలో వారి జీవితాలు ఎలాంటి మలుపులు తిరిగాయన్నది ఈ చిత్ర కథాంశం. కెన్యా బ్రీస్, ట్రేసీ ఓలివర్ తన సొంత అనుభవాల ఆధారంగా ఈ చిత్ర కథను రాశారు. దీనికి మాల్కం డి లీ దర్శకత్వం వహించారు. గతేడాది విడుదలైన ఈ కామెడీ చిత్రం భారీ విజయం సాధించడంతోపాటు మంచి ప్రశంసలందుకుంది. నలుగురు స్నేహితురాళ్ళ పాత్రల్లో రెజినా హాల్, క్వీన్ లతిఫా, జాడ పింకెట్ స్మిత్, టిఫాని హడ్డిష్ నటించి మెప్పించారు.

ట్రాజెడీ గర్ల్స్

సాడీ, మెక్ కైలా అనే అమ్మాయిలు బెస్ట్ ఫ్రెండ్స్. హై స్కూల్‌లో సీనియర్స్. తమ పాపులారిటీ కోసం వరుసగా హత్యలకు పాల్పడుతుంటారు. రియల్ లైఫ్‌లో చేసే హత్యలను ఆన్‌లైన్ షోలో చూపిస్తుంటారు. అలా ఎందుకు చేస్తుంటారు?, అలా చేయడం వల్ల ఏం జరిగిందనే భయానక, హాస్యభరిత సన్నివేశాల సమాహారమే ఈ సినిమా. ఈ కామెడీ హర్రర్ చిత్రాన్ని టైలర్ మెక్ ఇంటైర్ రూపొందించారు. ప్రశంసలతోపాటు విమర్శలు ఎదుర్కొన్న ఈ చిత్రం గతేడాది విడుదలైంది. సాడీ పాత్రలో బ్రాడీ హిల్డే బ్రాండ్, మెక్ కైలా పాత్రలో అలెగ్జాండ్రా షిప్స్ నటన అలరిస్తుంది.

షేప్ ఆఫ్ వాటర్

మూగ అమ్మాయికి, వింత జీవికి మధ్య ప్రేమను తెలిపే చిత్రమిది. ఎలిసాకు మాటలు రావు. అమెరికాలోని ఓ ల్యాబ్‌లో సేవకురాలిగా పనిచేస్తుంటుంది. అక్కడ వింత జీవిపై పరిశోధన చేస్తుంటారు. రోజూ దాన్ని గమనిస్తున్న ఎలిసా ఆ వింత జీవితో ప్రేమలో పడుతుంది. అనంతరం చోటు చేసుకున్న భయానక, ఆసక్తికర సన్నివేశాల సమాహారమే సినిమా. ఈ ఫాంటసీ డ్రామా చిత్రానికి గుల్లెర్మో డెల్ టోరో దర్శకత్వం వహించారు. మూగ అమ్మాయి పాత్రలో సాల్లీ హాకిన్స్ నటన ఫిదా చేస్తుంది. ఈ ఏడాది 13 విభాగాల్లో ఈ చిత్రం ఆస్కార్‌కు పోటీపడుతోంది. అత్యధిక నామినేషన్లు పొందిన ఈ సినిమా గతేడాది విడుదలై భారీ విజయం సాధించింది. మంచి కలెక్షన్లనూ రాబట్టుకుంది.


బీట్రీజ్ ఎట్ డిన్నర్

బీట్రీజ్ అనే లేడీ మెడికల్ ప్రాక్టీషనర్ మెక్సికో నుంచి లాస్ ఏంజెల్స్‌కు వలస వస్తుంది. చిన్న, పెద్ద తేడా లేకుండా తన ప్రత్యేకమైన థెరపీల ద్వారా మెరుగైన వైద్యం అందిస్తూ ఎంతో మందిని ఆకట్టుకుంటుంది. అందరికీ బాగా దగ్గరవుతుంది. బాగా సంపన్నుడైన తన క్లయింట్ డాగ్ స్ట్రట్ ఓ రోజు బీట్రీజ్‌ను తన ఇంటికి డిన్నర్‌కు ఆహ్వానిస్తాడు. డిన్నర్‌కి వెళ్ళిన బీట్రిజ్‌కు ఎదురైన అనుభవాలేంటి?, విరుద్ధ భావాలు కలిగిన వాళ్ళిద్దరి మధ్య చోటు చేసుకున్న ఆసక్తికర, సంఘర్షణా పూరిత సన్నివేశాల సమాహారమే ఈ చిత్రం. మిగ్వెల్ ఆర్టేటా దర్శకత్వం వహించిన ఈ కామెడీ డ్రామా చిత్రం గతేడాది విడుదలై విశేష ఆదరణ పొందింది. బీట్రీజ్ పాత్రలో సల్మా హాయెక్, రిచ్ పర్సన్ పాత్రలో జాన్ లిత్గో అద్భుతంగా నటించారు.

మెగన్ లివీ

మెగన్ లివీ అనే యువ సైనికురాలి జీవితం ఆధారంగా రూపొందించిన చిత్రమిది. డాగ్ స్క్వాడ్‌గా ముందస్తుగానే బాంబ్ దాడులను కనిపెట్టి చాలా మంది సైనికుల ప్రాణాలను కాపాడుతుంది. అనుకోకుండా జరిగిన ఓ బాంబ్ బ్లాస్ట్ మెగన్ లైఫ్‌లో మనశ్శాంతిని కోల్పోయేలా చేస్తుంది. అయినప్పటికీ విధి నిర్వహణలో ఆమె చూపించే శ్రద్ధ అనిర్వచనీయం. స్ఫూరిదాయకంగా నిలిచే ఈ సినిమాను దర్శకుడు గాబ్రియేలా కౌపర్థెయింట్ రూపొందించారు. గతేడాది విడుదలైన ఈ చిత్రంలో యువ సైనికురాలు మెగన్ పాత్రలో కేట్ మారా నటన అందరినీ మెప్పిస్తుంది.

















లాల్ - నీల్ ఐక్యతతో నవశకం

- ఒకే తరహాలో ఆర్థిక దోపిడీ... సామాజిక అణచివేత
- మద్దతు ధరలకు ప్రత్యేక చట్టం కోసం ఉద్యమాలు
- రైతులను రుణవిముక్తుల్ని చేయకుండా ఆత్మహత్యలు ఆగవు
- మోడీ ఉద్యోగ కల్పనలు అభూతకల్పనలు
- నల్లగొండను ఎర్రగొండగా మార్చేందుకు కంకణబద్ధులు కావాలి : రెడ్‌షర్ట్ వాలంటీర్ల కవాతు బహిరంగసభలో సీతారాం ఏచూరి

నల్లగొండ నుంచి గుడిగ రఘు



దేశంలో ఆర్థిక దోపిడీ...సామాజిక అణచివేత పెరుగుతున్నదని సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ఆందోళన వ్యక్తం చేసారు. పేదలపై ఆర్థిక భారాలు, సామాజిక దౌర్జన్యం ఒకే తరహాలో దాడి చేస్తున్నాయన్నారు. ఈ క్రమంలో నీల్, లాల్ జెండాల కలయిక దేశంలోనే ఒక ముందడుగు అని చెప్పారు. దేశ వ్యాప్తంగా రైతుల పరిస్థితి దయనీయంగా మారిందనీ, వారిని రుణ విముక్తులు చేయకుండా ఆత్మహత్యలు ఆపడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. రైతులు పండించిన పంటలకు మద్దతు ధరల అమలు కోసం ప్రత్యేక చట్టం తీసుకురావాలని కోరారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను ప్రధానమంత్రి నరేంద్రమోడీ అమలు చేయడం లేదనీ, ఉద్యోగ కల్పనంటూ అభూతకల్పనలు చూపిస్తున్నారని విమర్శించారు. సీపీఐ(ఎం) ద్వితీయ రాష్ట్ర మహాసభల సందర్భంగా నర్రా రాఘవరెడ్డినగర్(నల్లగొండ)లో రెడ్‌షర్టు వాలంటీర్ల కవాతు బహిరంగ సభ జరిగింది. ఈ సందర్భంగా ఏచూరి మాట్లాడుతూ ఐదువేల మందితో రెడ్‌షెర్టు వాలంటీర్ల ర్యాలీ చూసిన తర్వాత తనకు విశ్వాసం ఏర్పడిందన్నారు. నల్లగొండ ఎర్రగొండ అనే విశ్వాసం తిరిగి వచ్చే అవకాశం కనిపిస్తోందన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొన్న వీరుల వారసత్వమంతా నల్లగొండను ఎర్రగొండగా మార్చాలని సూచించారు. తెలంగాణలో ఆర్థిక దోపిడీ, భూస్వామ్య దొరల పాలనకు వ్యతిరేకంగా జరిగిన పోరాటమే దేశ రాజకీయాల్లో పెద్ద మార్పు అన్నారు. ఆ ఉద్యమం జాతీయస్థాయిలో భూసంస్కరణలను ఎజెండాగా మార్చిందని గుర్తు చేశారు. ఆర్థిక దోపిడీ, సామాజిక దౌర్జన్యానికి వ్యతిరేకంగా ఎంతోమంది అమరులు అయ్యారని, వారి స్ఫూర్తితో దోపిడీ లేని సమాజం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ నిర్దిష్ట పరిస్థితులకు అనుగుణంగా రాష్ట్ర ద్వితీయ మహాసభల్లో చర్చించి తగిన కార్యాచరణ రూపొందిస్తామన్నారు. నేటి పరిస్థితులకు సీపీఐ(ఎం) విధానం ఏ విధంగా ఉండాలో చర్చిస్తామన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం తప్పుడు పద్ధతులతో మత ఘర్షణలు, కులద్వేషాన్ని రెచ్చగొట్టి రాజకీయ పబ్బం గడుపుతున్నదని విమర్శించారు. 1995లో జరిగిన 15వ జాతీయ మహాసభ ఆర్థిక దోపిడీకి, కుల వివక్షకు వ్యతిరేకంగా వర్గపోరాటం నిర్వహించాలని నిర్ణయించిందన్నారు. ఈ రెండు సమస్యలపై సీపీఐ(ఎం) నికరమైన పోరాటం తలపెట్టిందన్నారు. అందులో భాగంగానే తెలంగాణ రాష్ట్రంలో బహుజన లెఫ్ట్ ఫ్రంట్ (బీఎల్ఎఫ్) ఏర్పడిందన్నారు. దేశానికి ఇది ఒక ముందడుగు అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 93శాతం ఉన్నా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలపై సామాజిక దౌర్జన్యం కొనసాగుతున్నదని అన్నారు. కులవివక్ష నిర్మూలన లక్ష్యంగా తెలంగాణలో బలమైన ప్రజా ఉద్యమం నిర్మించాలని ఆకాంక్షించారు. లాల్, నీల్ జెండాలు కలిసి పని చేస్తే తప్పా, దేశంలో మార్పుకు ముందడుగు వేయలేమని తెలిపారు.

పేద, మధ్య తరగతులపై భారాలు

బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో పేద, మధ్యతరగతి కుటుంబాల పైన తీవ్రమైన భారాలు పెరుగుతున్నాయని ఏచూరి అన్నారు. ఎన్నికలకు ముందు బీజేపీ ఇచ్చిన వాగ్దానాల్లో ఏ ఒక్కటీ అమలు చేయలేదని, కేంద్రం బడ్జెట్ పేదలపై భారాలు మోపుతూ ...ధనికులపై వరాలు కురిపించిందని విమర్శించారు. పేదలపై 73 శాతం పన్నులు వేయగా, ధనికులపై ఒక శాతం పన్ను కూడా వేయలేదని చెప్పారు. రైతులకు రుణాలు ఇచ్చేందుకు డబ్బులేదంటున్న కేంద్ర ప్రభుత్వం...కార్పొరేట్లకు రెండు లక్షల కోట్ల రుణాలు ఎలా ఇచ్చిందని ప్రశ్నించారు. నిరుద్యోగులకు రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న హామీని మోడీ విస్మరించారన్నారు. రైతులు పండించిన పంటకు మద్దతు ధర ప్రకటించారని, కానీ ఆ ధరకు ప్రభుత్వ సంస్థలే కొనడం లేదని మండిపడ్డారు. ఈనేపథ్యంలో పండించిన పంటలకు మద్దతు ధర కల్పించేందుకు ప్రత్యేక చట్టం చేయాలని డిమాండ్ చేశారు. దీనిని ప్రజా ఉద్యమాల ద్వారానే సాధిస్తామన్నారు. ఎస్సీ జనాభా దమాషా ప్రకారం 17.5 శాతం నిధులు ఖర్చు చేయాల్సి ఉందనీ, కానీ 2.8 శాతం నిధులు మాత్రమే ఖర్చు చేస్తే ఎస్సీలు ఎలా అభివృద్ధి చెందుతారని ప్రశ్నించారు. ఎస్టీ జనాభాకు 7.5 శాతం నిధులు పెంచాల్సి ఉండగా కేవలం 1.6 శాతం నిధులు మాత్రమే పెంచారని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు జనాభా ప్రాతిపదికన కేటాయింపులు చేయకుండా సబ్‌ప్లాన్ నిధులను కూడా రద్దు చేసిందన్నారు. ప్లానింగ్ కమిషన్‌ను ఎత్తివేయడంవల్ల ఈ పరిస్థితి దాపురించిందని తెలిపారు. పది కోట్ల కుటుంబాలకు ఐదు లక్షల ఆరోగ్య భీమా చెల్లిస్తామని చెబుతున్న మోడీ... బడ్జెట్‌లో ప్రీమియం కట్టారా? అని ప్రశ్నించారు. పేదలకు ఆరోగ్య భీమా విషయంలో భ్రమలు కల్పించారన్నారు. విదేశీ బ్యాంకుల నుంచి తెచ్చిన బ్లాక్ మనీ ప్రతి పౌరుడి ఖాతాలో వేస్తామని చెప్పిన విషయం ఏమైందని ఆయన ప్రశ్నించారు.

ఒక దేశం..ఒకే ఎన్నిక కుదరదు

దేశంలో 1952, 1957లోనే కేంద్రానికి, రాష్ట్రాలకు కలిపి ఎన్నికలు జరిగాయని సీతారాం ఏచూరి అన్నారు. ఆ తర్వాత ఇప్పటి వరకూ ఎందుకు కొనసాగలేదని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన ప్రశ్నించారు. కేరళ, పశ్చిమబెంగాల్, ఏపీ రాష్ట్రాల్లో ప్రభుత్వాలను రద్దు చేయడం వల్లే ఒకే ఎన్నికలకు బ్రేక్ పడిందన్నారు. 356 ఆర్టికల్‌ను ఉపయోగించి రాష్ట్ర ప్రభుత్వాలను రద్దు చేస్తున్నాయన్నారు. అందుకే ఒక దేశం...ఒకే ఎన్నిక కుదరదని చెప్పారు. రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వస్తే అనివార్య కారణాలతో ఏదైనా ఒక పార్టీ కూటమి నుంచి బయటకు వస్తే ఆ ప్రభుత్వం మైనార్టీలో పడుతున్నదని, ఆ రాష్ట్రంలో ఎన్నికలు నిర్వహించే అవకాశం లేదని చెప్పారు. దీంతో రాష్ట్రపతి పాలన పెట్టవచ్చనే ఆలోచన కనిపిస్తోందన్నారు. ఇది ప్రజాస్వామ్యానికి వ్యతిరేకమని చెప్పారు. ఇటీవల కొన్ని రాష్ట్రాలలో జరిగిన ఉప ఎన్నికల్లో బీజేపీ ఘోరపరాజయం పొందిందని, దీన్నించి తప్పించుకుని, రానున్న ఎన్నికల్లో గెలిచేందుకే మోడీ ఈ ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు.

బీజేపీని సాగనంపితేనే దేశ భవిష్యత్ : బివి రాఘవులు

దేశ ప్రజలను బీజేపీ నుంచి విముక్తి చేస్తేనే దేశానికి భవిష్యతు ఉంటుందని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు చెప్పారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక దళితులు, గిరిజనులు, మైనార్టీలు, మహిళలపై దాడులు పెరిగిపోతున్నాయని చెప్పారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్, సంఘపరివార్ మతోన్మాద చర్యలకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పోరాడలేక పోతుందని విమర్శించారు. ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడే బృహత్తర కర్తవ్యం వామపక్షాలపైనే ఉందని అన్నారు. నిజామాబాద్ జిల్లాలో బీజేపీ నేత దళితులను మురికికుంటలో ముంచి అహంకార పూరితంగా సోషల్ మీడియాలో పెట్టారన్నారు. ఢిల్లీ, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మహిళలు, పసిపిల్లలపై దాడులు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. లవ్ జిహాద్ పేరుతో మైనార్టీలపై దాడులు చేస్తున్నారని, బీజేపీ పాలనలో వారికి రక్షణ కరువైందన్నారు. చివరకు తాజ్‌మహల్ మన దేశ నిర్మాణం కాదని బీజేపీ నాయకులు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. తినే ఆహారం, కట్టే బట్టపై బీజేపీ నిబంధనలు పెట్టి పౌరుల జీవించే హక్కును హరిస్తోందన్నారు. ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ సాయిబాబా పౌర హక్కుల కోసం పోరాడుతున్నాడని, ఆయనను జైల్లో పెట్టారని, 26 జబ్బులతో బాధపడుతున్న ఆయనకు వైద్యం అందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో టీఆర్ఎస్, బీజేపీ పైకి అంటిముట్టనట్టు కనిపిస్తున్నా...లోపాయికారిగా ఆ పార్టీలు ఎంతో దగ్గరగా ఉన్నాయన్నారు. తెలంగాణలో మతోన్మాదుల ఆగడాలు పెరిగిపోతున్నా ముఖ్యమంత్రి నోరువిప్పడం లేదని మండిపడ్డారు. కాంగ్రెస్, టీడీపీ, టీఆర్ఎస్ పార్టీలు కూడా మతోన్మాదంపై పోరాడుతాయన్న నమ్మకం లేదన్నారు. దేశంలో మతోన్మాదానికి వ్యతిరేకంగా, రాష్ట్రంలో టీఆర్ఎస్ ప్రజా వ్యతిరేక విధానాలపై వామపక్షాలు ముందుండి పోరాడుతున్నాయని ఆయన చెప్పారు.

మత ఘర్షణలకు బీజేపీ పాలన పరాకాష్ట

నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చాక దేశంలో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు, మహిళలపై దాడులు పెరిగిపోయాయని ఏచూరి అన్నారు. పద్మావతి చిత్రాన్ని సెన్సార్ బోర్డు రిలీజ్ చేసినా మతోన్మాదులు అడ్డుకున్నారని చెప్పారు. ఈ ప్రభుత్వానికి ప్రభుత్వ సంస్థలపై బీజేపీ విశ్వాసం లేదన్నారు. హిందూ, ముస్లింల మధ్య వైషమ్యాలు సృష్టిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

భారత్ వీడుతున్న కుబేరులు

(మొదటిపేజీ తరువాయి)

దేశాల జాబితాలో 8,230 బిలియన్ డాలర్ల ఆస్తితో భారత్ 6వ స్థానంలో ఉంది.

2017లో 7వేల మంది మిలియనీర్లు భారత్ నుంచి విదేశాలకు వెళ్లిపోగా.. 2016లో ఆ సంఖ్య 6వేలుగా ఉంది. 2015లో 4వేల మంది మిలియనీర్లు మాత్రమే వెళ్లారు. ఇక ప్రపంచవ్యాప్తంగా చూస్తే చైనా నుంచి అత్యధికంగా 10వేల మంది మిలియనీర్లు ఇతరదేశాలకు వెళ్లిపోయారు. ఆ తర్వాతి స్థానాల్లో టర్కీ(6000), బ్రిటన్(4000), ఫ్రాన్స్(4000), రష్యా ఫెడరేషన్(3000) ఉన్నాయి. భారత మిలియనీర్లు ఎక్కువగా అమెరికా, యూఏఈ, కెనడా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ వెళ్తున్నారు. ఇక చైనీయులు ఎక్కువగా అమెరికా, కెనడా, ఆస్ట్రేలియాకు వెళ్లేందుకు మొగ్గుచూపుతున్నారు. సంపన్నులను రాబట్టుకోవడంలో వరుసగా మూడోసారి ఆస్ట్రేలియా మొదటిస్థానంలో ఉంది. గతేడాది ఆ దేశానికి దాదాపు 10వేల మంది సంపన్నులు వెళ్లారు. గత పదేండ్ల కాలాన్ని బట్టి చూస్తే ఆస్ట్రేలియా సంపద 83శాతం పెరిగింది. ఇక ఈ విషయంలో అమెరికా రెండో స్థానంలో నిలిచింది. అమెరికా సంపద కేవలం 20శాతం మాత్రమే పెరిగింది. ఆస్ట్రేలియా తర్వాత సంపన్నులు ఎక్కువగా అమెరికాలో స్థిరపడేందుకు ఆసక్తి చూపిస్తున్నారు.

గొప్ప పోరాట యోధుడు మఖ్దూం

- సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి
- ఆయన ఆశయాల కోసం పోరాడుదాం : రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి



నవతెలంగాణ - ముషీరాబాద్

నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా తెలంగాణ సాయుధ పోరాటానికి పిలుపునిచ్చి ముందుకు నడిచిన గొప్ప యోధుడు మఖ్దూ మొహియుద్దీన్ అని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి అన్నారు. మొహియుద్దీన్ 110వ జయంతి సందర్భంగా హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై ఆయన విగ్రహానికి పూలమాలలేసి నివాళ్లర్పించారు. అనంతరం సురవరం మాట్లాడుతూ.. కార్మికుల పక్షాన మొట్టమొదట ట్రేడ్ యూనియన్ ఏర్పాటు చేసిన మఖ్దూ తెలంగాణ కమ్యూనిస్టు పార్టీకి శ్రీకారం చుట్టారని తెలిపారు. ఆ కాలంలో లక్షల ఎకరాల భూమి కొద్దిమంది చేతుల్లోనే కేంద్రీకృతమైందని, పౌర హక్కులు లేకుండా కొనసాగుతున్న నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా రావినారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డితో కలిసి సాయుధ పోరాటానికి పిలుపునిచ్చారని వివరించారు. మఖ్దూం కేవలం కమ్యూనిస్టు నాయకునిగానే కాకుండా శాసనమండలి సభ్యునిగా, అఖిలభారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్‌కు ఉపాధ్యక్షునిగా పనిచేశారని గుర్తుచేశారు. మఖ్దూం ఏ లక్ష్యాల కోసం పోరాడారో ఆ లక్ష్యాలను కొనసాగిద్దామని పిలుపునిచ్చారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎటువంటి స్వేచ్ఛా హక్కులు లేని ఆనాటి రోజుల్లో కమ్యూనిస్టు నాయకునిగా, కార్మిక నాయకునిగా, శాసనమండలి సభ్యునిగా, కవిగా అలుపెరుగని పోరాటం చేసిన మొహియుద్దీన్ ఆశయాల సాధన కోసం పోరాడుదామని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు ప్రతాపరెడ్డి, రాకేష్‌సింగ్ పాల్గొన్నారు.

మేక్ ఇన్ ఇండియా కాదు..ప్రొటెక్ట్ ఇన్ ఇండియా..!!

నవతెలంగాణ జనరల్‌డెస్క్

పెద్దనోట్ల రద్దు, హడావుడిగా జీఎస్టీని అమలులోకి తేవడం వల్ల దేశ ఆర్థిక వ్యవస్థకు జరిగిన నష్టం ఇటీవల పార్లమెంట్‌కు సమర్పించిన బడ్జెట్‌లో స్పష్టమైనట్టు ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు. మేక్ ఇన్ ఇండియా అంటూ ఊదరగొట్టిన ప్రధాని మోడీ ఇప్పుడు రక్షణాత్మక వ్యూహంతో తన మునుపటి ఆలోచనల నుంచి వెనక్కి తగ్గినట్టుగా అంచనా వేస్తున్నారు. ఇప్పుడు మోడీ అనుసరిస్తున్న ఆర్థిక విధానాన్ని గమనిస్తే ప్రొటెక్ట్ ఇన్ ఇండియా అన్నట్టుగా ఉన్నదని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. ఇటీవల దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సుకు వెళ్లే ముందు ప్రధాని మోడీ చేసిన వ్యాఖ్యల సారాంశమే బడ్జెట్‌లో ప్రతిఫలించడం గమనార్హం. ఈసారి ప్రజా రంజక బడ్జెట్ ఏమీ ప్రవేశ పెట్టబోమని ప్రధాని మోడీ పది రోజుల ముందే తన మనసులోని మాట బయట పెట్టారు. అందుకు తగ్గట్టుగానే ఎవరినీ ఊరడించే విధంగా బడ్జెట్ స్వరూపం లేకపోవడం గమనార్హం.

మరో ఏడాదిలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్నవేళ వేతన జీవుల్ని ఊరడించే ప్రకటన ఉంటుందని ఆశించినవారికి నిరాశే మిగిలిస్తూ ఆదాయం పన్ను శ్లాబుల్ని యథాతథంగా ఉంచుతున్నట్టు ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ స్పష్టం చేశారు. స్టాక్ మార్కెట్‌లో మదుపు చేసే ఉన్నత మధ్యతరగతికి కూడా జైట్లీ బడ్జెట్ నిరాశే మిగిల్చింది. రూ.లక్షకుపైన వచ్చే దీర్ఘకాలిక మూలధన(ఈక్విటీ) లాభాలపై 10 శాతం పన్ను విధించారు. ఈక్విటీ ఆధారిత మ్యూచ్‌వల్ ఫండ్ల నుంచి వచ్చే లాభాలపైనా 10 శాతం పన్ను విధిస్తున్నట్టు జైట్లీ ప్రకటించారు. దాంతో, ఒక్కసారిగా స్టాక్ మార్కెట్లు కుప్పకూలాయి. బడ్జెట్ ప్రవేశపెట్టిన మరుసటిరోజు(శుక్రవారం) కూడా సెన్సెక్స్ 840 పాయింట్లు పడిపోయింది.

ఎలక్ట్రానిక్ వస్తువులు, బొమ్మలు, ఫర్నీచర్ విడిభాగాలువంటి వాటిపై 15 నుంచి 50 శాతం వరకూ దిగుమతి సుంకం విధించారు. వీటిలో అన్ని తరగతుల ప్రజలూ వాడే వినియోగ వస్తువులున్నాయి. ఉదాహరణకు సెల్‌ఫోన్లపై దిగుమతి సుంకాన్ని 15 నుంచి 20 శాతానికి పెంచారు. సెల్‌ఫోన్ల విడి భాగాలపై గతంలో 7.5-10 శాతం ఉన్న దిగుమతి సుంకాన్ని 15 శాతానికి పెంచారు. దీంతో, ఈ వస్తువుల ధరలు భారీగా పెరగనున్నాయి.

2008లో యూపీఏ ప్రభుత్వ హయాంలో ద్రవ్య బాధ్యత, బడ్జెట్ నిర్వహణా చట్టాన్ని తెచ్చారు. దాని ప్రకారం జీడీపీలో ద్రవ్యలోటును 3 శాతానికి, రెవెన్యూ లోటును జీరో స్థాయికి తేవాలి. అరుణ్‌జైట్లీ ఆర్థికమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ద్రవ్యలోటును మూడేండ్లలో 3 శాతానికి తగ్గిస్తానంటూ హామీ ఇచ్చారు. తాజాగా ఆయన తన టార్గెట్‌ను 2020-21కి వాయిదా వేశారు. 2017-18 బడ్జెట్ ప్రసంగంలో ద్రవ్యలోటును 3.2 శాతానికి కట్టడి చేస్తామన్న జైట్లీ అది 3.5 శాతానికి పెరగనున్నట్టు తాజా ప్రసంగంలో చెప్పారు. 2018-19 బడ్జెట్‌లో ద్రవ్యలోటును 3.3 లక్ష్యంగా పేర్కొన్నారు. రెవెన్యూ లోటును 2017-18 బడ్జెట్‌కు సవరించిన అంచనాను 2.6గా, 2018-19 బడ్జెట్‌లో 2.2గా చూపారు.

పేద ప్రజలు, రైతులకు ఇచ్చే సబ్సిడీల విషయంలోనూ బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఏమాత్రం కనికరం చూపలేదు. 2017-18లో రైతులకు ఎరువుల సబ్సిడీని రూ. 70,000 కోట్లుగా ప్రకటించారు. అదే ఏడాదికి సవరించిన బడ్జెట్‌లో రూ. 64,974 కోట్లకు తగ్గించారు. అదే ఏడాదికి ఆహార సబ్సిడీని బడ్జెట్‌లో రూ.1,45,339 కోట్లుగా చూపి 1,40,282 కోట్లకు సవరించారు. 2018-19కి బడ్జెట్ పత్రంలో ఆహార సబ్సిడీని రూ.1,69,323 కోట్లుగా చూపారు. వాస్తవంగా ఎంత ఖర్చు చేస్తారన్నది తెలిసే సరికి 2019 సార్వత్రిక ఎన్నికలు పూర్తవుతాయి. 2016-17లో(వాస్తవ గణాంకాల్లో) రూ.27,539 కోట్లుగా ఉన్న పెట్రోలియం సబ్సిడీని 2017-18 సవరించిన బడ్జెట్‌లో 24,460 కోట్లకు, 2018-19 బడ్జెట్‌లో 24,933 కోట్లకు తగ్గించారు.

దేశానికి ప్రత్యామ్నాయం వామపక్షాలే

సీపీఐ (ఎం) రాష్ట్ర మహాసభల ప్రారంభోపన్యాసంలో సీతారాం ఏచూరి

నల్లగొండ నుంచి బి.వి.యన్.పద్మరాజు

ప్రధాని మోడీ అధికారంలోకి వచ్చాక దేశంలో ఆర్థిక, సామాజిక సంక్షోభం కొనసాగుతున్నదని, మతోన్మాదంతోపాటు అడుగడుగునా నిరంకుశత్వం పెరిగిపోతున్నదని నల్లగొండలో జరిగిన సీపీఐ(ఎం) రాష్ట్ర ద్వితీయ మహాసభల ప్రారంభోపన్యాసంలో జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అన్నారు. దేశంలో ఒక అప్రకటిత ఎమర్జెన్సీ కొనసాగుతున్నదని, అమెరికాకు మన దేశం జూనియర్ భాగస్వామిగా మారిందన్నారు. ప్రభుత్వరంగాలన్నింటినీ పెట్టుబడిదారులకు తాకట్టు పెడుతున్నారని విమర్శించారు. అన్ని రంగాల్లోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు యదేచ్ఛగా ఆహ్వానిస్తున్నారని తెలిపారు. మరోవైపు దళితులు, మైనారిటీలపై దాడులు కొనసాగుతున్నాయని.. ప్రజలు ఏం తినాలో, ఏం ధరించాలో, ఏం మాట్లాడాలనే విషయాలను కూడా ఆరెస్సెస్, బీజేపీయే నిర్ణయిస్తున్నాయని విమర్శించారు. ఇలాంటి చర్యలకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటాలను కూడా నియంత్రించేందుకు పెద్ద ఎత్తున అణచివేతకు పాల్పడుతున్నారని చెప్పారు. ఈ క్రమంలో ఆర్థిక దోపిడీకి, సామాజిక అణచివేతకు వ్యతిరేకంగా నికరంగా పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఇందుకనుగుణంగా గత అఖిల భారత మహాసభలో తీర్మానించామని గుర్తుచేశారు. ఈ క్రమంలో 'మన చైతన్యంలో కూడా లోపాలున్నాయి..వాటిని సవరించుకోవాలి.. సామాజిక దృక్పథాన్ని అర్థం చేసుకోవాలి...' అని ఏచూరి సూచించారు. ఆ దిశగా ఆలోచించకుండా వర్గపోరాటం ముందడుగేయదని వ్యాఖ్యానించారు. ఇదే సమయంలో సామాజిక దోపిడీకి వ్యతిరేకంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల్లో చైతన్యం పెరుగుతున్న చైతన్యాన్ని ప్రజాస్వామ్య ఉద్యమాల్లోకి రాకుండా కొందరు కుల నేతలు రాజకీయ సమీకరణకు పాల్పడుతున్నారని చెప్పారు. వీటిని నిశితంగా పరిశీలించి, అర్థం చేసుకోవటం ద్వారా సరైన ఎత్తుగడలు వేయాలని కోరారు. 'ఈ క్రమంలో మనలో స్వాభావికంగా ఉన్న లోపాలను కూడా సవరించుకోవాలి...' అని ఏచూరి ఈ సందర్భంగా సూచించారు.

సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టిన జ్యోతి...

మహాసభలో సంతాప తీర్మానాన్ని సీపీఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి.జ్యోతి ప్రవేశపెట్టారు. గత మహాసభ నుంచి ఇప్పటి వరకు మరణించిన అంతర్జాతీయ, జాతీయ స్థాయిలోని వామపక్ష నేతలు, అభ్యుదయ, ప్రగతిశీల వాదులు, మేధావులు, సీపీఐ (ఎం) కేంద్ర, రాష్ట్ర, జిల్లా నాయకులు, వివిధ రంగాల్లోని ప్రముఖులు, ఇతర లెఫ్ట్ నాయకులకు మహాసభ ఈ సందర్భంగా తీవ్ర సంతాపాన్ని తెలిపింది. సంతాప సూచకంగా సభ రెండు నిమిషాలు మౌనం పాటించింది.

బీజేపీకి బండి సంజయ్ గుడ్‌బై

స్వంతపార్టీకి షాక్‌ల మీద షాక్‌లు

నవతెలంగాణ - హైదరాబాద్ బ్యూరో

ఇతర పార్టీల నుంచి పెద్ద ఎత్తున తమపార్టీలోకి నేతలు వస్తున్నారని ప్రచారం చేసుకుంటున్న రాష్ట్ర బీజేపీకి స్వంతపార్టీ నేతలే వరుస షాక్‌లు ఇస్తున్నారు. నిన్నటికి నిన్న మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి బీజేపీకి రాం...రాం...చెప్పారు. తాజాగా అదే పార్టీకి చెందిన రాష్ట్ర అధికార ప్రతినిధి, కరీంనగర్ నేత బండి సంజయ్ బీజేపీకి గుడ్‌బై చెప్తున్నట్టు ప్రకటించారు. ఇక ఆపార్టీకే చెందిన సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి నాగం జనార్థన్‌రెడ్డి ఉగాది తర్వాత బీజేపీని వీడుతానని ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పార్టీ రాష్ట్ర నాయకత్వం తీవ్ర తర్జన భర్జనలు పడుతోంది. 2019లో రాష్ట్రంలో అధికారం మాదే అని ప్రకటించుకుంటున్న ఆపార్టీకి ఈ గుడ్‌బైలు తలనొప్పిగా మారాయి. ఇతర పార్టీల నుంచి చేరికల సంగతి దేవుడెరుగు...ఉన్న నేతల్ని ఎలా కాపాడుకోవాలనే సందిగ్ధంలో పార్టీ నాయకత్వం తలమునకలౌతోంది. ఈ పరిణామాలపై బీజేపీ జాతీయ అధ్యక్షులు అమిత్‌షా కూడా ఆరా తీసినట్టు సమాచారం. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో తెలంగాణపై పెట్టుకున్న ఆశలు నెరవేరే పరిస్థితులు కనిపించట్లేదని ఆయన ఇటీవల బీజేపీ రాష్ట్ర నాయకత్వాన్ని సుతిమెత్తగానే హెచ్చరించినట్టు తెలిసింది. ఇక బండి సంజయ్ రాజీనామాతో పార్టీలో ఆధిపత్యపోరు మరోసారి బహిర్గతమైంది. బండి సంజయ్ కరీంనగర్ జిల్లాకు చెందిన వారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధర్‌రావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు రామకృష్ణారెడ్డి కూడా అదే జిల్లాకు చెందిన వారు. వీరు తమ అనుచరుడు, పార్టీ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరెడ్డిని ప్రోత్సహిస్తూ...సంజయ్‌ను చిన్న చూపు చూస్తున్నారనేది ప్రధాన ఆరోపణ. ఈ నేపథ్యంలోనే శ్రీనివాసరెడ్డికి, సంజయ్‌కు మధ్య కొద్దికాలంగా విభేదాలు పెరిగాయి. ఇటీవలి కాలంలో ఇవి మరింత ముదిరి, పార్టీ కార్యక్రమాలకు సంజయ్‌ను ఆహ్వానించట్లేదు. ఇవే విషయాల్ని పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కె లక్ష్మణ్‌కు మొరపెట్టుకోవాలని సంజయ్ శనివారం రాత్రి కార్యకర్తలతో కలిసి హైదరాబాద్ లోని పార్టీ రాష్ట్ర కార్యాలయానికి వచ్చారు. ఆదివారం సంజయ్ చెప్పిందంతా విన్న లక్ష్మణ్...పార్టీలో సర్దుకుపోవాలని, మరోసారి సమస్యలు రాకుండా చూస్తానని చెప్పుకొచ్చారు. ఈ సమాధానంతో సంతృప్తి చెందని సంజయ్ అక్కడికక్కడే తాను పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. అదే విషయాన్ని అక్కడే మీడియాకు కూడా చెప్పారు. జిల్లా రాజకీయాలు తనను తీవ్రంగా బాధిస్తున్నాయని, అక్కడి పరిస్థితుల గురించి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడికి చెప్పుకుందామని వస్తే...అవమానకరంగా మాట్లాడారని ఆయన చెప్పుకొచ్చారు. పార్టీకి రాజీనామా చేసానని, రాజకీయాల నుంచే తప్పుకుంటున్నానని ఆయన ప్రకటించారు. దీనిపై లక్ష్మణ్ స్పందిస్తూ ...ఇదంతా 'టీ కప్పులో తుఫాను' లాంటిదని కొట్టివేశారు. ప్రస్తుతం పార్టీలో జరుగుతున్న 'గుడ్‌బై'ల పర్వంపై తీవ్ర చర్చ నడుస్తోంది. ఇతర పార్టీల నుంచి వలసల్ని ప్రోత్సహించి, పార్టీని బలోపేతం చేసుకొనే సంగతి ఎలా ఉన్నా... 'కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడినట్టు' రాష్ట్ర పార్టీ పరిస్థితి తయారైంది.

మార్పు కోసమే రాజకీయపార్టీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర సాధనలో ముఖ్య భూమిక పోషించిన టీజేఏసీ.. ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా త్వరలో రాజకీయ పార్టీగా ఆవిర్భవించనున్నట్టు ప్రొఫెసర్ కోదండరామ్ ప్రకటించారు. రాజకీయ పార్టీ పెట్టాలని వస్తున్న డిమాండ్‌ను సమ్మతిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఆదివారం హైదరాబాద్ శివారులోని తుర్కయాంజాల్‌లో టీజేఏసీ విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీజేఏసీ చైర్మెన్ కోదండరాం మాట్లాడారు. పార్టీ ఏర్పాటు చేసే పరిస్థితి వస్తుందని ఊహించలేదని.. రాజకీయాల్లో మార్పు కోసమే పార్టీ పెడుతున్నట్టు స్పష్టం చేశారు. అందరి అభిప్రాయాలతో త్వరలో పార్టీ పేరును ప్రకటిస్తామన్నారు. సంపాదనే లక్ష్యంగా కొంతమంది రాజకీయాలను ఎంచుకుంటున్నారని అన్నారు. తమకు పోరాటం, రాజకీయం తెలుసునని నిరూపిస్తామన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజల ఆకాంక్షలు నెరవేరాలంటే రాజకీయ వేదిక అవసరమని గుర్తించినట్టు తెలిపారు. అదే సమయంలో టీజేఏసీ కూడా కొనసాగుతుందని స్పష్టంచేశారు. రైతు సమస్యలు, నిరుద్యోగం, ఉపాధి కల్పన, భూ నిర్వాసితుల సమస్యల పరిష్కారమే పార్టీ ఎజెండా అని తెలిపారు. రైతు సమస్యలపై ప్రభుత్వానికి నివేదికలు ఇచ్చినా స్పందించడం లేదన్నారు. తెలంగాణ వస్తే మనోడే కుర్చీలో కుర్చుండాలని భావించామని.. కానీ, పరిణామాలు అందుకు విరుద్ధంగా జరుగుతున్నాయని చెప్పారు. ప్రజా సమస్యలు పోవాలంటే ఇంకా గట్టిగా కొట్లాడాల్సి ఉందన్నారు. ఈ నెల 17న రైతు సమస్యలపై నిరుద్యోగులతో లేఖలు రాయిస్తామన్నారు. రైతుల కోసం పెద్ద పోరాటమే చేయాలని నిర్ణయించామన్నారు. మార్కెట్‌లో రైతు దోపిడీకి గురవుతున్నాడని.. వారి పిల్లలకు ఉచితంగా విద్య, వైద్యం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతు కమిషన్ ఏర్పాటుపై సర్కారు స్పందించాలన్నారు. రాష్ట్రంలో తిండి పెడుతున్న రైతులే బతకలేని పరిస్థితులు దాపురించాయన్నారు. వలస వెళ్లి బతికితే శవాలు వస్తున్నాయ్ కానీ పైసలు రావడంలేదన్నారు. రైతు సమస్యలపై అనేక సార్లు ముఖ్యమంత్రిని, సంబంధిత మంత్రిని కలిసినా ప్రయోజనం లేకపోయిందన్నారు. ప్రభుత్వం దళారుల పక్షాన ఉంటుందా లేక రైతుల పక్షాన ఉంటుందో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.



ఉద్యమకారులపై నిర్బంధకాండ-గద్దర్

అంతకుముందు టీజేఏసీ విస్తృత సమావేశంలో పాల్గొనేందుకు వచ్చిన ప్రజా గాయకుడు గద్దర్ విలేకరులతో మాట్లాడారు. అయితే ఆయన టీజేఏసీ ఆధ్వర్యంలో రాజకీయపార్టీ ఏర్పాటవుతుందని మాత్రమే చెప్పారు. ఆపార్టీకి మద్దతుపై ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు. ఉత్పత్తి చేసే రైతు వినియోగదారుడిగా మారుతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో 3,432 మంది రైతులు ఆత్మహత్య చేసుకుంటే 798 మందినే ప్రభుత్వం గుర్తించిందని మండిపడ్డారు. ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు రూ.6 లక్షల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజలు నాగలితో దున్నుతారని.. తేడా వస్తే దానినే మడతపెట్టి కొడతారని హెచ్చరించారు. కోదండరామ్‌ను అరెస్ట్ చేసిన తీరు తనను ఎంతగానో కలచివేసిందన్నారు. 2019 నాటికి రైతులు, యువత ప్రభుత్వంపై నిశ్శబ్ద విప్లవం సష్టించాలని పిలుపునిచ్చారు. ఉద్యమకారులైన తమపై బతికి ఉండగానే పాలకులు నిర్బంధకాండను ప్రయోగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు ఏ ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లినా గౌరవం లేకుండా పోయిందన్నారు. నకిలీ విత్తనాలు అమ్మే వారు బంగ్లాలు కడుతుంటే.. అదే విత్తనాలు కొన్నవారు రోడ్డున పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం రైతుల పక్షం కాకుండా కంపెనీల తరపున ఉన్నదని మండిపడ్డారు. రాష్ట్రంలో పత్తి తప్ప వేరే పంట వేయలేని పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. రైతు కుటుంబాల విద్యార్థులకు ఉచిత విద్య, వైద్యం అందించాలి. సమావేశంలో టీ జేఏసీ నాయకులు రఘు, పురుషోత్తం, న్యాయవాది రచనారెడ్డి, తీన్‌మార్ మల్లన్న (నవీన్)తోపాటు వివిధ జిల్లాల నుంచి వచ్చిన టీ జేఏసీ నాయకులు భారీగా పాల్గొన్నారు.

చందమామ దరికి చంద్రయాన్-2..

ఇస్రో ప్రణాళికలు

ముంబయి: వంద స్వదేశీ ఉపగ్రహాలను అంతరిక్షంలోకి పంపి దేశ కీర్తి ప్రతిష్టలను ప్రపంచానికి చాటి చెప్పిన భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) మరో అద్భుతం సృష్టించడానికి సిద్ధమవుతుంది. చంద్రయాన్-2 మిషన్‌ను చంద్రుని దక్షిణ ధృవం దగ్గర ల్యాండ్ చేయడానికి ఇస్రో ప్రణాళికలు రచిస్తున్నది. ఈ విషయాన్ని ఇస్రో మాజీ చైర్మెన్ ఎస్ కిరణ్‌కుమార్ ఆదివారం వెల్లడించారు. 'చంద్రుని పై చంద్రయాన్-2 ల్యాండ్ కావడానికి రెండు ప్రదేశాలను గుర్తించాం. అందులో ఒకటి ఎంపిక చేయాల్సి ఉంది. ఈ ప్రదేశంలో ఇంతకుముందు ఏ ఉపగ్రహమూ ల్యాండ్ కాలేదు. ప్రస్తుతం ల్యాండింగ్ అనుకరణలు తమిళనాడులోని మహేంద్రగిరి వద్ద ఇస్రోకు చెందిన ద్రవ చోదక వ్యవస్థ కేంద్రంలో జరుగుతున్నాయి. 70 నుంచి 80 మీటర్ల ఎత్తులో ఉన్నప్పుడే మిషన్ సాఫ్ట్ ల్యాండ్ కావడానికి ఇది ప్రాథమిక రూపం. చంద్రయాన్-2 మిషన్‌కు సంబంధించిన హార్డ్‌వేర్ తయారవుతుంది. ఈ ఏడాది మొదటి లేదా రెండో త్రైమాసికంలో మిషన్‌ను ప్రయోగించడానికి ప్రయత్నిస్తున్నాం' అని కిరణ్‌కుమార్ వెల్లడించారు. చంద్రయాన్-2 ను మోసుకెళ్లే జీఎస్ఎల్‌వీ మార్క్2 వాహకనౌకలో ఆర్బిటార్, ల్యాండర్, ఆరు చక్రాల రోవర్ ఉంటాయి. గత నెల 12 న కార్టోశాట్-2 సహా 30 ఉపగ్రహాలను అంతరిక్షంలోకి పంపి వంద స్వదేశీ ఉపగ్రహాలను అంతరిక్షంలోకి పంపిన ఘనతను ఇస్రో సాధించిన విషయం తెలిసిందే.



కదంతొక్కిన ఎర్రసైన్యం



సీపీఐ(ఎం) శ్రేణుల్లో స్ఫూర్తి నింపిన కవాతు

- వేలాదిగా తరలొచ్చిన రెడ్‌షర్ట్ వాలంటీర్లు
- ర్యాలీని ప్రారంభించిన బివి.రాఘవులు
- నల్లగొండ కాదు ఎర్రకొండ అన్న ఏచూరి

నవతెలంగాణ-నల్లగొండ ప్రతినిధి

నల్లగొండలో ఎర్రదండు కవాతు కదం తొక్కింది. 'అదే అదే ఎర్ర పతాక జైత్రయాత్ర సాగుతుందిరా! పదే పదే రణం కోసం నగారా మోగుతుందిరా..!!' అంటూ ఎర్ర సైన్యం కదిలింది. 'ఎవ్వడురా కూసిందీ ఎర్ర జెండా చచ్చిపోయిందని! ఏ వెదవరా తెగ వాగిందీ ఎర్ర జెండా నేలకొరిగిందని..!!' అంటూ గర్జించింది. 'అజేయం సోషలిజం అజేయం...అప్ అప్ సోషలిజం... డౌన్ డౌన్ క్యాపిటలిజం' అంటూ నినదిస్తూ ఎర్రసేన ర్యాలీ ముందుకు సాగింది. ఐదు కిలోమీటర్ల వరకు కవాత్ కార్యకర్తల్లో స్ఫూర్తి నింపింది. అచెంచల విశ్వాసాన్ని అందజేసింది. సీపీఐ(ఎం) రాష్ట్ర ద్వితీయ మహాసభ ఆదివారం నల్లగొండ జిల్లాలో ప్రారంభమైంది. ఈ సందర్భంగా రెడ్‌షర్ట్ వాలంటీర్లు కవాతు నిర్వహించారు.

నల్లగొండ జిల్లా వ్యాప్తంగా వేలాది మంది కార్యకర్తలు స్థానిక మేకల అభినవ్ స్టేడియానికి ఉదయమే చేరుకున్నారు. ర్యాలీని స్టేడియంలో సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు జెండా ఊపి ప్రారంభించారు. రాఘవులుతో పాటు పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు, ఎస్.వీరయ్య, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, బి.వెంకట్, నంద్యాల నర్సింహ్మారెడ్డి, డిజి.నర్సింహారావు, ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, సాయిబాబుతో పాటు పలువురు రాష్ట్ర, జిల్లా నాయకులు ప్రదర్శన ముందు వరుసన నడిచారు. ఎర్ర చొక్కా... ఖాకీ పాయింట్ ధరించిన కార్యకర్తలు వారిని అనుసరించారు. అభినవ్ స్టేడియం నుంచి గొల్లగూడ, సుభాస్ సెంటర్, గడియారం సెంటర్, ఎన్జీ కళాశాల, వివేకానంద విగ్రహం సెంటర్ మీదుగా సాగిన కవాతు లక్ష్మీగార్డెన్‌కు చేరుకుంది. ఐదు కిలో మీటర్ల పొడవు సాగిన కవాతుతో నల్లగొండ..ఎర్రకొండను తలపించింది. మహిళలు సైతం కవాతులో పాల్గొన్నారు. పండు ముసలి మొదలకుని పిల్లల వరకు ఎర్రజెండాలెత్తి కవాతులో కలిసి నడిచారు. కోలాటాల, డప్పు, బ్యాండు వాయిద్య కళా బృందాలు ఆడుతూ పాడుతూ ర్యాలీగా సాగారు. గడియారం సెంటర్‌కు కవాతు రాగానే సీపీఐ'(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, కేంద్ర నాయకులు డాక్టర్ హేలమత, అరుణ్‌కుమార్ అభివాదం చేశారు. అనంతరం లక్ష్మీగార్డెన్‌లో జరిగిన బహిరంగ సభలో సామాజికన్యాయం, సమగ్రాభివృద్ధి కోసం సీపీఐ(ఎం) చేస్తున్న పోరాటాల్ని నాయకులు తమ ప్రసంగాల్లో తెలిపారు. నాయకుల ఉపన్యాసాల్ని కార్యకర్తలు శ్రద్ధగా వినడమేగాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాల్ని ఎండగట్టినప్పుడు చప్పట్లు కొట్టి ఉత్తేజాన్ని వ్యక్తం చేశారు. క్రమ శిక్షణతో కదం తొక్కిన కార్యకర్తల ఉత్సాహం ఉత్తేజితుల్ని చేసిందని సీతారాం ఏచూరి అన్నారు. 'నల్లగొండ కాదు ఎర్రగొండ. నేను చిన్నప్పుడు నల్లగొండ అని పిలువకపోయేది. ఎర్ర కొండ అనేది. కవాతు తొక్కిన కార్యకర్తల్ని చూశాక నాటి ఎర్రకొండగా నల్లగొండ మారుతుందనే విశ్వాసం నాలో కలుగుతున్నది. వీర తెలంగాణ విప్లవ పోరాట వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్న నల్లగొండ పోరాటాల ఖిల్లా. ఆర్థిక దోపిడీ... సామాజిక అణచివేతకు గురవుతున్న వాళ్ల పక్షాన బహుజన తెలంగాణ సాధన కోసం సాగిస్తున్న పోరాటాలు దేశానికే దిక్సూచిగా నిలుస్తాయనే నమ్మకం కలుగుతున్నది' అంటూ ఏచూరి చేసిన ప్రసంగం పార్టీ శ్రేణుల్ని ఉత్తేజ పరిచింది.

పోరుగడ్డ వేదికగా.. పొలికేక...

సీపీఐ (ఎం) ద్వితీయ మహాసభలు ఆదివారం నల్లగొండలోని నర్రా రాఘవరెడ్డి నగర్‌లో అత్యంత ఉత్సాహ, ఉత్తేజ వాతావరణంలో ప్రారంభమయ్యాయి. రాష్ట్రంలోని 31 జిల్లాల నుంచి తరలొచ్చిన ప్రతినిధులు, పరిశీలకులు, వామపక్ష శ్రేయోభిలాషులు, కార్యకర్తల నడుమ ఆదర్శ కమ్యూనిస్టు, సీపీఐ (ఎం) మాజీ ఎమ్మెల్యే కుంజా బొజ్జి అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. సీపీఐ (ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు, కేంద్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, ఏపీ కార్యదర్శి పి.మధు, కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.వీరయ్య, సీహెచ్ సీతారాములుతోపాటు పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, ప్రతినిధులందరూ అమరవీరులకు జోహార్లర్పించారు. అనంతరం ప్రతినిధుల సభ ప్రారంభమైంది. అంతకుముందు నల్లగొండ పట్టణంలో ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించిన ఎర్రదండు కవాతు ఆద్యంతం కమ్యూనిస్టుల గత వైభవాన్ని గుర్తుకుతెచ్చింది. దాదాపు 5 వేల మందితో నిర్వహించిన ఈ ర్యాలీ.. నల్లగొండ పేరును ఎర్రగొండగా తలపింపజేసింది. ర్యాలీ అగ్రభాగాన సీపీఐ (ఎం) అగ్రనేతలంతా పాల్గొని కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపారు.

బీఎల్ఎఫ్‌లోకి సీపీఐ రావాలి

జానకి రాములు



నర్రా రాఘవరెడ్డి నగర్ (నల్లగొండ) - ప్రత్యేక ప్రతినిధి

బహుజన లెఫ్ట్ ఫ్రంట్ (బీఎల్ఎఫ్)లోకి సీపీఐ రావాలని రెవల్యూషనరీ సోషలిస్టు పార్టీ (ఆరెస్పీ) తెలుగు రాష్ట్రాల కార్యదర్శి జానకి రాములు అన్నారు. సీపీఐ(ఎం) రాష్ట్ర ద్వితీయ మహాసభల్లో ఆయన సౌహార్ద సందేశమిచ్చారు. సీపీఐ, సీపీఐ(ఎం)తోపాటు ఇతర వామపక్ష పార్టీలన్నీ కలిసి 2019 ఎన్నికలకు వెళ్లాలని చెప్పారు. కాంగ్రెస్, టీడీపీ, టీఆర్ఎస్ పాలన చూశామని, ఒక్కసారి వామపక్షాల పాలనకు అవకాశమివ్వాలని ప్రజల్లోకి వెళ్దామన్నారు. వామపక్షాలన్నీ ఏకతాటిపై ఉంటే తెలంగాణలో ఎర్రజెండా ఎగరడం ఖాయమని అన్నారు. ఈ దిశగా సీపీఐ నాయకులు ఆలోచించి బీఎల్ఎఫ్‌లోకి వచ్చేలా నిర్ణయం తీసుకోవాలని కోరారు.

వామపక్షాల ఐక్యత బలపడాలి : బండా సురేందర్‌రెడ్డి



వామపక్షాల ఐక్యత మరింత బలపడాలని ఆలిండియా ఫార్వర్డ్‌బ్లాక్ (ఏఐఎఫ్‌బీ) రాష్ట్ర కార్యదర్శి బండా సురేందర్‌రెడ్డి చెప్పారు. వామపక్ష పార్టీలు చీలికలుపేలికలుగా మారితే సమాజానికి నష్టం కలుగుతుందని అన్నారు. వామపక్షాలు ఐక్యంగా ఉండి మార్క్సిజం, లెనినిజం భావజాలాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు.

హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాలు : మురహరి



ప్రజాతంత్ర హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని ఎస్‌యూసీఐ(సీ) రాష్ట్ర నాయకులు మురహరి విమర్శించారు. మార్క్సిజం, లెనినిజం వంటి సైద్ధాంతిక అంశాలను ప్రస్తుత పరిస్థితులకు అన్వయించాలని సూచించారు. ఐక్య ఉద్యమాలు నిర్మించడం ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయని చెప్పారు.

దొరల పాలనకు చరమగీతం పాడాలి : రాజేష్



రాష్ట్రంలో సీఎం కేసీఆర్ దొరల పాలన సాగిస్తున్నారని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి రాజేష్ విమర్శించారు. ప్రశ్నించే గొంతులను అణగదొక్కుతున్నారని చెప్పారు. నిరంకుశంగా, నిర్బంధాలు ప్రయోగిస్తున్నారని అన్నారు. ప్రభుత్వ భూములను ప్రయివేటు కంపెనీలకు ధారాదత్తం చేస్తున్నారని విమర్శించారు. తెలంగాణ సాయుధ పోరాటం స్ఫూర్తితో దొరల పాలనకు చరమగీతం పాడాలని అన్నారు.

జాతీయ స్థాయిలోనూ లెఫ్ట్ ఫ్రంట్..

ఎంసీపీఐ (యు) రాష్ట్ర కార్యదర్శి తాండ్రకుమార్



రాష్ట్రంలో బీఎల్ఎఫ్‌ను ఏర్పాటు చేసిన విధంగానే జాతీయ స్థాయిలో కూడా లెఫ్ట్ ఫ్రంట్‌ను ఏర్పాటు చేయాలని ఎంసీపీఐ (యు) రాష్ట్ర కార్యదర్శి తాండ్రకుమార్ కోరారు. రాష్ట్రంలో సీపీఐ (ఎం) చొరవ తీసుకుని.. బీఎల్ఎఫ్‌ను ఏర్పాటు చేయటం అభినందనీయమని అన్నారు. ఈ ఫ్రంట్ ఆధ్వర్యాన ఉద్యమాలను ఉధృతం చేయాలని సూచించారు.

ఆధునిక నిజాంలను కూల్చడమే లక్ష్యం

- సామాజిక న్యాయ ఎజెండానే బీఎల్ఎఫ్ బలం
- వామపక్షాలు ఏకమవుతాయి..
- నల్లగొండ గాలిలో పోరాటాలకు ఊపిరిలూదే శక్తి ఉంది
- గిట్టుబాటు ధరివ్వకుండా రైతు ఆత్మహత్యల్ని ఆపలేం
- సీపీఐ(ఎం) బహిరంగ సభలో తమ్మినేని వీరభద్రం



నర్రా రాఘవరెడ్డి నగర్ నుంచి నల్లగొండ ప్రతినిధి

"28 పార్టీలతో ఏర్పడిన బీఎల్ఎఫ్‌కు ఇప్పటికిప్పుడు టీఆర్ఎస్, కాంగ్రెస్‌లను ఓడించే శక్తి లేకపోవచ్చు. కానీ..! సామాజిక శక్తులు ఐక్యమైతే ఆ ప్రభంజనంలో పాలక పార్టీలు కొట్టుకుపోక తప్పదు.. బీఎల్ఎఫ్ అసలు బలం సామాజిక న్యాయమేనని ఎజెండాలోనే ఉంది. ఆధునిక నిజాములైన కేసీఆర్... కాంగ్రెస్ నేతలు బలమైన శక్తివంతులే కావచ్చు.. అయినా.. వారిని మట్టికరిపించేందుకు బీఎల్ఎఫ్‌లో వామపక్షాలు ఏకమవుతాయనే విశ్వాసముంది. వీర తెలంగాణ విప్లవ పోరాటం సాగిన ఈ నేలలో ఎర్ర రక్తముంది.. ఈ గాలిలో పోరాటాలకు ఊపిరిలూదే శక్తి ఉంది" అని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. నల్లగొండలో ఆదివారం ప్రారంభమైన సీపీఐ(ఎం) రాష్ట్ర ద్వితీయ మహాసభ సందర్భంగా లక్ష్మీ గార్డెన్‌లో నిర్వహించిన బహిరంగలో ఆయన మాట్లాడారు.

బలవంతంగా భూముల్ని లాక్కోవడం తప్పని, అవసరమైన భూముల్ని సేకరిస్తే చట్ట ప్రకారం పరిహారం ఇవ్వాలని మల్లన్నసాగర్ నిర్వాసితులు 654 రోజులుగా నిరాహార దీక్షలు చేయడం అభినందనీయమన్నారు. అలాంటి పోరాటాలకు సీపీఐ(ఎం) నాయకత్వం వహించిందన్నారు. రూ.17 వేల కోట్ల రుణమాఫీ, రూ.4 వేల పెట్టుబడి పథకాలు అమలు చేసినా రైతు ఆత్మహత్యలు ఆగట్లేదంటే వ్యవసాయ సంక్షోభాన్ని నివారించే మార్గం ఏమిటో కేసీఆర్‌కు అర్థంకాలేదని అన్నారు. మార్కెట్‌లో దళారుల దోపిడీని అరికట్టి గిట్టుబాటు ధర ఇవ్వకుండా రైతు ఆత్మహత్యల్ని నివారించలేమన్నారు.

తెలంగాణలో కుల సర్పం పడగ విప్పి బుసలు కొడుతోందన్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ గూండాలు చిన్నకందుకూరులో సంక్రాంతి రోజున ఎద్దును కోసుకుతిన్నారనే నెపంతో కొట్టారన్నారు. రజక యువకుడు రెడ్డి అమ్మాయిని ప్రేమించి పెండ్లి చేసుకుంటే కుట్ర చేసి హత్య చేశారన్నారు. మంథనిలో మధుకర్‌ను హత్య చేశారని గుర్తు చేశారు. ఇలాంటి సామాజిక అంశాలపై సీఎం కేసీఆర్ ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. కేసీఆర్ వచ్చాక ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్లు అటకెక్కాయన్నారు. మైనార్టీ, బీసీ సబ్‌ప్లాన్ చేస్తానని చెప్పి విస్మరించారన్నారు. గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్ల హామీ ఇచ్చి ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. తాము మహాజన పాదయాత్ర చేయగానే స్పందించి ఎంబీసీ కార్పొరేషన్ ప్రకటించి వెయ్యి కోట్లు ప్రకటించిన కేసీఆర్ రెండేండ్లయినా పైసా కేటాయించలేదన్నారు. ఏండ్ల తరబడిగా సాగు చేసుకుంటున్న పోడు భూముల్లోంచి గిరిజన బిడ్డల్ని గెంటేశారన్నారు. గిరిజనుల మధ్య చిచ్చు పెట్టి లబ్దిపొందేందుకు టీఆర్ఎస్ ప్రయత్నించిందన్నారు. కార్పొరేట్ శక్తుల్లో విద్య, వైద్యం బంధీ అయ్యాయన్నారు. అట్టడుగు వర్గాలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఎంబీసీ, మైనార్టీ, అగ్రకులాల్లోని పేదలంతా బహుజనులే అవుతారన్నారు. మహిళా బిల్లుకు అందరూ మద్దతు తెలుపుతున్నా ఇన్నాళ్లుగా బిల్లు ఎందుకు రావట్లేదని ప్రశ్నించారు. ఇలాంటి సమస్యలపై మహాసభలో చర్చించి పోరాట కర్తవ్యాల్ని రూపొందించనున్నట్టు తెలిపారు. సమస్యల్ని పరిష్కరించాలని ఎన్నో పోరాటాలు చేసినా పరిష్కారం కాలేదన్నారు. అందుకే చేయని ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు సిద్ధమైనట్టు తెలిపారు. ఇన్నాళ్లుగా వాన్ని ఓడించేందుకు వీన్ని గెలిపించడం, వీన్ని ఓడించేందుకు వాన్ని గెలిపించడం జరిగిందన్నారు. ఇక నుంచి వాన్నీ, వీన్నీ ఓడించడమే సీపీఐ(ఎం) రాజకీయ లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు.

పేదల రాజ్యం స్థాపించాలి :చెరుపల్లి సీతారాములు



వామపక్షాలు, సామాజిక శక్తులు ఏకమై పేదల రాజ్యం స్థాపించాలని బహిరంగ సభలో సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు అన్నారు. 1998లో తొలిసారిగా నల్లగొండలో పార్టీ రాష్ట్ర మహాసభ జరగ్గా, 20ఏండ్ల తర్వాత తెలంగాణ రాష్ట్రంలో మళ్లీ మహాసభకు నల్లగొండ వేదిక కావడం నాటి ఉద్యమాలకు దిక్సూచిగా నిలుస్తుందన్నారు. ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిని ప్రజల ముందు ఉంచాలనే ఆలోచనతో బహుజన లెఫ్ట్‌ఫ్రంట్‌ను ఏర్పాటు చేశామన్నారు. ప్రత్యామ్నాయ విధానాలతో ముందుకెళ్లి ప్రజా ఉద్యమాలను సాగించాలని పిలుపునిచ్చారు. వర్గ, సామాజిక ఉద్యమాలు స్థాపించేందుకు మరిన్ని ప్రజా ఉద్యమాలు చేయాలన్నారు. నగర ప్రాంతాల్లో ఉండే మతోన్మాద చర్యలు నేడు గ్రామస్థాయికి చేరుకున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ శక్తులు దళిత, మైనార్టీ, బడుగు, బలహీన వర్గాలపై దాడులు చేస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయన్నారు. బీజేపీ ఆగడాలను ప్రశ్నించడంలో టీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. తెలంగాణలో భవిష్యత్‌లో బీఎల్ఎఫ్ ప్రముఖ పాత్ర పోషిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఊరూరా ఎర్రజెండా జాతర జరపాలి

బహిరంగ సభలో మల్లుస్వరాజ్యం



నవతెలంగాణ-మిర్యాలగూడటౌన్

తెలంగాణ ప్రజల సెంటిమెంట్‌ను ఆసరా చేసుకుని రాజ్యమేలుతున్న కేసీఆర్ ప్రజా వ్యతిరేక విధానాలపై చాటిచెప్పేందుకు ఊరూరా ఎర్రజెండా జాతర జరపాలని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యురాలు మల్లు స్వరాజ్యం పిలుపునిచ్చారు. లక్ష్మీగార్డెన్ ఫంక్షన్‌హాల్ వద్ద నిర్వహించిన సీపీఐ(ఎం) రాష్ట్ర ద్వితీయ మహాసభ బహిరంగ సభలో ఆమె ప్రసంగించారు. బంగారు తెలంగాణ అంటూ గుళ్లగోపురాలు తిరుగుతూ రాష్ట్ర ధనాన్ని హుండీల్లో పోస్తున్న కేసీఆర్‌కు చరమగీతం ఎడాల్సిన అవసరమొచ్చిందన్నారు. నాడు దొరలు రాజ్యమేలితే.. నేడు కంపెనీలు రాజ్యమేలుతున్నాయన్నారు. జనం కోసం ఎర్ర జెండా పుట్టిందని గుర్తు చేశారు. ఏనాడూ అధికారం కోసం ఎర్రజెండా పాకులాడలేదన్నారు. బహుజన తెలంగాణ సాధన కోసం అన్ని వర్గాల ప్రజలూ ఉద్యమ బాట పట్టాలన్నారు.

రానున్న కాలంలో రాజీలేని పోరాటాలు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ



నర్రా రాఘవరెడ్డి నగర్ నుంచి నవతెలంగాణ ప్రతినిధి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై రానున్న కాలంలో వామపక్షాలు రాజీలేని పోరాటాలు నిర్వహించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. తెలంగాణలో కమ్యూనిస్టులకు ఎంతో చరిత్ర ఉందని.. ఎన్నో త్యాగాలు వారి సొంతమని చెప్పారు. వాటిని పుణికి పుచ్చుకోవటం ద్వారా పోరాటాలను ద్విగుణీకృతం చేయాలని సూచించారు. ఆదివారం ప్రారంభమైన సీపీఐ (ఎం) ద్వితీయ మహాసభలో ఆయన సౌహార్ద సందేశమిస్తూ.. తెలంగాణలో ప్రస్తుతం మాఫియాల రాజ్యం నడుస్తున్నదని చెప్పారు. కేసీఆర్‌లాంటి నిరంకుశ ముఖ్యమంత్రి 29 రాష్ట్రాల్లో ఎక్కడా లేడని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎర్రజెండాలను మరింతగా అణచివేసేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. కేసీఆర్ కమ్యూనిస్టులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో వామపక్షాలు మరింతగా ఐక్యంగా పోరాడాలని సూచించారు. కలిసొచ్చే శక్తులను కలుపుకుని టీఆర్ఎస్ అరాచకాలకు అడ్డుకట్ట వేయాలని పిలుపునిచ్చారు.

లక్ష బుల్లెట్ల కంటే శక్తివంతమైనది ప్రజాకళ

- రెండవరోజు వీధి నాటకోత్సవాలు
- డప్పు కొట్టి షాట్‌ను ప్రారంభించిన మాదాల రవి

నవతెలంగాణ-క్లాక్‌టవర్

అన్నింటి కంటే విలువైనది.. లక్ష బుల్లెట్ల కంటే శక్తివంతమైనది ప్రజాకళ అని సినీ హీరో మాదాల రవి అన్నారు. సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభ సందర్భంగా ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఎన్జీ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న రాష్ట్ర రెండో వీధి నాటకోత్సవాలు ఆదివారం కొనసాగాయి. కళాకారులు డప్పులు, కోలాటాలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మాదాల రవి, నాటక రచయిత, డైరెక్టర్ పి.దేవి డప్పు కొట్టి షాట్‌ను ప్రారంభించారు. అనంతరం రవి మాట్లాడుతూ.. ఉద్యమాలకు పుట్టినిల్లు, పోరాటాల గడ్డ, విప్లవ వీరుల పుట్టినిల్లు నల్లగొండ జిల్లాలో వీధి నాటకోత్సవాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. దేశం, రాష్ట్రంలో ఎక్కడ అన్యాయం, మోసం జరిగినా అక్కడ కళాకారులు ఉండాలని పిలుపునిచ్చారు. ప్రజా కళాకారులు కుట్రలు, మోసాలను చీల్చుకుంటూ ప్రజలను ప్రజాసమస్యల పట్ల పోరాటం చేసేదిశగా చైతన్యపర్చాలన్నారు. నాటి నుంచి నేటి వరకు వందలాది మందిని నటులు, డైరెక్టర్లను కళాకారులుగా ప్రజానాట్యమండలి తీర్చిదిద్దిందన్నారు. ఎందరో మహానుభావులు, ఆకాశ మార్గాన విహరిస్తున్న సినీ ప్రపంచాన్ని, యువతరాన్ని కదిలించిన యావత్ ప్రజానీకాన్ని తయారు చేసింది పీఎన్ఎం మాత్రమేనన్నారు.

ఎమ్మెల్యే సున్నం రాజయ్య మాట్లాడుతూ.. ఉద్యమాల గడ్డ నల్లగొండ జిల్లాపై సీపీఐ(ఎం)ద్వితీయ రాష్ట్ర మహాసభ సందర్భంగా ఈ వీధినాటకోత్సవాలు జరుగుతున్నాయన్నారు. మహాసభకు 31 జిల్లాల నుంచి వేలాది మంది తరలొచ్చారని చెప్పారు. రానున్నకాలంలో బీజేపీ, కాంగ్రెస్, టీఆర్ఎస్‌లకు భిన్నంగా నూతన ఒరవడిని సృష్టించేందుకు ప్రజా సమస్యలే అజెండాగా 28 పార్టీలతో బీఎల్ఎఫ్ ఏర్పడిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను నాటకాలు, పాటల రూపంలో ప్రజలకు కండ్లకు కట్టినట్టు వివరించారన్నారు. అనంతరం బేరీ నృత్యాన్ని యాదాద్రి జిల్లా కళాకారులు, ఆడపిల్ల బతుకు(ఒగ్గుకథ)ను నల్లగొండ జిల్లా, భగత్‌సింగ్ నాటకాన్ని నిజామాబాద్ జిల్లా కళాకారులు ప్రదర్శించారు. 'భారతమ్మ ఎక్కడ' కళారూపాన్ని నల్లగొండ జిల్లా వారు, 'మాటలే వరాల మూటలు' కళారూపాన్ని సంగారెడ్డి, 'రైతు' కళారూపాన్ని ఖమ్మం కళాకారులు ప్రదర్శించారు. 'యమకింకరుడు' కళారూపాన్ని రంగారెడ్డి జిల్లా కళాకారులు, 'గొర్రెలు తిరగబడ్డాయి' కళారూపాన్ని జనగాం జిల్లా కళాకారులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పీఎన్ఎం రాష్ట్ర కార్యదర్శి కట్ట నర్సింహా, రాష్ట్ర ఉపాధ్యక్షులు స్ఫూర్తి, బొర్ర వెంకన్న, వి.ఆనంద్, రాష్ట్ర సహాయ కార్యదర్శి మునగాల రమేశ్, రాష్ట్ర నాయకులు సదానందం, పీఎన్ఎం ఏపీ నాయకులు జగన్, టీమాస్ జిల్లా కన్వీనర్ నారి ఐలయ్య, పీఎన్ఎం జిల్లా అధ్యక్షుడు చంద్రమౌళి, జిల్లా కార్యదర్శి కూరెళ్ల శంకర్, ప్రముఖ చిత్రకారులు కూరెళ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.




మాట్లాడుతున్న మాదాల రవి

రాజ్యాంగం -ఓటు- రాజ్యాధికారం

దయ్యపు రాధాకృష్ణ

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలలో మేమంతా ఒక్కటేనన్న మానసిక భావన అన్నదా? ఉంటే వారి మధ్య సంబంధాలు, ఎలా ఉన్నాయి? మనమంతా ఒక్కటే, సమానమే అని ఒప్పుకునే, అంగీకరించే అనువైన వాతావరణం బీసీ కులాల్లో ఉన్నదా? ఎస్సీ, ఎస్టీలకు సమాన, సామాజిక స్థాయిని ఇవ్వడానికి సిద్ధపడే పరిస్థితి బీసీ కులాలకు లేదు. ఆధిపత్య కులాల మాదిరిగానే బీసీ మధ్యతరగతి వర్గం కూడా ఎస్సీ, ఎస్టీ సామాజిక సంబంధాలను, నాయకత్వాన్ని అంగీకరించే పరిస్థితి లేదు. అంతెందుకు ఎస్సీ, ఎస్టీ కులాల మధ్యే అనేక దొంతరలున్నాయి. వారు కూడా ఎస్సీ, ఎస్టీలమంతా సమానమేనని పైకి చెప్పినా ఆచరణలో పై కులాల అనుకరణే. అణగారిన కులాలలో ఆచారాలు, సాంప్రదాయాలు, నమ్మకాలు, విశ్వాసాలు, సంస్కృతులు భిన్నంగా ఉన్నా మనుషులుగా ఒకరినొకరు గౌరవించుకునే స్థాయి పెరగాలి. మానసిక సంబంధాలు బలపడాలి. అలా జరగాలంటే కలిసి పనిచేసే సందర్భంలోనే మనుషుల మధ్య సంబంధాలు "కుల బంధాల"కన్నా, "కుల గెరలను" అధిగమించి ఉంటాయి. ప్రజా, వర్గ ఉద్యమాలు జరిగిన ఆనేక ప్రాంతాలలో ఈ మార్పు కన్పిస్తుంది.



స్వతంత్ర్య భారతావనికి దిశానిర్దేశం చేయడానికి డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఆహర్నిశలు శ్రమించి రాజ్యాంగాన్ని మనకు అందించారు. ఈదేశ భవిష్యత్ రాజ్యాంగంలోనే ఉన్నదని, దానిని సక్రమంగా అమలు చేయడం ద్వారా ప్రజలకు మంచి ఫలితాలు అందించవచ్చని చెప్పారు. రాజ్యాంగాన్ని పక్కనపెట్టి సొంత ఎజెండాతో పరిపాలన చేస్తే దేశంలో వివిధ వర్గాల ప్రజల మధ్య ఆర్థిక, సామాజిక అంతరాలు పెరిగి, వైశమ్యాలకు దారితీసి దేశ సమగ్రత, సమాఖ్య స్ఫూర్తికి విఘాతం కలుగుతుందని హెచ్చరించారు. అంతేగాదు మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రజల అవసరాల మేరకు రాజ్యాంగంలో మార్పులు చేర్పులకు కూడా అవకాశం ఇచ్చారు.

70 ఏండ్ల స్వాతంత్ర్య భారతదేశాన్ని ఇప్పటిదాకా పాలిస్తూ వస్తున్నది ధనిక అగ్రవర్గాలే. ఈ దేశంలో అనాదిగా అంటరానివారుగా, ఉత్పత్తి కులాలుగా ఉన్నవారు సామాజిక అణచివేతకు, శ్రమదోపిడీకి గురవుతూ వస్తున్నారు. బ్రాహ్మణీయ భావజాలం ఉన్న పాలకుల రాజ్యాంగంలో కొన్ని అంశాలు అమలు చేస్తున్నా కుల అసమానతలు తగ్గడానికి, అంటరానితనం పోవడానికి కృషి చేయకపోగా, పేదలు మరింత నిరుపేదలుగా, ధనికులు మరింత సంపన్నులుగా అభివృద్ధి చెందుతున్నారు.

భగవద్గీత, బైబిల్, ఖురాన్ వంటి మత గ్రంథాల కంటే అత్యంత విలువైనది, పవిత్రమైనది భారత రాజ్యాంగం. రాజ్యాంగం ప్రకారం దేశ ప్రజలంతా సమానమే. అంటే రాజ్యాంగం కూడా దేశ ప్రజలందరిది. ఆర్థిక సామాజిక అసమానతలున్నా ఈ దేశంలో సమానత్వం సాధించడం కోసం దళితులు, గిరిజనులు, మహిళలు, వెనుకబడిన కులాలకు కొన్ని ప్రత్యేక అవకాశాలు (రిజర్వేషన్లు), రక్షణలు కల్పించడం జరిగింది. ఈ ప్రత్యేక అవకాశాల ద్వారా అట్టడుగు వర్గాల ప్రజల తలరాతలు పూర్తిగా మార్చబడ్డాయని చెప్పడానికి వీలులేదు. కానీ ఉన్నమేరకు ఆయా తరగతులలో విద్య, ఉద్యోగాలు, ప్రజాప్రతినిధులుగా ఉంటూ మధ్య తరగతి వర్గం కూడా ఏర్పాటైందన్నది ఎవ్వరూ కాదనలేరు. ప్రత్యేక అవకాశాలు కల్పించడంపై ఆధిపత్యకులాలే కాదు, ఆ అవకాశాలు ఉపయోగించుకుంటున్న అణగారిన కులాల మధ్య భిన్నమైన అభిప్రాయాలు ఉన్నాయి. దళితులు, గిరిజనుల చదువు తక్కువైనా, ప్రతిభ లేకున్నా ఉద్యోగాలొస్తాయి. వీరంతా ప్రభుత్వ దత్తపుత్రులని కొందరు హేళన చేస్తున్నారు.

తక్కువ జనాభా గల ఆధిపత్య కులాలు, ఎక్కువ జనాభాగల అణగారిన కులాల ఓట్లతో అధికారం చెలాయిస్తున్నాయి. సామాజిక, ఆర్థిక అసమానతలు పెంచిపోషిస్తున్నారు. అణగారిన వర్గాలకు ఓటు చైతన్యం కల్పించడం ద్వారా మన ఓట్లు మనమే వేసుకొని రాజ్యాధికారం చేపట్టాలని, రాజ్యాధికారమే అన్ని సమస్యలకు పరిష్కారమని దళిత, గిరిజన, కొంతమంది వెనుకబడిన వర్గాల మేధావులు, నాయకులలో బలంగా ఉంది. అయితే ఆ వర్గాలకు ఓటు చైతన్యం లేదనడానికి అవకాశమే లేదు. ఓటుకు సమస్యలకు మధ్య సంబంధం కూడా ఎరుకే. ప్రభుత్వాలు మారటం దీనికి ఉదాహరణగా చెప్పుకోవచ్చు. కాకపోతే అధికార మార్పిడి అనేది ఆధిపత్య, మనువాద పాలకుల మధ్యనే జరగడం ఆందోళన కల్గించే విషయంగా భావించాలి. మరి అణగారిన వర్గాల మధ్య ఐక్యతకు, ఓటు చైతన్యానికి ఆటంకాలు ఏమిటీ? కులమా, ఆర్థికమా, ప్రాంతమా, మతమా అని పరిశీలిస్తే అవసరాలు, సామాజిక సంబంధాలు మాత్రమే ఓటును ప్రభావితం చేస్తున్నాయని గత చరిత్ర తెలియజేస్తున్నది. అణగారిన వర్గాల అవసరాలను తీర్చుకునే, సామాజిక సంబంధాలను మెరుగుపర్చుకునే ఐక్యతను పెంపొందించుకోవాల్సిన అవసరమున్నది.

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలలో మేమంతా ఒక్కటేనన్న మానసిక భావన అన్నదా? ఉంటే వారి మధ్య సంబంధాలు, ఎలా ఉన్నాయి? మనమంతా ఒక్కటే, సమానమే అని ఒప్పుకునే, అంగీకరించే అనువైన వాతావరణం బీసీ కులాల్లో ఉన్నదా? ఎస్సీ, ఎస్టీలకు సమాన, సామాజిక స్థాయిని ఇవ్వడానికి సిద్ధపడే పరిస్థితి బీసీ కులాలకు లేదు. ఆధిపత్య కులాల మాదిరిగానే బీసీ మధ్యతరగతి వర్గం కూడా ఎస్సీ, ఎస్టీ సామాజిక సంబంధాలను, నాయకత్వాన్ని అంగీకరించే పరిస్థితి లేదు. అంతెందుకు ఎస్సీ, ఎస్టీ కులాల మధ్యే అనేక దొంతరలున్నాయి. వారు కూడా ఎస్సీ, ఎస్టీలమంతా సమానమేనని పైకి చెప్పినా ఆచరణలో పై కులాల అనుకరణే. అణగారిన కులాలలో ఆచారాలు, సాంప్రదాయాలు, నమ్మకాలు, విశ్వాసాలు, సంస్కృతులు భిన్నంగా ఉన్నా మనుషులుగా ఒకరినొకరు గౌరవించుకునే స్థాయి పెరగాలి. మానసిక సంబంధాలు బలపడాలి. అలా జరగాలంటే కలిసి పనిచేసే సందర్భంలోనే మనుషుల మధ్య సంబంధాలు "కుల బంధాల"కన్నా, "కుల గెరలను" అధిగమించి ఉంటాయి. ప్రజా, వర్గ ఉద్యమాలు జరిగిన ఆనేక ప్రాంతాలలో ఈ మార్పు కన్పిస్తుంది.

వర్గ దృక్పథం, అభ్యుదయ ఉద్యమాలలో పనిచేస్తున్న అగ్రకుల, బీసీ నాయకులు మాత్రమే కింది కులాల అస్తిత్వాన్ని గౌరవించడం, ఐక్యత గురించి మాట్లాడటం వారికోసం ఉద్యమాలు చేయడం జరుగుతున్నది. ఆర్థిక, సామాజిక వ్యత్యాసాలు ఎప్పుడూ కులాన్ని ఒక్కతాటిపై నిలబెట్టలేవు. భిన్నకులాల మధ్య సామాజిక సంబంధాలు బలపడకుండా, కుల, అస్తిత్వ ఉద్యమాలు బలపడటం మూలాన నా కులమే గొప్ప అనే వాదనలు తెరపైకి వచ్చి మానసిక, కుల బంధాలు కాస్త కులతత్వంగా మారటం వలన పైకులాలు, కింది కులాల సామాజిక సంబంధాలను అంగీకరించలేని పరిస్థితి నెలకొంటున్నది. ఇది అణగారిన వర్గాల మధ్య ఐక్యతకు ప్రధాన ఆటంకంగా తయారవుతున్నది. ఇక్కడ ఒక వాదన బలంగా జరుగుతున్నది. ఒక్క శాతం ఉన్న కులాలు ఒక్కటవుతున్నారు, రాజ్యాలు ఏలుతున్నారు, శాసిస్తున్నారని. నిజమే వారి సామాజిక, ఆర్థిక స్థాయి అత్యున్నత దశలో ఉన్నది. వారి ఐక్యతకు కులం, ఆర్థిక వ్యత్యాసాలు ఆటంకాలుగా లేవు. మరి ఎస్సీ, ఎస్టీ, బీసీల మధ్య సామాజిక, ఆర్థిక అసమానతలు ఐక్యతకు తీవ్ర ఆటంకాలుగా ఉన్నాయి. అసమానతలపై యుద్ధం చేయకుండా ఎస్సీ, ఎస్టీ, బీసీలు ఒక్కటయ్యే అవకాశం లేదు.

"కులం పునాదిగా జాతిని, నీతిని, రాజ్యాన్ని నిర్మించలేం" అని అంబేద్కర్ అన్నాడు. నేడు అదే కులాలను పునాదులుగా చేసుకొని కులాలు, ఉపకులాలు, గోత్రాల పేరిట, సంఘాలు పెట్టుకోవడం "మా కులమే గొప్ప, మేమే మహారాజులం" అని దడిగట్టుకోవడం వలన ఐక్యతతో నడవాల్సిన కులాలు తమ అస్తిత్వాన్ని కాపాడుకునే ప్రయత్నంలో అభిముఖంగా వెళ్లడం, అణగారిన కులాల ఐక్యతకు మరింత భంగం కలిగించడమే.

స్వేచ్ఛ, సమానత్వం లేని రాజ్యం సామాజిక స్థిరత్వాన్ని పొందలేదని అంటారు అంబేద్కర్. రాజ్యాంగం ద్వారా పొందాల్సిన హక్కులను అమలు చేయించుకోకుండా, సాధించుకోకుండా స్వేచ్ఛ, సమానత్వం సాధ్యం కాదు. వ్యక్తులకు పదవులిచ్చినంత మాత్రాన, అధికారమార్పిడి జరిగినంత మాత్రాన విధానాలలో మార్పులేకుండా ప్రజల జీవితాలలో మార్పును ఆశించలేం. అణగారిన వర్గాల ఐక్యతకు ఆటంకాలైన మతతత్వ భావజాలానికి సరళీకరణ ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా, సంఘటితంగా నిలబడాలి. సామాజిక న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం ద్వారా అణగారిన ప్రజలంతా సంపూర్ణ సాధికారత సాధించినప్పుడు మాత్రమే రాజ్యాధికారానికి అర్థముంటుంది.

సెల్ : 7730877841

గొప్ప పోరాట వీరనారి సమ్మక్క

జనగామ నర్సింగ్

ఈ దేశంలో తరతరాలుగా "మనుస్మృతి" అమలవుతున్నది. ఇది అసమానతలకు, అంటరానితనానికి కుళ్లికంపు కొడుతున్న నీతికి చిహ్నం. 1950 సంవత్సరంలో భారత ప్రజలకు ఒకే చట్టం, ఒకే న్యాయం, సమాన హక్కులు ఉండాలని, సమానత్వాన్ని బోధించే "రాజ్యాంగం"ను బాబాసాహెబ్ బి.ఆర్.అంబేద్కర్ దేశానికి అందించారు. దళిత, బడుగు బలహీన వర్గాల మీద భౌతికంగా, సాంస్కృతి పరంగా అనేక దాడులను కొనసగిస్తున్నారు. ఈ అగ్రకుల పెత్తందారీ పాలకులు చరిత్ర పరంగా చూస్తే ఈ దేశ మూల పురుషులు. గొప్ప రాజు అయిన రావణాసురుడిని చంపి దీపావళి, మైసాసురున్ని చంపి దసరా, హోళీ పండుగను జరుపుతున్నారు. మనకు తెలియకుండానే మనువాదం మన మస్తిష్కానికి అంటుకున్నది. ఈమధ్య కాలంలో మనువాద కుట్రలను వ్యతిరేకిస్తూ రాక్షసులు కాదు మహారాజులు రావణాసురుడు, మైసాసురుడు, వాలీ, సుగ్రీవుడు అని బహుజన వాదులు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అదే విధంగా సమ్మక్కను, వారి కుటుంబ సభ్యులను మట్టుబెట్టిన కాకతీయరాజు ప్రతాపరుద్రుడు మన దష్టిలో "మనువాదే". ఎందుకంటే కప్పం కట్టక పోవడానికి కారణం కరువు, కాటకాలు వచ్చి మేడారం రాజ్యం చుక్క నీరు దొరకడమే కష్టంగా ఉన్న పరిస్థితుల్లో కొంత సమయం ఇవ్వాలని "మానవతావాదం"తో అడిగితే అహంకారపూరితంగా తిరస్కరించి, మేడారం రాజ్యంపై దండెత్తి సమ్మక్కను వారి కుటుంబ సభ్యులను చంపి, ఘోర నష్టాన్ని కలిగించిన కాకతీయ రాజు ప్రతాపరుద్రుడు దుర్మార్గుడు.

కప్పం కట్టడానికి కొంత సమయం ఇవ్వాలని ప్రతాపరుద్రున్ని వేడుకున్నప్పటికీ, పదిగిద్దెరాజు మాట వినకుండా, మట్టు పెట్టాలని నిర్ణయం తీసుకోవడం వెనుక ప్రధాన కారణాలు.

మొదటిది:- పొలాస రాజు మేడరాజుకు ఆశ్రయం కల్పించడం, రెండవది:- కోయ, గిరిజనులను ఐక్యం చేసి కాకతీయ రాజ్యాన్ని ధిక్కరిస్తున్నాడని, మూడవది:- కప్పం కట్టడం లేదని. ఇవన్ని మనసులో ఉంచుకొని ప్రతాపరుద్రుడు తన మంత్రి యుగంధరిణి పురమాయించి మేడారంపై దండయాత్ర చేయిస్తాడు.

కాకతీయ సైన్యాన్ని, మేడారం కోయ సైన్యం సంపెంగ వాగు వద్ద అడ్డుకుంటుంది. శిక్షణ పొందిన కాకతీయ సైన్యం, అధునాతన ఆయుధాలు, అశ్వ, గజ బలం, వేలాది మంది సైన్యం ఒక్కసారిగా కోయ సైన్యంపై విరుచుకుపడింది. సాంప్రదాయ ఆయుధాలు మాత్రమే ధరించిన పదిగిద్దెరాజు, సమ్మక్క, సారలమ్మ, గోవిందరాజులు, నాగులమ్మ, జంపన్నలు వీరోచితంగా పోరాటం చేయడం జరిగింది. ఘోరాతి, ఘోరంగా జరిగిన యుద్ధంలో ఆధునాతన ఆయుధాల ముందు, సాంప్రదాయ ఆయుధాలు నిలువలేక యుద్ధ రంగంలో మేడరాజు, పడిగిద్దెరాజు, సారలమ్మ, గోవిందరాజులు, నాగులమ్మలు మరణిస్తారు. కాకతీయుల చేతిలో ఓటమిపాలు కావడం ఇష్టం లేక, పరాజయం చెందుతున్న వార్తను విని సంపెంగ వాగులో దూకి జంపన్న ఆత్మహత్య చేసుకుంటాడు (ఆ వాగు పేరు నేటికీ జంపన్న వాగుగా ప్రసిద్ధి). తదనంతరం సమ్మక్క వీరి మరణ వార్తను విని యుద్ధంలోకి దిగి అనేక మంది కాకతీయుల సైన్యాన్ని మట్టుబెట్టింది. సమ్మక్క ధైర్యసాహసాలు, యుద్ధంలో పోరాటం చేసిన తీరుకు కాకతీయ సైన్యం ఉక్కిరిబిక్కిరిగా నివ్వెరపోవడం జరిగింది. సమ్మక్కను వెతుక్కుంటూ వెళ్లిన కోయసైన్యానికి ఆమె కనిపించలేదు. ప్రతి 2 సంవత్సరాలకు ఒకసారి సమ్మక్క, సారక్క జాతరను యావత్ సమాజం అత్యంత భక్తి, శ్రద్ధలతో జరుపుకుంటున్నారు.

ఈ సమాజం మహిళల ప్రతిభ, పోరాట స్ఫూర్తిని అణచివేస్తున్నది. అందుకు నిదర్శనం జల్కరిబాయి,



మేడారంలోని సమ్మక్క, సారలమ్మ విగ్రహాలు

పూలన్ దేవి, సావిత్రిబాయి, సమ్మక్క, సారలమ్మ, చాకలి ఐలమ్మ ఇలాంటి మహిళామణుల చరిత్ర పోరాట గాథలను, పోరాట స్ఫూర్తిని నింపే విధంగా చేయడంలో ప్రభుత్వాలు, పౌర సమాజం నిర్లక్ష్య ధోరణిలో ఉన్నాయి. అందుకు ప్రధాన కారణం వీరంతా అణగారిన వర్గాలు కావడం. సమ్మక్కను దేవతగా కాకుండా, ఒక పోరాట వీరనారిగా యావత్ ప్రపంచానికి చూపించాల్సి ఉంది. అందుకు సమ్మక్కపై అనేక పరిశోధనలు జరగాలి. వారి పోరాట స్ఫూర్తిని ముందుకు తీసుకుపోవడానికి సమ్మక్క వీర పోరాటాన్ని సాహిత్యం రూపంలో ముందుకు తీసుకు వస్తే మహిళలు స్ఫూర్తి పొంది, పోరాట పటిమను నేర్చుకొని, జీవితంలో ఎదురైన సమస్యలు పరిష్కరించుకోవడానికి ఒక గొప్ప మార్గంగా భావిస్తారు. కావున మనమంతా ఆమె పోరాట స్ఫూర్తిని ముందుకు తీసుకు వెళ్దాం. సమ్మక్కను దేవతగా కాదు, అణగారిన వర్గాల గొప్ప వీరనారిగా భావిద్దాం.

సెల్: 9949200562

'గో సంరక్షణ' మాటున దళితులపై దాడి

దుడుక రామకృష్ణ

బాధితులపైనే కేసు నమోదు • ఊర్లోకి వచ్చినా పలుకరించని ప్రభుత్వ విప్

ఉత్తర భారతదేశంలో గోసంరక్షణ మాటున జరుగుతున్న దాడులు యాదాద్రిభువనగిరి జిల్లాకు విస్తరించాయి. తెలంగాణ తిరుపతిగా అభివృద్ధి జరుగుతున్న యాదాద్రిలో కాషాయమూకలు గో సంరక్షణ మాటున దాడులు చేసి లబ్ధి పొందడానికి పథకం ప్రకారం వ్యవహరిస్తున్నట్టు తెలుస్తోంది. ప్రజల్లో ఉన్న ఆధ్యాత్మిక భావనను సాకుగా చూపి గోవును దేవతగా చిత్రీకరించి గో వధ చేసే వర్గాలపై దాడులు చేసే వ్యూహంతో ముందుకు సాగుతున్నాయి. దళితుల సంస్కృతిలో భాగమైన గో మాంసాన్ని తినేందుకు సంక్రాంతి పండుగకు ముందు రోజు యాదగిరిగుట్ట మండలం చిన్నకందుకూరులో దళితులు ఆవును కోస్తుండగా అర్ధరాత్రి కాషాయ మూకలు చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని వారిపై దాడి చేయడమే ఇందుకు నిదర్శనం. 'మీరు హిందువులా... ముస్లింలారా..? లం....కొడుకుల్లారా.. మిమ్మల్ని కూడా ఆవును కోసినట్టే కోయాలా..? ఇక్కడే పాతిపెడుతాం' అంటూ దళితులను రాయడానికి వీలుకాని పదజాలంతో దూషించారు. ఈ సంఘటన రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించింది. ప్రజాసంఘాలు, టీ మాస్ చొరవతో రెండు రోజులు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సామాజిక కార్యకర్తల ఆందోళనతో కాషాయ మూకలపై కేసులు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేశారు. ఘటన జరిగి 20 రోజులు దాటిన్నా ఇప్పటి వరకు నిందితులను అరెస్ట్ చేయకపోవడంపై దళిత, ప్రజా సంఘాలు అగ్రహిస్తున్నాయి. అభివృద్ధి పనులు ప్రారంభించడానికి గత నెల 22న గ్రామానికి వచ్చిన ప్రభుత్వ విప్ గొంగిడి సునీత దళితకాలనీకి వంద మీటర్ల దూరం వరకు వచ్చారు. కానీ దళితులను ఈ ఘటనపై పరామర్శించడానికి మనస్సు రాకపోవడం విచారకరం. ఘటన తర్వాత పోలీసులు దాడి చేసిన వారితోపాటు, దాడికి గురైన వారి మీద కూడా కేసులు నమోదు చేశారు. సంక్రాంతి ముందు రోజు రాత్రి జరిగిన ఈ దాడికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.

సంక్రాంతి పండుగ సందర్భంగా జనవరి 14వ తేదీ రాత్రి ఒంటి గంట సమయంలో ఊరిబయట చెట్లలో ఓ 20 మంది దళితులు ఎద్దును కోసుకుంటున్నారు. ఆ గ్రామ కులానికి చెందిన కొందరు పక్కన కూర్చుంటే మరో పది, పన్నెండు మంది పనిలో ఉన్నారు. వారున్న జాడ తెలుసుకున్న గోరక్షక ముఠాలు కార్లు, బైక్‌లపై 20 నుంచి 30 మంది వచ్చారు. వారి దగ్గర కర్రలున్నయ్. వస్తూనే కులం పేరుతో, నీ అమ్మ, అక్క, లం...కొడుకా.. అంటూ బండబూతులు తిడుతూ దళితులపై విరుచుకుపడ్డరు. "మీరు హిందువులా.. ముస్లింలారా? 'ఆవును కోసుకు తింటార్రా?' అంటూ కులం పేరు పెట్టి అసభ్య పదజాలంతో దూషించారు. వచ్చిన వాళ్లను చూసి ముందు సివిల్ డ్రెస్‌లో ఉన్న పోలీసులనుకుని 'దండం పెడత సారు... కాళ్ల మొక్కుత దొరా... పండుగని తెచ్చుకున్నం సారు...' అని దళితులు ప్రాధేయపడినా వినలే. 'ఈ ఆవు కాద్నే నిన్ను పీక కోసి చంపుతం' అంటూ కత్తులు అందుకున్నారు. "మేం మాదిగోళ్లం, ఎస్సీలం. తాతలు, ముత్తాతల కాలం నుంచీ మాది ఇదే వృత్తి. బర్రెగొడ్లు, బక్కావులను తెచ్చుకొని కోసుకు తింటం. అట్లనే మొన్న పండుగనాడు మా ఊరువాళ్లం జనగామ జిల్లా నవాబ్‌పేట అంగట్లో ఆవును తెచ్చుకున్నాం" అని చెబుతున్నా వినిపించుకోలేదు. వారు మా మీద పడి కొడుతుండటంతో అందరు చెట్లల్లోకి ఉరికిండ్రు. ఎర్ర చంద్రయ్య వారి చేతికి దొరకగా మీద పడి గుద్దుతూ, తన్నుతూ దాడిచేసిన్రు. 'దాడికి వచ్చింది పోలీసులనుకున్నాం, కులం పేరుతో తిడుతూ కొట్టారు.. దీంతో నేను ఎలాగో వదిలించుకుని అక్కడి నుంచి ఉరికిన. మేం రాత్రంతా ఊరి బయట చెట్ల మధ్యనే ఉన్నం. తెల్లారేవరకూ అక్కడనే పడుకున్నాం" అని ఆ రాత్రి ఏం జరిగిందో బాధితుడు ఎర్ర చంద్రయ్య తెలిపారు. 'పొద్దుగాల ఊళ్లోకెళ్లిన తర్వాత తెలుసుకున్నం. మాపై దాడి చేసింది ఆర్ఎస్ఎస్ వాళ్లని. వాళ్లలో ఓ ఐదారుగురిని గుర్తుపట్టినం. 15వ తేదీన మోటకొండూరు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసినం" అని చంద్రయ్య చెప్పారు. ఎర్ర మల్లయ్య, బూషెపాక ఎల్లయ్య, బొల్లారం యాదయ్య, ఎర్ర నర్సయ్య తదితరులు కూడా ఈ దాడిలో గాయపడ్డారు.

ఆవును తినడం మాదిగల ఆచారం

సంక్రాంతి పండుగకు ఏదో ఒక మాంసం తినటం మాదిగ ఇండ్లలో తరతరాలుగా వస్తున్న అలవాటు. ఆవు మాంసం తినటం వారి జీవితంలో భాగమే. ఊర్లో అందరూ తలా కొంచెం డబ్బులు వేసుకుని ఓ గొడ్డును తెచ్చి కోసుకుని తెల్లారేసరికి పంచుకోవటం ఎన్నో ఏండ్లుగా వస్తున్న అలవాటు. ఈ సంక్రాంతికి ముందు రోజు రాత్రి అలాగే ఒక వట్టిపోయిన ఆవును తెచ్చుకుని కోసుకుంటున్నప్పుడు దాదాపు 30 మంది కర్రలతో వచ్చి మాదిగలపై దాడి చేశారు. పోలీసులు చెదరగొట్టేందుకు వచ్చారేమోననుకుని దళితులంతా చెల్లచెదరయ్యారు. నలుగురైదురు మాత్రం తప్పించుకోలేకపోయారు. వారిని తీవ్రంగా కొట్టారు. తరతరాలుగా తింటున్న తిండి ఇప్పుడు తప్పెట్లా అవుతుందనేది వారికి ఇంకా అర్థం కాక అయోమయంలో ఉన్నారు. ఈ లోగా దాడి చేసిన వారే పోలీసులకు ఫోన్ చేసి ఆవును కోస్తున్నారని, సమాచారమిచ్చి బాధితుల్ని పట్టుకుని, ఆవును తీసుకొచ్చి సంప్రదాయబద్ధంగా పూడ్చిపెట్టాలని బెదిరించారు. దళితులు కోసిన చోటనే వారికి భయపడి పూడ్చిపెట్టారు. పోలీసులు గంటలోనే ఊర్లోకి వచ్చి బాధితుల ఇండ్లపై దాడి చేశారు. ఇండ్లల్లో ఉన్న ఆడవాళ్లను పోలీసులు సైతం దూషించారు. అలాగే ఎర్ర చంద్రయ్య మద్యం బెల్టు దుకాణం నిర్వహిస్తున్నారంటూ.. వారి ఇంటిలో ఉన్న మద్యం సీసాలను పట్టుకెళ్లారు.



ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఏసీపీ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న దృశ్యం

ప్రజాసంఘాల చొరవతో..

దాడి జరిగిన తెల్లారి దళితులు మోటకొండూరు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. అక్కడ పోలీసుల నుంచి కూడా చీదరింపులు ఎదురయ్యాయి. 'తప్పు చేసి ఫిర్యాదు చేయడానికి వచ్చారా' అంటూ పోలీసుల నుంచి ఎదురు దాడి మొదలైంది. "ఆవును కోసినందుకు మీ మీదనే కేసు నమోదైందని" పోలీసులు చెప్పడంతో దళితులు బెంబేలెత్తారు. న్యాయం కోసం వెళ్తే ఆన్యాయం జరిగిందని మదనపడుతూ సీపీఐ(ఎం) నాయకులను ఆశ్రయించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి కొండమడుగు నర్సింహ్మా, కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్పంగి స్వామిలకు సమాచారమివ్వడంతో వారు దళిత కాలనీని సందర్శించి బాధితుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వీరి చొరవతో రెండు రోజుల ఆలస్యంగా ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. వెంటనే టీ మాస్ రాష్ట్ర కన్వీనర్ జాన్‌వెస్లీ, ఉ.సాంబశివరావు, స్టీరింగ్ కమిటీ సభ్యులు పైళ్ల ఆశయ్య, సుర్పంగ శివలింగం, సీపీఐ (ఎం) జిల్లా కార్యదర్శి ఎండి.జహంగీర్, టీ మాస్ జిల్లా చైర్మెన్ బట్టు రాంచంద్రయ్య, జిల్లా కన్వీనర్ కల్లూరి మల్లేశంలు ఘటనపై స్పందించి దళితులను సంఘటితం చేసి యాదగిరిగుట్ట ఏసీపీ కార్యాలయాన్ని మట్టడించడంతో దాడి చేసిన ఐదుగురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేసినట్టు పోలీసులు ప్రకటించారు.

ఊరికి వచ్చినా పలుకరించలే..!

దళితులపై దాడి జరిగిన ఘటన వెలుగులోకి వచ్చిన తరువాత ఈ నెల 22న ప్రభుత్వ విప్ గొంగిడి సునీత గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించడానికి వెళ్లారు. దళిత కాలనీకి వంద మీటర్ల దూరం వరకు వెళ్లారు. కానీ బాధిత దళితుల వద్దకు వెళ్లలేదు. వారిని పరామర్శించనూ లేదు. 'ఓట్ల కోసం వచ్చినప్పుడు మీకోసం అది చేస్తా.. ఇది చేస్తా. మీ కాలుకు ముల్లు గుచ్చుకుంటే నాపంటితో తీస్తా' అని చెప్పిన ఆ పార్టీ నాయకురాలు తమ ఊరికి వచ్చినా మమ్మల్ని పలుకరించలే..! పట్టించుకోలేదని దళితులు వాపోయారు.

సెల్ : 9490094402

మా మీదనే కేసు పెట్టారు



మా మీద కేసు పెట్టినారని అన్నరు, గానీ అది ఏం కేసో మాకు ఇప్పటికీ పోలీసులు చెప్పలేదు. దాడి చేసిన వారి మీద మేము ఫిర్యాదు చేయడానికి వెళ్తే పోలీసులు మమ్మల్నే తిట్టారు. ప్రజాసంఘాలు ఇచ్చిన భరోసా మమ్మల్ని బతికిస్తోంది.

- ఎర్ర చంద్రయ్య, బాధితుడు

కేసు నీరుగారుస్తున్నారు



దాడిచేసిన వారిని వదిలేసి బాధితులపైనే పోలీసులు కేసు నమోదు చేశారు. వారి మీద ఆవును చంపారని, పరిమితికి మించి మద్యం కలిగివున్నారని కేసులు నమోదు చేశారు. అస్సలు నేరస్తులను వదిలిపెట్టి అనామకుల మీద కేసు నమోదు చేశారు. రాష్ట్రంలో గోవధ నిషేధ చట్టం అమలులో ఉందా..? ఈగోవధ నిషేధం చట్టాన్ని ఎవరు ఏ రూపంలో అమలు చేసినా అది రాజ్యాంగ విరుద్ధం.

కొండమడుగు నర్సింహ్మా, వ్యకాస జిల్లా కార్యదర్శి

సూత్రదారులను ఎందుకు వదిలారు..?



ఈ దాడిలో సూత్రదారులను వదిలి పోలీసులు అనామకులపై కేసులు పెట్టారు. గతంలో యాదగిరిగుట్టలో కూడా గో సంరక్షణ మాటున దాడులు చేసిన సూత్రదారులే ఈ దాడిలో ఉన్నారు. వారిపై పోలీసులు కచ్చితంగా కేసులు పెట్టాలి. దళితులపై 30 మంది వరకు దాడి చేస్తే 5 మందిపైనే కేసులు పెట్టారు. పోలీసులు కావాలనే కేసును నీరుగార్చే విధంగా ప్రయత్నిస్తున్నారు. దళితులు ఆవును కోసారని కేసులు ఎలా పెడుతారు.

సిర్పంగి స్వామి, కేవీపీఎస్ జిల్లా ప్రధానకార్యదర్శి

కేసు దర్యాప్తు చేస్తున్నాం



దళితులు ఆవును కోసారన్న అభియోగంలో గోవధ నిషేధ చట్టం కింద కేసు నమోదు చేశాం. అలాగే ఒక దళితుడు నిర్వహిస్తున్న బెల్టు షాపులో రూ.20 వేల నుంచి రూ.40 వేల విలువైన మద్యం లభించింది. దీనిమీద ఎక్సైజ్ చట్టం సెక్షన్ 34ఎ కింద కేసు నమోదైంది. దళితుల మీద దాడి చేసిన కేసులో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ కింద ఐదుగురిపై కేసులు నమోదు చేశాం.

సముద్రాల శ్రీనివాసాచార్యులు ఏసీపీ

ఐసీసీ మతిలేని చర్య!

దక్షిణాఫ్రికాతో సెంచూరియన్ వన్డేలో ఊహించని పరిణామం చోటుచేసుకున్నది. ఛేదనలో టీమ్ ఇండియా మరో రెండు పరుగులు చేయాల్సి ఉండగా.. అంపైర్లు ' లంచ్ విరామం' ప్రకటించారు. దీంతో ఐసీసీపై అన్ని వైపులా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిజానికి నిబంధనల ప్రకారం భారత్ 15 ఓవర్లలో 93/1 వద్ద ఉండగా లంచ్ విరామం ఉండాలి. కానీ లక్ష్యం చేరువలో ఉండటంతో నాల్గు ఓవర్లు పొడగించారు. 19 ఓవర్లలో మనోళ్లు 117 పరుగులే చేశారు. అయినా అంపైర్లు నిబంధనల ప్రకారం 40 నిమిషాల లంచ్ బ్రేక్ ఇచ్చారు. దీంతో ఇరు జట్లూ అసహనం వ్యక్తం చేశాయి. స్టేడియంలోని ప్రేక్షకులు సైతం కుర్చీలు ఖాళీ చేసి వెళ్లిపోయారు. ఐసీసీ నిర్ణయం పట్ల క్రికెట్ వ్యాఖ్యాతలు, క్రికెట్ పండితులు తీవ్ర విమర్శలు గుప్పించారు. ' ప్రభుత్వ రంగ బ్యాంక్‌లు వినియోగదారులకు చెప్పినట్టు.. మధ్యాహ్న భోజనం తర్వాత రా... అని చెప్పినట్టు ఉంది' అని వీరేంద్ర సెహ్వాగ్ వ్యంగ్యంగా ట్వీట్ చేశాడు. ఐసీసీ చర్య మతిలేని చర్య అని విండీస్ దిగ్గజం మైకెల్ హోల్డింగ్ విమర్శించాడు.


పి.వి సింధు

రన్నరప్‌తో సరి..

- ఫైనల్లో బీవెన్ జాంగ్ చేతిలో ఓటమి
- టైటిల్ నిలుపుకోని సింధు
- ఇండియా ఓపెన్ బ్యాడ్మింటన్

నవతెలంగాణ-న్యూఢిల్లీ

బ్యాడ్మింటన్ అగ్రశ్రేణి క్రీడాకారిణి పి.వి సింధు మరోసారి తుది అడుగు తడబడింది. ఇండియా ఓపెన్ ఫైనల్లో గెలుపు ఖాయమనుకున్న మ్యాచ్‌లోనూ సింధు టైటిల్ సాధించలేదు. వరల్డ్ నెం.11, అమెరికా అమ్మాయి బీవెన్ జాంగ్ చేతిలో మూడు గేముల మ్యాచ్‌లో సింధు పరాజయం పాలైంది. రన్నరప్‌గా నిలిచి టైటిల్ నిలుపుకోలేకపోయింది. 21-18, 11-21, 20-22తో సింధు ఓటమి పాలైంది. 70 నిమిషాల టైటిల్ పోరులో సింధు పైచేయి సాధించలేదు. తొలి గేమ్‌లో నెగ్గినా.. సింధు వరుసగా తర్వాతి రెండు గేముల్లో తడబడింది. నిర్ణయాత్మక మూడో గేమ్ టైబ్రేకర్‌కు దారితీయగా అమెరికా అమ్మాయి ముందంజ వేసింది. ఇండియా ఓపెన్ మహిళల సింగిల్స్ టైటిల్ ఎగరేసుకుపోయింది. తొలి గేమ్‌లో 3-0తో ముందంజలో నిలిచిన సింధు విరామ సమయానికి 10-11తో వెనక్కి తగ్గింది. కానీ ద్వితీయార్థంలో పుంజుకున్న సింధు 15-15తో స్కోరు సమం చేసి 17-16, 19-18తో ముందం వేసింది. ఆఖర్లో రెండు వరుస పాయింట్లతో తొలి గేమ్ దక్కించుకున్నది. కానీ రెండో గేమ్‌లో సింధు పూర్తిగా నిరాశపరిచింది. 2-8తో వెనకడుగు వేసిన సింధు 6-11, 19-9తో నిరాశపరిచింది. దీంతో ఫలితం కోసం మూడో గేమ్ ఆడక తప్పలేదు. నిర్ణయాత్మక గేమ్‌లో 4-4తో సమవుజ్జీగా నిలిచినా.. వరుసగా ఐదు పాయింట్లు కోల్పోయి వెనుకంజ వేసింది. కానీ ద్వితీయార్థంలో హోరాహోరీగా ఆడిన జాంగ్, సింధులు 11-11 నుంచి 15-15 వరకూ నువ్వా నేనా అన్నట్టు ఆడారు. ఆఖర్లో మెరిసిన సింధు 19-18తో ఆధిక్యం సాధించినా.. జాంగ్ సింధును నిలువరించి టైబ్రేకర్‌లో ఇండియా ఓపెన్‌ను సొంతం చేసుకున్నది.

మణికట్టు మాయగాళ్లు మరోసారి మాయ చేశారు. అంతుచిక్కని బంతులతో ప్రత్యర్థిని అయోమయంలోకి నెట్టేస్తోన్న చాహల్, కుల్దీప్‌లు సెంచూరియన్‌లోనూ చెలరేగారు. పచ్చిక లేని పిచ్‌పై సఫారీ భరతం పట్టారు. చాహల్ (5/22), కుల్దీప్ (3/20) విజృంభించగా సొంతగడ్డపై దక్షిణాఫ్రికా 118 పరుగులకే కుప్పకూలింది. స్వల్ప ఛేదనలో ఓపెనర్ శిఖర్ ధావన్ (51), కెప్టెన్ కోహ్లి (46) అజేయ ఇన్నింగ్స్‌తో మరో 30 ఓవర్లలుండగానే భారత్ 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఆరు వన్డేల సిరీస్‌లో 2-0తో ఆధిక్యం సొంతం చేసుకున్నది.

సఫారీ ధమాల్

చాహల్, కుల్దీప్ మణికట్టు మాయ

118 పరుగులకే కుప్పకూలిన దక్షిణాఫ్రికా
- ధావన్, విరాట్ కోహ్లి మెరుపులు
- 2-0తో ఆధిక్యం భారత్ సొంతం

నవతెలంగాణ-సెంచూరియన్

టెస్టు ఓటమికి టీమ్ ఇండియా కసిగా బదులు తీర్చుకుంటోంది!. వరుసగా రెండు వన్డేల్లో దక్షిణాఫ్రికాను వారి సొంతగడ్డపైనే చిత్తు చిత్తుగా ఓడించింది. మణికట్టు స్పిన్నర్లు యుజ్వేందర్ చాహల్ (5/22), కుల్దీప్ యాదవ్ (3/20) మాయలో పడిన సఫారీలు 118 పరుగులకే కుప్పకూలారు. ఆమ్లా (23), డికాక్ (20), డుమిని (25), జొండో (25)లు మాత్రమే 20 ప్లస్ పరుగులు చేయగలిగారు. స్వల్ప ఛేదనలో ధావన్ (51 నాటౌట్, 56 బంతుల్లో 9 ఫోర్లు), విరాట్ కోహ్లి (46 నాటౌట్, 50 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్) రెండో వికెట్‌కు అజేయంగా 93 పరుగులు జోడించగా భారత్ 20.3 ఓవర్లలోనే 9 వికెట్ల తేడాతో గెలుపొందింది. కెరీర్ తొలి ఐదు వికెట్ల ప్రదర్శన చేసిన చాహల్ ' మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. సిరీస్‌లో తర్వాతి మ్యాచ్ కేప్‌టౌన్‌లో బుధవారం జరగనున్నది.

ధావన్, కోహ్లి జోరు : స్వల్ప ఛేదనలో ఓపెనర్ రోహిత్ శర్మ (15) ఆరంభంలోనే అవుటయ్యాడు. రెండు ఫోర్లు, ఓ సిక్సర్‌తో బూమ్ బూమ్ అనిపించినా.. రబాడా బౌలింగ్‌లో వికెట్ పారేసుకున్నాడు. అప్పటికి భారత్ స్కోరు 26. ఈ దశలో మరో ఓపెనర్ శిఖర్ ధావన్ (51)తో జట్టు కట్టిన కెప్టెన్ కోహ్లి (46) ఇన్నింగ్స్‌ను కొత్త పుంతలు తొక్కించాడు. వీరిద్దరూ ధాటిగా ఆడటంతో స్కోరు బోర్డు పరుగులు పెట్టింది. కోహ్లి నాల్గు ఫోర్లు, ఓ భారీ సిక్సర్ కొట్టాడు. ధావన్ తొమ్మిది బౌండరీలతో అర్ధ సెంచరీ పూర్తి చేశాడు. సఫారీ బౌలర్లను అలవోకగా ఎదుర్కొన్న ఈ జోడీ 20.3 ఓవర్లలోనే ఛేదనను ముగించింది. దక్షిణాఫ్రికాకు సొంత గడ్డపై అత్యంత దారుణ ఓటముల్లో ఇదీ ఒకటి కావటం విశేషం.


శిఖర్ ధావన్ (51)*

చాహల్, కుల్దీప్ కూల్చేశారు : టాస్ నెగ్గి తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న టీమ్ ఇండియాకు పేసర్ భువనేశ్వర్ తొలి బ్రేక్ అందించాడు. ఓపెనర్లు ఆమ్లా (23), డికాక్ (25)లు తొలి వికెట్‌కు శుభారంభం నెలకొల్పే పనిలో నిమగ్నమయ్యారు. కానీ కీలక ఆమ్లా వికెట్ కూల్చిన భువనేశ్వర్.. తొలి వికెట్ అందించాడు. కొద్దిసేపటికే చాహల్ మాయలో పడిన డికాక్ పెవిలియన్‌కు చేరుకున్నాడు. తర్వాతి ఓవర్లోనే వరుసగా మార్క్‌రం (8), డెవిడ్ మిల్లర్ (0) వికెట్లు తీసిన కుల్దీప్ యాదవ్ దక్షిణాఫ్రికాను కోలుకోలేని దెబ్బ తీశాడు. ఈ తరుణంలో జొండో (25), డుమిని (25)లు ఇన్నింగ్స్‌ను కాసేపు నిలిపారు. కానీ జొండోను అవుట్ చేసిన చాహల్.. అక్కడ్నుంచి వరుసగా వికెట్లు కూల్చాడు. మోర్కెల్ (1), మోరీస్ (14), డుమిని (25)లనూ బలిగొన్న చాహల్ సఫారీని చుట్టేశాడు. దీంతో ఆజట్టు 118 పరుగులకే కుప్పకూలింది. ఆఖర్లో కుల్దీప్, బుమ్రాలు సైతం చెరో వికెట్‌తో సఫారీ పతనాన్ని పరిపూర్ణం చేశారు.




యుజ్వేందర్ చాహల్

' నాకిదే తొలి విదేశీ పర్యటన, ఎంతగానో ఆస్వాదిస్తున్నాను. పరిస్థితులు భారత్ కంటే మరీ భిన్నంగా ఏమీ లేవు. మానసికంగా ఎంత దృడంగా ఉన్నామనేది కీలకం. నేను ఓ వికెట్ తీయగానే, కుల్దీప్ వెంటనే రెండు కూల్చాడు. ఒత్తిడి బ్యాట్స్‌మన్‌పై పడింది. ఐదు వికెట్ల ప్రదర్శన పట్ల సంతోషంగా ఉంది'
- యుజ్వేందర్ చాహల్, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్ : ఆమ్లా (సి) ధోని (బి) భువనేశ్వర్ 23, డికాక్ (సి) పాండ్య (బి) చాహల్ 20, మర్క్‌రం (సి) భువనేశ్వర్ (బి) కుల్దీప్ 8, డుమిని (ఎల్బీ) చాహల్ 25, మిల్లర్ (సి) రహానె (బి) కుల్దీప్ 0, జొండో (సి) పాండ్య (బి) చాహల్ 25, మోరీస్ (సి) భువనేశ్వర్ (బి) చాహల్ 14, రబాడ (ఎల్బీ) కుల్దీప్ 1, మోర్కెల్ (ఎల్బీ) చాహల్ 1, ఇమ్రాన్ తాహీర్ (బి) బుమ్రా 0, షంసి నాటౌట్ 0, ఎక్స్‌ట్రాలు : 01, మొత్తం : (32.2 ఓవర్లలో ఆలౌట్) 118.

బౌలింగ్ : భువనేశ్వర్ 5-1-19-1, బుమ్రా 5-1-12-1, పాండ్య 5-0-34-0, చాహల్ 8.2-1-22-5, కుల్దీప్ 6-0-20-3, జాదవ్ 3-0-11-0.

భారత్ ఇన్నింగ్స్ : రోహిత్ శర్మ (సి) మోర్కెల్ (బి) రబాడ 15, శిఖర్ ధావన్ నాటౌట్ 51, కోహ్లి నాటౌట్ 46, ఎక్స్‌ట్రాలు : 07, **మొత్తం : (20.3 ఓవర్లలో వికెట్ నష్టానికి) 119.**

బౌలింగ్ : మోర్కెల్ 4-0-30-0, రబాడ 5-0-24-1, మోరీస్ 3-0-16-0, తాహిర్ 5.3-0-30-0, షంసి 3-1-18-0.

ప్రపంచ జట్టులో మనోళ్లు ఐదుగురు

క్రైస్ట్‌చర్చ్ : అండర్-19 ప్రపంచకప్‌ను సాధించిన యువ భారత్ ఐసీసీ అండర్-19 జట్టులో సింహభాగం స్థానాలు సొంతం చేసుకున్నది. నిపుణుల ప్యానెల్‌తో కూడిన బృందం ప్రపంచ యువ జట్టును ఎంపిక చేసింది. టోర్నీలో దుమ్మురేపిన మన ఆటగాళ్లకు ఈ జట్టులో చోటు లభించింది. కెప్టెన్ పృథ్వీ షా (261 పరుగులు), మన్జోత్ కల్రా (252 పరుగులు), శుభ్‌మన్ గిల్ (372 పరుగులు) సహా బౌలర్లు అనుకూల్ రాయ్ (14 వికెట్లు), కమలేశ్ నాగర్‌కోటి (9 వికెట్లు) ఐసీసీ జట్టులో చోటుచేసుకున్నారు. శనివారం జరిగిన ఫైనల్లో ఆస్ట్రేలియాపై మనోళ్లు 8 వికెట్ల తేడాతో గెలుపొంది రికార్డు స్థాయిలో నాల్గోసారి అండర్-19 ప్రపంచకప్‌ను గెలుపొందిన సంగతి తెలిసిందే.



రైతన్నకు చేరేదెప్పుడు!


ఫైల్

ఇటు పాసుబుక్కులు..అటు ధరణి వెబ్‌సైట్

- తేదీలు పొడిగించినా స్పందన కరువు
- ఉన్నతాధికారుల తర్జనభర్జన
- సీఎం దృష్టికి వ్యవహారం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రైతుల పాసుబుక్కులు, టైటిల్ డీడ్ల ముద్రణకు, ధరణి వెబ్‌సైట్ రూపకల్పనకు సర్కారుకు బిడ్డర్లు దొరకడం లేదు. ఇప్పటికే రెండుసార్లు టెండర్లకు తేదీలు పొడిగించినా స్పందన కరువైంది. మరో నెల రోజుల్లో రైతులకు పాసుబుక్కులు అందజేయాల్సి ఉంది. రెవెన్యూ రికార్డుల తనిఖీలు ఇప్పటికే పూర్తయ్యాయి. మరోసారి పరిశీలన జరుగుతున్నది. అయితే ఇప్పటికీ టెండర్లు ఖరారు కాకపోవడంతో అధికార యంత్రాంగం తర్జనభర్జనలు పడుతున్నది. మార్చి 11న రాష్ట్ర వ్యాప్తంగా రైతులకు పాసుపుస్తకాలు పంపిణీ చేయాల్సి ఉంది. ఈనేపథ్యంలో బిడ్డర్లు దొరకకపోవడంతో ఉన్నతాధికారులు ఆందోళన చెందుతున్నారు. దీంతో చివరకు రైతు పాసుపుస్తకాలను ప్రభుత్వ ప్రింటింగ్ ప్రెస్‌లో ముద్రించేందుకు చర్చలు చేస్తున్నారు. ధరణి వెబ్‌సైట్ సంగతి ఇంకా కొలిక్కి రాలేదు. వ్యవహారాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లినట్టు సమాచారం. దీనిపై ఒకటిరెండు రోజుల్లో నిర్ణయం తీసుకోనున్నారు. ఈ రెండింటికి దాదాపు రూ. 400 కోట్లు ఖర్చు కానుంది.

ధరణీ వెబ్‌సైట్

ఇకపోతే ప్రభుత్వ, ప్రయివేటు భూముల వివరాలను అప్‌లోడ్ చేసేందుకు ప్రత్యేకంగా ధరణి వెబ్‌సైట్‌కు రూపకల్పన చేయాలని ప్రభుత్వం భావించింది. ఇందుకోసం రూ. 200 కోట్లు వ్యయం అవుతుందని అధికారుల అంచనా. దాదాపు 4 కోట్ల సర్వే నెంబర్లను అప్‌లోడ్ చేసేలా రూపొందించాలని సర్కారు భావిస్తున్నది. దీని నిర్వహణ కోసం సబ్‌రిజిస్ట్రార్, తహశీల్దార్ కార్యాలయాల్లో ప్రత్యేకంగా ఒక్కో కంప్యూటర్ అపరేటర్‌ను నియమించాల్సి ఉంటుంది. వీరికి కనీసం రూ. 20 వేల నుంచి రూ. 25 వేలకు వేతనాలు చెల్లించాలి. తాజా సమాచారాన్ని ఎప్పటికప్పుడు (రియల్‌టైమ్ డాష్‌బోర్డు) తెలుసుకునేలా ఉంటుంది. దీని కోసం గత జనవరి 29 తేదీ వరకు టెండర్లను ఆహ్వానించారు. ఎవరూ దాఖలు చేయలేదు. ఫిబ్రవరి ఒకటో తేదీ వరకు పొడిగించారు. రెండే రెండే సంస్థలు టెక్నికల్ బిడ్లను దాఖలు చేసినట్టు సమాచారం. ఇందులో ఇన్‌వెస్ట్‌మెంట్ లీజింగ్, ఫైనాన్సియ్ సర్వీసెస్(ఐఎల్ అండ్ ఎఫ్ఎస్)తోపాటు మరో సంస్థలు టెండర్లు వేశాయి. కాగా ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ అర్హమైనదిగా గుర్తించారు. మరో సంస్థకు అర్హత లేదని సమాచారం.

ఇదిలావుండగా కనీసంగా రెండు అర్హత గల సంస్థలు బిడ్లను దాఖలు చేస్తేనే టెండర్లను అమోదించాలనే మార్గదర్శకాలు కూడా ఉన్నాయి. దీంతో రెవెన్యూ అధికారులు ఆ ప్రక్రియను సైతం ఆపేసినట్టు సమాచారం. ప్రభుత్వం విధించిన నిబంధనలు కూడా బిడ్డర్లకు ఆటంకంగా ఉన్నట్టు తెలిసింది. ఈనేపథ్యంలోనే బిడ్డర్లు వెనక్కి తగ్గినట్టు తెలిసిందని అధికారులు అంటున్నారు.

డోలాయమానంలో రైతు పాసుపుస్తకాలు

ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్‌శర్మ, రెవెన్యూ శాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ తివారీతో ఇటీవల సీసీఎల్‌ఏ అధికారులు భేటి అయ్యారు. ఈ సందర్భంగా టెండర్లకు సంబంధించిన పరిస్థితిని వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా 70 లక్షల పాసుబుక్కులు, టైటిల్ డీడ్లు అవసరం కానున్నాయి. వీటిని ముద్రించడానికి గత జనవరి 22వ తేదీ వరకు బిడ్డర్ల నుంచి టెండర్లను ఆహ్వానించారు. అయితే బిడ్డర్ల నుంచి స్పందన రాలేదు. మరోసారి ఫిబ్రవరి ఒకటి వరకు టెండర్ల దాఖలు తేదీని పొడిగించారు. అయినా ఎవరూ ముందుకు రాలేదు. దీంతో ప్రభుత్వంలో అయోమయం నెలకొన్నది. ఈనెలాఖరులోగా పాసుబుక్కులు, టైటిల్ డీడ్లు ముద్రించి జిల్లాలకు పంపాల్సి ఉంది. ఈమేరకు ఇప్పటికే ముఖ్యమంత్రి షెడ్యూల్‌ను ఖరారు చేసి జిల్లా కలెక్టర్లకు పంపిన విషయం విదితమే. అయితే ఆదిలోనే హంసపాదు అన్నట్టుగా బిడ్డర్లు ముందుకు రాకపోవడంతో ఇక హైదరాబాద్‌లోనే ప్రింట్ చేయించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. రాజీవ్‌శర్మ, రాజేశ్వర్‌తివారీతో జరిగిన సమావేశానికి ప్రభుత్వ ప్రింటింగ్ ప్రెస్ అధికారులను సైతం పిలిచారు. రైతు పాసుబుక్కులు, టైటిల్ డీడ్ల ముద్రణ, వాటికి అవసరమైన సెక్యూరిటీ ఫీచర్ల గురించి తెలియజేసినట్టు సమాచారం. దాదాపు రూ. 200 కోట్ల మేర ఖర్చయ్యే ఈ రైతు పాసుపుస్తకాలను ప్రింట్ చేయడానికి ప్రింటింగ్ ప్రెస్ అధికారుల నుంచి ఆశించిన స్పందన రాలేదని తెలిసింది. రెవెన్యూ అధికారుల సూచన మేరకు పలు రకాల సెక్యూరిటీ ఫీచర్లను ప్రభుత్వం అమోదించిన సంగతి తెలిసిందే. ఒకేసారి లక్షలాది పుస్తకాను ముద్రించడం సాధ్యమయ్యే పనికాదని చెప్పినట్టు సమాచారం. ఒకవేళ ప్రభుత్వ ప్రింటింగ్ ప్రెస్‌లోనే ముద్రించాలని భావిస్తే, పాత తరహాలోనే పుస్తకాలు ఉంటాయని తెలుస్తోంది. హైసెక్యూరిటీ ఫీచర్లపై ఆశలు వదులుకోవాల్సి ఉంటుందని అంటున్నారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.